ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ యం.రామకృష్ణ**
**డా॥ తుమ్మూరి**
**కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 12**

**మార్చి 2004**

**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**


## జీవించే కళ

జీవించే కళలో ఉంది జీవితం. ఏదో విధంగా, మొరటుగా, మోటుగా, సభ్యతకు దూరంగా బ్రతుకు వెళ్లదీస్తూ ఉండడం జీవితం కాదు. అసలు - జీవించే కళను తెలుసుకున్నవాడే నిజంగా జీవిస్తున్నవాడు. జీవితానికి అర్థం ఏమిటి? మనం ఎందుకు జన్మించాము? మనం ఏమి అవాలని కోరుతున్నాము? ఏమి పొందాలని కోరుతున్నాము? ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు పొందడంలోనే జీవన రహస్యం ఇమిడి ఉంది.

జీవితానికి గమ్యం ఏదో తెలియనప్పుడు - దారి సరైనది ఎలా అవుతుంది? ఎక్కడికీ చేరుకోవలసిన అవసరం లేనప్పుడు - సంతృప్తి ఎలా లభిస్తుంది? ఒక తోటమాలివద్ద బోలెడు పువ్వులు ఉన్నాయి. ఆ పూలతో మాల కట్టాలని అతడి కోరిక. కాని అతడి దగ్గర దారం లేదు - వాటిని కలపడానికి, వాటిని గుదిగ్రుచ్చడానికి. అతడు ఎన్నడూ తన పూలను మాలగా కట్టలేడు. ఆ తోటమాలి వంటివాడు మొత్తం జీవితానికి అర్థం ఏమిటో తెలుసుకోని వ్యక్తి.

జీవించే కళ తెలియని వ్యక్తి జీవితంలో దిశా ఉండదు, ఏకతా ఉండదు. అతడి అనుభవాలన్నీ వేటికవిగా, పొంతన లేనివిగా, పరస్పర సమన్వయం లేనివిగా, 'తీర్థానికి తీర్థం - ప్రసాదానికి ప్రసాదం'గా మిగిలిపోతాయి. జ్ఞాన రూపంలో వ్యక్తమయ్యే శక్తి ఆ అనుభవాలనుండి ఎన్నడూ జన్మించదు. జీవించే కళ తెలియని వ్యక్తి జీవితపు సమగ్ర అనుభవానికి దూరం అవుతాడు. ఆ సమగ్ర అనుభవం కొరవడినప్పుడు - అతడు జీవించినా ఒకటే, మరణించినా ఒకటే.

పువ్వులు పూచి పండ్లు పండే అవకాశం ఎన్నడూ లేని మోడు వంటిది అలాంటి వ్యక్తి జీవితం. అలాంటి వ్యక్తి సుఖ దుఃఖాలైతే అనుభవిస్తాడు కాని, ఎన్నడూ ఆనందాన్ని అనుభవించలేడు. ఎందుకంటే - కళాత్మకంగా జీవించడంవల్ల, జీవితాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా, సర్వతోముఖంగా అనుభవించడంవల్ల ఆనంద అనుభూతి కలుగుతుంది. జీవితంలో ఆనందం పొందాలంటే జీవితాన్ని పూలమాలగా మలచుకోవాలి. జీవితంలోని అనుభవాలన్నింటినీ లక్ష్యం అనే దారంతో కళాత్మకంగా గుదిగ్రుచ్చాలి. జీవించే ఈ కళను తెలుసుకోని వ్యక్తి జీవితం ఎన్నడూ సార్థకం కాదు. ఎన్నడూ కృతార్థం కాదు.

H H H

మంచి సలహాను పాటించడం మన యోగ్యతను పెంచుకోవడమే.

## విషయ సూచిక

ముఖ చిత్రం : శ్రీరామచంద్ర ప్రభువు

శ్రీ రామనవమి : మార్చి 30


1. **సంపాదకీయం :**
జీవించే కళ 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం :**
రామనామం ఒక కల్పవృక్షం 4
5. **బోధ కథ :**
సంభవామి యుగేయుగే 6
6. **వ్యక్తి నిర్మాణం :**
విజయానికి ఏడు మెట్లు 9
7. **మనం - మన ఆరోగ్యం :**
విహారం'లో పాటించవలసిన నియమాలు 12
8. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 3**
ఏనీ బీసెంట్ భవిష్యవాణి 15
9. **మాతాజీ దివ్య జీవనం : 5**
అందరికీ మాతాజీ 18
10. **శతసూత్ర కార్యక్రమం : 41-50**
సభ్య సమాజ నిర్మాణానికి సోపానాలు 22
11. **జీవన పథం :**
పరస్పర సహకారం విజయానికి కీలకం 25
12. **యుగ గీత :**
యజ్ఞం లేకుంటే - ఇహమూ లేదు, పరమూ లేదు 29
13. **సూర్య విజ్ఞానం :**
జీవన విద్యకు గురువు సూర్యుడు 32
14. **కృష్ణావతారం - 16 :**
జరాసంధ వధ 35
15. **గురుదేవుల అమృతవాణి :**
శక్తిపాతం, కుండలినీ జాగరణ 39
16. **నా వారితో నా మాట :**
ఇది యుగచేతనా విస్తరణ సంవత్సరం 43
17. **శాంతికుంజ్ సమాచారం :** 45
18. **వార్తలు :** 46


## పిడుగురాళ్లలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

**మార్చి 5,6,7 తేదీలలో**

గుంటూరు జిల్లా పిడుగురాళ్లలోని ఎమ్.పి.జడ్.పి.హైస్కూలు ఆవరణలో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, 24 వేల దీపాలతో దీపయజ్ఞం జరుగుతాయి.

గాయత్రీ పరివార్ పిడుగురాళ్ల శాఖ 10,000 గాయత్రీ మంత్ర లేఖన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసి, లేఖన కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించి ముగించింది. ఇందుకు పూర్ణాహుతిగా ఈ యజ్ఞం జరుగుతోంది.

యజ్ఞానికి పూర్వరంగంగా 108 గ్రామాలలో కలశ స్థాపనలు జరిగాయి. నిత్య గాయత్రీ జపం జరుగుతోంది. మార్చి 5న పిడుగురాళ్లలో జరిగే కలశ శోభాయాత్రలో ఈ గ్రామాలనుండి ప్రజలు భారీయెత్తున పాల్గొంటారు.

యజ్ఞానికి సంయోజకులు శ్రీడి.వి.ఆర్.మూర్తి. శ్రీయుతులు ఎమ్.సత్యనారాయణ, జి.శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీనివాస రెడ్డి, ఏ.ఎల్.నరసింహం, పి. ఆంజనేయులు, అమరేశ్వర రావు, ఎమ్.రామారావు, జి.రామిరెడ్డి, జి.శంకర రావు, శ్రీమతులు బి.అరుణమ్మ, వి.రత్నమాల, పి.శేషమ్మ యజ్ఞం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు.

ㅇ ㅇ ㅇ

## మార్చి, ఎప్రిల్ నెలలలో పర్వదినాలు

**మార్చి :**

6 చైతన్య మహాప్రభు జయంతి.
7 హోలీ.
21 తెలుగు సంవత్సరాది.
30 శ్రీరామనవమి.

**ఏప్రిల్ :**

3 మహావీర జయంతి.
5 హనుమజ్జయంతి.
24 శంకరాచార్య జయంతి.
30 రామానుజాచార్య జయంతి.

**శీలం దిగజారడమే ప్రతి నేరానికీ మూలం.**

# వేద మంత్రం

మృత్యోః పదం యోపయంన్తో యద్రైత ద్రాఘీయ ఆయుః ప్రతరం దధానాః ।
ఆప్యాయమానాః ప్రజయా ఘనేన, శుద్ధాః పూతా భవత యజ్ఞియాసః ॥

- ఋగ్వేదం 10/18/2

**భావార్థం** : ఎవరు దురాచారాలను నశింప చేసి సదాచారాలలో స్థిరంగా ఉంటారో వారికి ఉత్తమ జీవనము దీర్ఘాయుష్షు లభిస్తాయి. ధనము, సంతానములతో వారు శారీరక మానసిక పవిత్రత ప్రాప్తించుకొంటారు.

**సందేశం** : మనుష్య జీవనం ఈశ్వరు డిచ్చిన ఒక అనుపమమైన కానుక. మనుష్యునికి లభించిన సౌకర్యాలు ఏ జీవజంతువుకూ లభించలేదు. నవ్వుట, మాట్లాడుట, వ్రాయుట, చదువుట, ఆలోచించుట, చికిత్స, కుటుంబం, నివాసం, వ్యాపారం, వాహనం, మనోరంజనం వంటి సౌకర్యాలు మరే ప్రాణికైనా లభించాయా? మనుష్యునిపైనే ఈశ్వరుని కింత అనుగ్రహం దేనికి?

ప్రపంచంలోని ప్రతి ప్రాణీ జన్మిస్తుంది, కొంతకాలం తర్వాత మరణిస్తుంది. మృత్యుపాదం ఎవరినెప్పుడు తొక్కివేస్తుందో ఎవరికీ తెలియదు. మృత్యువును అధిగమించి అమృతత్వాన్ని ప్రాప్తించుకొనే సామర్థ్యం పరమాత్మ మనుష్యునికి ఇచ్చాడు. మరణించినవారితో సమానంగా జీవితాన్ని గడపక ప్రపంచంలో అమరపుత్రుల వలె దృఢంగా ఉండండి.

ఇతిహాసము, శ్రేష్ఠపురుషుల నడవడిక పరిశీలిస్తే వ్యక్తి ఉన్నతికి కొన్ని శ్రేష్ఠమైన గుణాలు ఆవశ్యకమని తెలుస్తుంది. ఆ గుణాలే మానవత్వానికి గీటురాళ్ళు. ఎవరిలో ఈ గుణాలు ఎంత మోతాదులో ఉంటే ఆ వ్యక్తి ఆ స్థాయిలో అంత శ్రేష్ఠుడు, అమరుడు అవుతాడు. ప్రపంచంలోని మహాపురుషులందరిలో ఈ గుణాలే నిండి ఉన్నాయి. ఈ గుణాల సోపానాలు అధిరోహించకుండా అమృతత్వ సింహాసనాన్ని ఎవరూ అధిష్టించ లేరు. గీతలో ఈ గుణాల మహిమ అనేక స్థానాలలో అనేక విధాలుగా వర్ణించబడింది. వీటిని దైవ సంపద అని చెప్పుట జరిగింది. ఈ గుణాలను తన జీవితంలో ధరించినపుడే మనుష్యుడు ప్రపంచంలో అమరుడు కాగలడు.

మన దేశం మహాపురుషుల దేశం. శ్రీరామచంద్రుని నుండి నేటివరకు ప్రపంచకీర్తి పొందిన వందలాదిమంది మహాపురుషులు ఇక్కడ జన్మించారు. కేవలం మహాపురుషుల నిర్మాణంతోనే సరిపోదు. కొద్ది మంది దైవీసంపద కలిగిన వారై, మిగిలిన వ్యక్తులు నరక సదృశ జీవితం జీవిస్తూ ఉంటే అది అనుచితం, అసంభవం కూడా. దేశంలోని సాధారణ అతి సాధారణ వ్యక్తులు కూడా శ్రేష్ఠులు కావాలి.

మన శారీరక అవసరాలు ఇతర ప్రాణుల వలె సామాన్యంగా, సులువుగానే పూర్తి చేసుకోవచ్చు. కానీ మనం అధిక సామర్థ్యమును భోగం, విలాసం, సంగ్రహం, అహంకారం మొదలైన వాటి కొరకు వినియోగిస్తున్నాము. రకరకాల దురాచారాలలో ఈ అమూల్య మానవ జీవనం వృథా చేస్తున్నాము. మన జీవితోద్దేశ్యాన్నుండి దూరమై, మరణించిన మనిషితో సమానంగా ఆయుష్షు బరువును మోసుకుంటూ ఏదో విధంగా బ్రతుకు బండిని ఈడ్చుకుంటూపోతున్నాము.

మనం ఎప్పుడూ ఆహారం, వ్యాయామం, తపస్సుల ద్వారా శరీరాన్ని శుద్ధము, అంతఃకరణమును పవిత్రము చేసుకొని యజ్ఞీయ జీవితం గడపాలి. అప్పుడు మనం నూరు సంవత్సరాలకు మించి శుభకర్మలు చేస్తూ ధనము, శ్రేష్ఠ సంతానములతో సుఖాలను అనుభవించగలము. ఆత్మఅమరత్వపు ఆనందాన్ని ప్రాప్తించుకోగలము.

K K K

హద్దు మీరిన ధనం తన అందవికారాన్ని ప్రదర్శిస్తుంది.

## ముఖచిత్ర కథనం

# రామనామం ఒక కల్పవృక్షం

శ్రీరామనవమి పావన పర్వం నాడు హృదయంలో రామనామ నాదం ధ్వనిస్తూ ఉంటుంది. సంత్ తులసీదాసు ఆ రామనామ మహిమను తన 'రామచరిత మానస' గ్రంథంలో గానం చేశాడు. రామనామం చేసిన అద్భుతాలను ఆయన వర్ణించాడు. రామనామాన్ని స్మరించిన వెంటనే కార్యసిద్ధి జరుగుతుంది. రామనామం సహాయంతో చెవిటివారు వినగలుగుతారు. మూగవారు మాట్లాడగలుగుతారు. కుంటివారు పర్వత శిఖరాగ్రాలను చేరగలుగుతారు. అసాధ్యాన్ని సాధ్యం చేస్తుంది రామనామం. తులసీదాసు ఈ పంక్తిలో కేవలం శాస్త్ర వచనాలను తిరిగి చెప్పలేదు. తన అనుభవ సారాన్ని దీనిలో రంగరించాడు.

*నాము రామకో కలపతరు కవి కల్యాన నివాసు ।*
*జో సుమిరత భయో భాంగ్‌తె తులసీ తులసీదాసు ॥*

అనగా -

*కలియుగంలో రామనామం మన మనసు కోరుకునే ఫలాలను ఇచ్చే కల్పవృక్షం. అది అన్ని విధముల శుభాలకూ నిలయం. ఆ నామాన్ని స్మరించినందువల్ల భంగు ఆకువలె నికృష్టుడైన తులసీదాసు తులసీ దళంవలె పవిత్రతనూ, పూజనీయతనూ సంతరించుకున్నాడు.*

రామనామ మహిమ ప్రతి యుగంలో ఉంటుంది. కలియుగంలో దానికి మరింత ప్రత్యేకమైన మహిమ ఉంది. జప తపాలు, యోగాల ప్రభావమంతా రామనామంలో ఇమిడి ఉంది. శ్రీరామచంద్ర ప్రభువు వంటి దాత మరొకడు లేడు. ఆయన గ్రద్ద జటాయువుకూ, వనవాసి స్త్రీ శబరికీ ఇచ్చిన దానిని యోగ సాధన చేసే ఋషులూ మునులూ జన్మ జన్మలలో పొందలేరు. నాశనం లేనిది రామనామ ప్రభావం. అంతు లేనిది రామనామ ప్రభావం. రామనామ ప్రభావం వల్లనే వనవాసి అయిన వాల్మీకి మహర్షి అయినాడు. రామనామం వినా తులసీదాసును ఎవరు గుర్తించగలిగే వారు? రామనామ కథయే ఆయనను మహాకవిగా, ప్రజా కవిగా చేసింది. ఆయన యుగాలకు అతీతుడు అయినాడు. కాలాన్ని జయించాడు. అదంతా రామ నామ మహిమయే.

రామ నామంలోని ఈ అద్భుత శక్తి గత శతాబ్దంలో మరోమారు వ్యక్తమయింది. గాంధీ బాబా హృదయంలో కూడా గోసాయి తులసీ బాబా హృదయంలోవలెనే రామ నామం నినదించింది. రామ నామం అనే అమోఘమైన ఆయుధంతో నిరాయుధులైన కోట్లాది భారత ప్రజలను ఆయన మహాపరాక్రమవంతులుగా, అజేయులుగా భావించబడిన ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నిలబెట్టారు. లెక్క లేనన్ని కులాలుగా, అనేక ధర్మ సంస్కృతులుగా, లెక్కకు మిక్కిలి అయిన భాషలుగా విడిపోయి, ఒకరి కొకరు దూరమయిన ఈ దేశ ప్రజలు గాంధీజీ రామ భజనకు మంత్ర ముగ్ధులు అయినారు. గాంధీ బాబా ఆదేశం మేరకు తమను తాము బలిదానం చేసుకోవాలని సంకల్పం తీసుకున్నారు. ఈ అద్భుతాన్ని చూచి ప్రపంచమంతా ఆశ్చర్యంలో మునిగిపోయింది. ఆంగ్లేయుల సామ్రాజ్యంలో సూర్యుడు ఎన్నడూ అస్తమించలేదు. అలాంటి సామ్రాజ్యాన్ని గాంధీ బాబా తుపాకీ లేకుండా అవలీలగా ముక్కచెక్కలు చేశారు. అత్యంత ఆశ్చర్యకరమైన ఈ సంఘటన రామ నామ మహిమయే.

రామ నామంలో ఎన్నెన్నో రహస్యాలు ఉన్నాయి. ఎన్నెన్నో మహాద్భుతాలు ఉన్నాయి. బాపూజీకి ఇంతటి ప్రజాభిమానం ఎలా లభించింది? ఆయనపట్ల పొంగిపొరలిన ప్రజాభిమానాన్ని చూచి, ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత రోమా రోలా - గాంధీజీ వద్ద అలౌకికమైన శక్తి ఏదో ఉన్నదని అన్నారు. ఆయనలోని వశీకరణ శక్తి ఫలితంగా కోట్లాది భారతీయులు క్షణంలో సమ్మోహితులు అయ్యారు. ఆయన నిరాహారదీక్ష చేస్తే, అసంఖ్యాకులైన భారతీయులు భోజనం చేయడం మానివేశారు. ఆయన మౌన వ్రతం పాటిస్తే లెక్కలేనంతమంది భారతీయులు మాట్లాడం మానివేశారు. ఆయన నడవడం ప్రారంభిస్తే, కోట్లాది భారతీయులు ఆయన వెంట నడిచేవారు. ఆయన జైలుకు వెళితే ఆంగ్లేయుల కారాగారాలలో ఖైదీలను ఉంచడానికి అంగుళం స్థలమైనా మిగిలేది కాదు. గాంధీజీ చూరగొన్న ఈ ప్రజాదరణ గురించి రోమా రోలా ఇలా వ్రాశారు - "ఆయన ఏదో మహామంత్రాన్ని జపించి సిద్ధిపొంది ఉండాలి. ఆ బలంతో ఆయన ఓటమి ఎరుగని బ్రిటిషు సామ్రాజ్యాన్ని ఓడించి, భారతీయ స్వరాజ్య నవయుగాన్ని ప్రారంభించారు.''

ఆ మహామంత్రం రామ నామమే. రామనామంతోపాటు

**సుఖం పంచుకుంటే పెరుగుతుంది. దుఃఖం పంచుకుంటే తరుగుతుంది.**

గాంధీ బాబా రామరాజ్యం గురించి కలలు కన్నారు. పాశ్చాత్య విజ్ఞానం, ఆధునికతల వ్యామోహంలో తలమునకలు అయిన పలువురికి బాపూజీ కన్న ఈ కల అశాస్త్రీయంగా, పురాతనంగా కనిపించవచ్చు. కానీ, చరిత్ర సత్యం దీని ప్రామాణికతకు సాక్షిగా నిలుస్తోంది. 18వ శతాబ్దంలో ఫ్రెంచి విప్లవం జరిగింది. 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవం జరిగింది. ఈ విప్లవాలు రెండూ నేడు తమ సువాసనను కోల్పోయాయి. పాసిపోయాయి. మరోప్రక్క రామరాజ్య ఆదర్శంలో నేటికీ తాజాతనం ఉన్నది. అందులో శాశ్వతత్వం ఉన్నది. చిరంతనత్వం ఉన్నది.

రామచంద్ర ప్రభువు, ఆయన నామము ఒక ప్రత్యేక మతానికీ, వర్గానికీ చెందిన వారసత్వపు ఆస్తులు కావని గుర్తించాలి. అలా భావించేవారికి రాముడు వరాలు ఇవ్వడు. రామనామం ఫలాన్నీ ఇవ్వదు. భిల్ల స్త్రీ శబరి ఇచ్చిన ఎంగిలి పండ్లు తిన్న రామయ్య, వృద్ధుడైన జటాయువుకు తన చేతులతో అంత్యక్రియలు జరిపిన రామయ్య అందరివాడు. రామ కథలూ గాథలూ ఈ ఉపఖండంలోని సముదాయాలకూ సంప్రదాయాలకూ పరిమితం కావు. ఇండొనేశియా, బాలి, జావా, సుమత్రా, మాయన్మార్‌ల వరకు రామ కథల సంవేదన స్రవంతి ప్రవహిస్తోంది.

శ్రీరామచంద్రుడు భారతదేశపు మహాసంస్కృతికి మహానాయకుడు. ఆయన మహాగాథ వనవాసులు, అల్పసంఖ్యాకులు, దళితులు, గిరిజనుల హృదయాలలో పదిలంగా నిలచి ఉంది. అంతే కాదు. దక్షిణ భారతంలోని శైవులూ, మాతృపూజకులూ ఆ మహాగాథ స్పర్శకు పులకించిపోతారు. ఈశాన్య భారతంలోని నాగాలు, మేఘులు, మైతేయిలూ కూడ రామనామంవల్ల ప్రభావితులు అయినవారే. రామ కథకు ఎన్నెన్నో రూపాలు. రామనామ భావన ఎన్నెన్నో రంగులలో చిత్రితం అయింది.

గోసాయి తులసీదాసు చెప్పనే చెప్పారు - "జాకీ రహీ భావనా జైసీ, ప్రభు మూరతి దే ఖీ తిన తై సీ". ఎవరికి ఏ భావన ఉంటే ప్రభువు మూర్తి ఆవిధంగా దర్శనం ఇస్తుందని దాని భావం. క్షేత్రం, వర్గం, సంప్రదాయముల ప్రకారం జన చైతన్యం తనదైన రామ విగ్రహాన్ని నిర్మించుకున్నది. అయితే మౌలిక భావనలో ఎలాంటి అంతరమూ రాలేదు. తులసీదాసుకు రాముడు తనవాడు. అలాగే, సూఫీ సంత్ జాయసీకీ రాముడు తనవాడే. రాముని ముద్ర బాబరు కుమారుడు హుమాయూన్ నాణెములపై అంకితమై ఉంది. చరిత్రను లోతుగా అధ్యయనం చేసినవారికి ఈ వాస్తవం తెలుసు. జన చైతన్యానికి శిఖర పురుషుడైన రామునికి అక్బరూ, ఆయన స్థాపించిన దీన్-ఎ-ఇలాహీ మతమూ కూడా ప్రణామం చేశాయి.

'సబ్‌కె రామ్ - సబ్‌మె రామ్' (అందరి వాడూ రామయ్య, అందరిలోనూ రామయ్య) అనే భావంతో తన్మయుడై బాపూజీ రాముణ్ణీ, అతడి నామాన్నీ భారతవాసులను సంఘటితపరచే సూత్రాలుగా చేశారు. పాశ్చాత్య సిద్ధాంతాలను నకలు చేసే ధోరణికి విభిన్నంగా - బాపూజీ 'రామరాజ్యం' అనే విశుద్ధ స్వదేశీ నమూనా (మోడల్)ను నవతరం ముందుంచారు. బాపూజీ రామరాజ్యంలోని రామయ్య హిందువులకూ తమవాడే, ముస్లిములకూ తమవాడే. సిక్కులకూ, క్రైస్తవులకూ కూడ ఆయనపై అంతే హక్కు ఉంది. రామయ్య, ఆయన నామం భారతదేశపు జనచైతన్యానికీ, ఏకాత్మతకూ ప్రతీకలు.

ఆశ్చర్యకరమైన మరో వాస్తవాన్ని కూడ ఈ సందర్భంగా ప్రస్తావించాలి. భారతీయ జనచేతనలో సర్వవ్యాపిగా ఉన్న రాముడు హిందువుల నాలుగు ధామాలలోనూ కేంద్ర బిందువుగా లేడు. వ్యక్తి వ్యక్తిలో ఉన్న రాముణ్ణి, రామ నామాన్ని పరిమితులలో బంధించడం సముచితం కాదని భావించడం ఇందుకు కారణం కావచ్చు. రాముణ్ణీ, రామ నామాన్నీ కులం, మతం, వర్గం, క్షేత్రాలకు పరిమితం చేయడానికి ప్రయత్నించేవారు ఎన్నడూ రామునికి తనవాళ్లు కాలేరు. వారికి రాముడు ఎన్నడూ తమవాడు కాలేడు.

రాముడు భారతీయ జనచేతనలో ప్రవహిస్తున్న ఆంతరిక ధార. అది నిర్గుణంగా నిరాకారంగా నిరంతరం భారతీయ జనమానసంలో ప్రవహిస్తూనే ఉంటుంది. దుష్టుల వినాశనానికీ, సాధు జనుల కళ్యాణానికీ ప్రతి యుగంలో అది సగుణంగా వ్యక్తం అవుతూనే ఉంటుంది. దశరథుని గృహంలో జన్మించిన రాముడు సాంస్కృతిక అభ్యున్నతికి సంకల్పం చేసే శ్రీరాముడుగా ఈ మన యుగంలో జన్మిస్తాడు. మనందరిమధ్యా నివసిస్తున్న ప్రభు భక్తుల హృదయాలలో మనుష్యరూపంలో అవతరిస్తాడు. మనం చేయవలసిందల్లా మన హృదయాలలో రామ నామం నిజంగా నినదించేటట్లు చూడడం. ఆ తర్వాత సుర నర హితకారి అయిన ఆ శ్రీరాముడూ, ఆయన నామమూ చేసే అద్భుతాల పరంపర మరుక్షణంలో ప్రారంభం అవుతుంది.

H H H

**చెడ్డవాళ్లను సంస్కరించడం కష్టమే కానీ అసాధ్యం కాదు.**

**బోధకథ**

# సంభవామి యుగేయుగే

ఈ కృపాచార్యుడు వ్యాస భగవానునికి ప్రణామం చేస్తున్నాడు.

అది హిమాలయ పర్వతాలలోని అత్యంత దుర్గమమైన దివ్యక్షేత్రం కలాప గ్రామం. అది నిత్యసిద్ధులైన మహాయోగుల సాధనా స్థలం. అది మనుష్యులకే కాక గంధర్వులు మొదలగు ఉపదేవతలకు సైతం చొరరాని, కానరాని గ్రామం. అలౌకికమూ, అద్భుతమూ అయిన ఆ భూమిలో నేడు కొంత అలజడి కనిపిస్తోంది. అఖండమైన శాంతి, సాంద్రమైన సత్వగుణం నిరంతరం వ్యాపించి ఉండే ఆ భూమిలో సమాధి అకస్మాత్తుగా సడలడం ఆశ్చర్యకరం. వేలాది సంవత్సరాలు గడిచిపోయాయి. మొత్తం యుగమే తెరమరుగు అయింది. కానీ ఎన్నడూ ఇలా జరగలేదు. ఎంత ప్రయత్నించినా కృపాచార్యుడు తిరిగి సమాధిలోకి వెళ్లలేకపోయారు. తప్పనిసరి అయి ఆయన తన ఆసనం నుండి లేచారు. వ్యాస మహర్షిని కలుసుకోవడానికి బయలుదేరారు.

సంకల్పాల భాషలో, పరా - పశ్యంతీ స్వరాలలో మాట్లాడడం అలవాటైన ఈ దేవపురుషు లిద్దరి ప్రత్యక్ష కలయిక ఎంతో ఆశ్చర్యభరితమైనది.

ద్వాపర యుగం సమాప్తం అవుతోంది. పరమ యోగేశ్వరుడైన కృష్ణ భగవానుడు తన లీలను ముగించాడు. కొద్ది సమయం తర్వాత ఈ దివ్య పురుషు లిద్దరూ ఈ సిద్ధ భూమికి విచ్చేశారు. అలౌకికమైన ఈ క్షేత్రంలో వీరు కొద్ది సమయంలోనే ఎన్నెన్నో రహస్య సాధనలు జరిపారు. నిరంతరం సమాధి స్థితిలో ఉండి, సృష్టిలోని అత్యంత నిగూఢమైన సత్యాలను, రహస్యాలను సాక్షాత్కరించుకున్నారు.

వ్యాస భగవానుడు అంతకుముందే మహర్షి. తపస్సు, యోగం, జ్ఞానముల నిరంతర సాధన చేసిన మహనీయుడు. లోకోత్తరమైన ఆయన సాధన ఇక్కడికి వచ్చిన తర్వాత మరింత విశిష్టం అయింది. మరింత మహత్తరం అయింది. కృపాచార్యుడు యుద్ధ విద్యలో ఆచార్యుడు. కురు రాజకుమారులకూ, పాండు పుత్రులకూ ఆయన యుద్ధవిద్యలో తొలి పాఠాలు నేర్పారు. తాను నేర్పిన విద్యను అన్నదమ్ములు ఒకరిపై మరొకరు ప్రయోగిస్తారని, వారి వైరం మహాయుద్ధంగా పరిణమిస్తుందనీ ఆ పాఠాలు నేర్పే సమయంలో ఆయన ఎన్నడూ ఊహించలేదు.

ఆ గత కాలపు సంఘటనలు ఆయనకు ప్రేరణ ఇచ్చాయి. అన్నిటినీ మించిన ప్రేరణ ఇచ్చినదీ, పూజనీయమైనదీ యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని వ్యక్తిత్వం. ఆ శ్రీకృష్ణుని ఆశీస్సులూ, అనుగ్రహమూ పొంది, ఆయన కలాప గ్రామానికి వచ్చారు.

గతకాలపు మనోభావాలు అపుడపుడూ ఆయనను వెన్నాడుతూ ఉంటాయి. ఒకే వేదన ఆయనను కలచి వేస్తూ ఉంటుంది. సర్వేశ్వరుడు ధరణిని ఉద్ధరించడానికి స్వయంగా దిగివచ్చాడు, నేను ఆయనకు సహకరించలేకపోయాను, అని. సత్యం తెలిసినప్పటికీ, ఆయన తప్పని సరి అయి దుర్యోధనునికి సాయపడవలసివచ్చింది. ఈ సంఘటన ఆయన అంతరంగాన్ని కల్లోలపరచింది. అయితే సర్వాంతర్యామి అయిన శ్రీకృష్ణుడు తన లీలను ముగించడానికి కొద్దిగా ముందు ఆయనతో ఇలా అన్నాడు- ఆచార్యా ! దిగులు చెందకు. విధి విధానం ఏనాడో నిర్ణయం అయి ఉంటుంది. అయినా, నేను నీకో వరం ఇస్తున్నాను. రానున్న అవతారంలో నీవు నాకు సాక్షివిగానే కాక సహచరుడిగా కూడా ఉంటావు. అంతవరకు నీవు హిమాలయంలోని దివ్యక్షేత్రం కలాప గ్రామంలో తపస్సు చెయ్యి.

అపుడు ఆయన సమాధి స్థితిలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎంతో కాలం గడిచింది. ఇపుడు ఆయన యుద్ధవిద్యలో ఆచార్యుడు కాడు. జ్ఞానం, తపస్సు, యోగములకు ఆచార్యుడు. నేడు ఆయన అసామాన్యుడు. ఊహకందని వ్యక్తి. దీర్ఘకాయుడు. ఆజానుబాహువు. కమల దళముల వలె విశాలమైన నేత్రములు కలవాడు. ఎత్తయిన ముక్కు, ఒత్తయిన తలకట్టు, విశాలమైన వక్షస్థలం, తెలుపు రంగు, సుందరంగా తీర్చిదిద్దినట్లున్న శరీరం. అయినా తపస్సు వల్ల కొద్దిగా కృశించిన శరీరం. జటాజూటం, పెద్దపెద్ద మీసాలు, కేశాలు, వల్కలాలు ధరించిన వ్యక్తి. బ్రహ్మ చేసిన సాటిలేని విగ్రహం.

వ్యాస మహర్షిది కొద్దిగా నలుపు రంగు. ఆయన శరీరం నలువైపులా ఆవరించి ఉన్న తపో దీప్తి ఆయనకు ఒక విలక్షణమైన వెలుగును ఇస్తోంది. ఆయన యోగ సౌందర్యం అద్భుతం.

కృపాచార్యుడు వ్యాస మహర్షిని అన్నగారుగా గౌరవిస్తారు. వ్యాస మహర్షి మాత్రం కృపాచార్యుడిని తనతో సమాన స్థాయి కలిగిన మిత్రునిగా ఆదరిస్తారు.

కృపాచార్యుడు ఇలా అన్నారు - నేడు ఊహకందనిది ఏదో జరుగుతుందని అనిపిస్తోంది. ఎన్నిసార్లు ప్రయత్నించినా మనస్సు ఏకాగ్రం కావడం లేదు. ఏదో ఆకర్షణ హిమ శిఖరాల దిగువన ఉన్న జనసమ్మర్దమైన జగత్తువైపు లాగుతున్నట్లు తోస్తోంది.

వ్యాసమహర్షి ఇలా అన్నారు - మనం ఇద్దరం సృష్టికర్త చేసిన

**మరొకరి సుఖాన్ని హరించడంలో కాక సుఖాన్ని పంచడంలో మనశ్శాంతి ఉంది.**

ఒక ప్రత్యేక సంకల్పంలోని యంత్రాలమని మీకు తెలుసు కదా. నేడు నా పరిస్థితి కూడా అలాగే ఉంది. యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు మీకు సూచించిన తరుణం వచ్చిందని అనిపిస్తోంది. ఈసారి సర్వేశ్వరుడు స్వయంగా కల్కి అవతారం ధరించి ధర్మ స్థాపన చేస్తానన్న తన ప్రతిజ్ఞను నెరవేర్చుతాడు. నిష్కళంక అవతారం ద్వారా మహాకాలుని యుగ పరివర్తన ప్రక్రియ క్రియారూపం ధరించే శుభ ఘడియ వచ్చింది.

మహాత్మా ! రజోగుణం ఏ కొంచమూ ఇక్కడ ఉండకూడదు.

మీ సాధనా కాలం పూర్తయ్యింది. ఇపుడు మీరు రేపటి అవతార ప్రక్రియ కార్యకలాపాలను మీ కళ్లతోనే చూడాలి. అకస్మాత్తుగా మహానుభావు లిద్దరి హృదయాలలో ఏదో ఆకాశవాణి ధ్వనించింది.

ఆదేశం వచ్చింది. అక్కడ ప్రత్యక్ష కలయికకు ప్రాధాన్యం లేదు. కనపడని దానికీ, కనపడే దానికీ తేడా లేదు. మనసులోని సంకల్పమే పరస్పరం అభిప్రాయాలను కలబోసుకోవడానికి, ఉపదేశాన్ని గ్రహించడానికీ, ఆదేశాన్ని పొందడానికీ చిరపరిచితమైన మార్గం. ఆ సిద్ధ స్థితిలో ఆ అమర యోగులు ఇద్దరూ చేతులు జోడించారు. తలలు వంచారు. కలసి అక్కడి నుంచి బయలుదేరారు.

వారు మానవ రూపాలలో ఉన్నారా? కృపాచార్యుని, వ్యాసభగవానుని ముందు నేటి మానవుని ఆకారం అత్యంత క్షీణమైనది. అతడి శరీరమే కాక మనస్సు కూడా అత్యంత సంకుచితమైనదిగా వారిద్దరికీ తోచింది. మనం సరాసరి మహేంద్ర పర్వతం మీదకు వెళదాం. కొద్దిసేపు గంగానది ఒడ్డున హరిద్వార్‌లో ధ్యానంలో ఉండి ఇద్దరూ లేచారు. వచ్చే కృతయుగానికి యుగ నిర్మాత, శాస్త్ర నిర్మాత, శాస్త్ర నిర్దేశకుడు పరశురామ భగవానుడు. వారి పావన చరణాలకు ప్రణమిల్లి మనం ఆదేశం కోసం ఎదురుచూడాలి.

మహేంద్ర పర్వతం మామూలు పర్వతం కాదు. ఈ దివ్యగిరి మీదకు దేవతలు సైతం సంకోచంతో, శ్రద్ధతో దిగుతారు. అనేక యుగాలుగా ఇది పరశురామ భగవానునికి సాధనా స్థలంగా ఉంది. అన్నిటినీ కప్పివేసే మాయ ప్రభావం ఈ ఛాయలకు రాదు. దేవపురుషుడైన పరశురాముని సత్సంగం పొందడానికై ఎందరెందరో ఋషులు, తాపసులు ఇక్కడి గుహలలో, దట్టమైన అరణ్యాలలో తమ ఆరాధ్యుడిని చింతన చేస్తూ నిత్యం తన్మయులై ఉంటారు. దివ్యమైన లతలు, తరువులతో, పూలతో, పల్లవాలతో, మధుర ఫలాలతో నిండిన వనభూములు, రత్నోజ్వలములైన గుహలు ఉన్నాయి. ఇక్కడి పశువుల రావాలలో, పక్షుల కలరవాలలో, తుమ్మెదల ఝుంకారాలలో మాత్రమే కాక - సెలయేళ్ల గలగలలో కూడా ఓంకార దివ్యనాదం ధ్వనిస్తూ ఉంటుంది. ఇక్కడి ప్రతి ఆకూ ఈ దివ్య ధ్వనితో పాటు నాట్యం చేయడంలో లీనమై ఉంటుంది.

ఆకాశం నుండి ఇద్దరు చందమామలు భూమిమీదకు దిగినట్లు - మహేంద్ర పర్వత శిఖరంపై ఆ ఇద్దరు మహానుభావులూ దిగారు. బ్రహ్మర్షి పరశురాముడు పొగలేని అగ్ని వలె అక్కడ వెలిగిపోతున్నాడు. ఆయన వీరిద్దరి కోసం ఎదురు చూస్తున్నట్లు ఉంది. పారదర్శకమైన ఆయన ప్రజ్ఞలో అంతా స్పష్టంగా కనపడుతోంది. జిజ్ఞాసలు క్షణంలో సమాధానాలు పొందిన స్వరాలుగా మారిపోయాయి.

ధన్యమయింది యోగేశ్వరుడు శ్రీకృష్ణుని లీలా భూమికి సమీపాన ఉన్న ఆ చిన్న గ్రామం. పవిత్రం అయింది కీర్తి పొందిన ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుని వంశం. భగవానుడు కల్కి రూపంలో అవతరించాడు.

పరశురామ భగవానుడు ఎంతో తన్మయమైన స్వరంతో కల్కి యొక్క ప్రజ్ఞావతారం దిగవచ్చిన కథను వినిపిస్తున్నాడు. కృపాచార్యుడు, వ్యాసమహర్షి వచ్చీ రావడంతోనే ఆయన వారిద్దరినీ తన గుండెలకు అదుముకున్నారు. చిరపరిచితులే కదా వారు. ఎంతో ఆత్మీయతతో ఆయన చెప్పుకుపోతున్నారు. మీరిద్దరూ ఆ ప్రజ్ఞావతారానికి పరమ ప్రియులు. మిమ్మల్ని కలుసుకోడానికి ఆయన స్వయంగా విచ్చేస్తారు.

అయితే ఎక్కడ? - కృపాచార్యుడు చకితుడై ప్రశ్నించారు. వ్యాస భగవానుడు మాత్రం బ్రహ్మర్షి పరశురాముని సంకేతాన్ని అర్థం చేసుకున్నారు.

దేవభూమి హిమాలయమే వారిని కలుసుకునే స్థలం.

ఇలా సంకేతం సూచించి, ఆయన తిరిగి కల్కి అవతార వర్ణన చేయసాగారు - జగత్తులో బ్రాహ్మణత్వానికి గౌరవం కల్పించడానికి, వ్యక్తి వ్యక్తికీ జగజ్జనని గాయత్రి మహావిద్య రహస్యాన్ని తెలియచెప్పడానికీ ప్రజ్ఞావతార అవతరణ జరిగింది. ప్రజా శిక్షణ కోసమై ఆయన స్వయంగా ఉగ్రమైన తపోసాధన చేశారు. వారి తపోతేజం తేరిచూడరానిది.

ఆ పరమ ప్రభువు ఎక్కడికి.....?

ఈసారి కూడా కృపాచార్యుడు అడిగారు.

పరశురాముడు ఆ ప్రశ్నలోని భావాన్ని అర్థం చేసుకున్నారు. ఆయన ఇలా అన్నారు.

వారు ఉగ్ర తేజస్సు రూపంలోనే ఈసారి అవతరించారు. భావ విప్లవమే వారి ప్రచండ పరశువు. దాని ద్వారా వారు మహా వేగంతో భూమండలంలోని మానవ జాతి మనసునూ, మెదడునూ మార్చివేయాలని సంకల్పం చేశారు..... ఆయనను దర్శనం చేసుకోవాలని ఉందా?

**మంచిని సమీపించు. చెడును దూరం చెయ్యి. ఆనందాన్ని పొందు.**

దేవా ! దయామయా !

ఒకేసారి ఆ మహానుభావులిద్దరూ ఉలిక్కిపడ్డారు.

మహాభారత కాలపు విషమతలను, విచిత్రాలను వారు తమ కళ్లతో చూచి ఉన్నారు. కానీ పరశురామ భగవానుని అనుగ్రహం వలన పొందిన దివ్యదృష్టితో వారు చూచినది వారికి దుర్భరం అనిపించింది. అతివేగంగా తిరుగుతూన్న కాలచక్రం. మహా యుద్ధాలు, అంతర్యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు, వ్యక్తి యుద్ధాలు, ప్రకృతి యుద్ధాలు. ఇటువంటి రకరకాల కష్టనష్టాలు, సంఘర్షణలు, ఉద్వేగాలు, అవరోధాలు, తుపానులు చెలరేగడం కనిపిస్తోంది. వీటన్నింటినీ మహాతపస్వి అయిన నిష్కళంక భగవానుడు తన తపో తేజంతో అదుపు చేస్తున్నారు. మానవులను రక్షించడంలో నిమగ్నమై ఉన్నారు. దానితోపాటు మానవులు మారడం తప్పనిసరి చేస్తున్నారు.

ప్రజ్ఞావంతులైన మహర్షులు ఇద్దరూ తమ అంతర్ దృష్టితో ప్రఖరప్రజ్ఞా పురుషుని మహత్ కార్యాన్ని చూస్తున్నారు. జ్ఞాన యజ్ఞాల, వాజపేయ యజ్ఞాల నిర్వహణ. దేవమానవుల అద్భుత సంఘటన. వ్యక్తి వ్యక్తిలో దేవత్వ అవతరణ. యమునా తీరం నుండి గంగా తీరంలోని హిమాలయం నీడలోనికి వచ్చి, వారు సూక్ష్మ జగత్తును ఆశ్చర్యకరమైన రీతిలో పరివర్తన చేశారు. ఇదంతా చూచి, మహర్షులు ఇద్దరూ హత ప్రభులు అయినారు.

కల్కి రూపంలో సర్వేశ్వరుని పూర్ణ చేతన అవతరించింది. వారి మహత్ కార్యాలకు ఆశ్చర్యపడకండి. ఆ దేవపురుషుడు స్థూల శరీరంతో మాత్రమే కాక, తన అయిదు సూక్ష్మ శరీరాలతో కూడ తన లీలను సాగిస్తారు. మానవాళికి ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలన్నది వారి దృఢ సంకల్పం. ఆయన సంకల్పాన్ని వమ్ముచేసే శక్తి దేవతలకూ, దానవులకూ, మానవులకూ ఎవ్వరికీ లేదు.

మరి ఇప్పుడో ....

అంతర్ ప్రజ్ఞతో పరికిస్తూన్న భవిష్య లోకం నుండి వారు వర్తమానంలోకి వచ్చారు.

వాస్తవానికి మహా దారుణంగా ఉంది వర్తమాన పరిస్థితి. పరశురాముడు దీర్ఘంగా నిట్టూర్పు విడిచారు.

యుగం గడిచింది. నేల మధుర ఫలాలను, తిండి గింజలను ఉత్పత్తి చేయడం లేదు. మనుషులు కృత్రిమ ఎరువులను విచ్చలవిడిగా ఉపయోగించడంతో, భూమి బంజరుగా మారింది. సముద్ర ఉత్పత్తులను మనిషి ఆహారంగా చేసుకున్నాడు. తాను ఆవిష్కరించిన అద్భుత విస్ఫోటక పదార్థాలతో అతడు సముద్ర ఆహారాలను విషాక్తం చేశాడు. ఇప్పుడు మనిషి ఏది తిన వచ్చు, ఏది తినకూడదు అనే విచక్షణా జ్ఞానాన్ని వదులుకున్నాడు. ఆచార వ్యవహారాలలోనూ విచక్షణా జ్ఞానాన్ని వదులుకున్నాడు.

కృపాచార్యుడు బాధగా ఇలా అన్నారు -

బలాన్ని కోల్పోయిన ఈ మానవుడు .....

తన మెదడుపై గర్వం పెంచుకున్నాడు ఇతడు. కానీ, తన గర్వంతో తన ఆవిష్కరణలకే బలి అయిపోయాడు.

పరశురామ భగవానుడుకూడ బాధగా ఇలా అన్నారు -

మానవుడు మానవ జాతినే సమాప్తం చేయగలిగిన విస్ఫోటక వస్తువులను నిర్మాణం చేశాడు. పరమేశ్వరుని సత్తా, ధర్మం, పరలోకంవంటి సూత్రాలను మనిషి ఏనాడో తిరస్కరించాడు. స్థూలమైన భోగాలకు ప్రాధాన్యం ఇవ్వడంవల్ల కలిగే పరిణామం వినాశనమే. దానినే అనుభవిస్తున్నాడు మనిషి.

దీనుడు, పశుప్రాయుడు అయిన మనిషి ఇప్పుడు...

వ్యాస మహర్షి, కృపాచార్యులు వేదనా భారంతో ఆ వాక్యం పూర్తి చేయలేక పోయారు.

పరశురామ భగవానుడు ఆ వాక్యాన్ని పూర్తి చేస్తూ ఇలా అన్నారు - కీటక ప్రాయుడు అయినాడని చెప్పాలి. అయితే ప్రజ్ఞా పురుషుని రూపంలో భగవానుడు స్వయంగా తన యుగ పరివర్తన ప్రక్రియ యొక్క ప్రచండ వేగంతో నర పశువులను, నర కీటకాలను, నర పిశాచాలను దేవ మానవులుగా మార్చుతాడు. ఆ దేవ మానవులను చూచి ధరిత్రి యుగాల తరబడి గర్విస్తుంది. తన ఉగ్ర తపస్సుతో సమస్త మానవ జాతి యొక్క పాపాలను భస్మం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాడు ఆయన. పరమోజ్వలమైన ఆయన తపస్సే మానవ జాతికి ఉజ్వల భవిష్యత్తును నిర్మాణం చేస్తుంది.

ఈ పరమ విశ్వాసంతో పరశురామ భగవానుడు దివ్యదేహాలు ధరించిన ఆ మహాపురుషు లిద్దరివైపు చూచారు. ఆయన దృష్టిలో సహజమైన స్నేహభావం ఉంది. కర్తవ్యం పట్ల దీక్ష ఉంది. నిర్దేశం ఇవ్వాలనే ఆతురత ఉంది. అసలు వారు వచ్చింది అందుకోసమే కదా. ఒక్క క్షణం మౌనం వహించి, ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు-

హిమాలయపు హృదయ క్షేత్రంలో నివసిస్తూ మీరిద్దరూ ప్రజ్ఞావతారం జరిపే ఈ లీలకు సాక్షులుగా, సహచరులుగా ఉండండి. మీ శక్తులన్నింటినీ, సుదీర్ఘ సాధనలో పొందిన సిద్ధులన్నింటినీ యుగపరివర్తన మహాకార్యానికి అంకితం చేయండి. ఇదే యుగ సాధన. కల్కి అవతార చేతన మీకు ఆయా సమయాలలో తగు మార్గదర్శనం చేస్తూ ఉంటుంది.

పరశురామ భగవానుని నిర్దేశాన్ని పొంది ఆ దేవపురుషులిద్దరూ తమ గమ్యంవైపు పయనించారు. యుగ పరివర్తనకోసం జరుగుతూన్న యుగ సాధనలో త్వరగా పాల్గొనాలనే ఆలోచన వారికి ప్రేరణ ఇస్తోంది.

a a a

**ఏది చేయాలో ఏది చేయకూడదో తెలుసుకోవడమే విద్య.**

వ్యక్తి నిర్మాణం

# విజయానికి ఏడు మెట్లు

వ్యక్తిత్వం వెదజల్లే ఆకర్షకమైన వెలుగు విజయం. వ్యక్తిత్వం లోపల లోతైన పొరలలో దాగి ఉంటుంది విజయం. అది బయటినుంచి వచ్చేది కాదు. దాన్ని డబ్బుపెట్టి కొనుక్కోలేము. అది లోపలి గనులలో అణగి ఉంటుంది. దాన్ని త్రవ్వి తీసి విలువైన రత్నాల రాశిలా అలంకరించుకోవాలి. ఉద్యమ శీలత ద్వారానే, సమర్పణ భావన ద్వారానే వ్యక్తిత్వాన్ని మలచుకోవలసి ఉంటుంది. చెక్కుకోవలసి ఉంటుంది. తపనవల్ల, ఆ వేడివల్ల వ్యక్తిత్వ సుగంధం గుబాళిస్తుంది. కఠోర పరిశ్రమ, ధైర్యం, అంకిత భావం, సాహసం కలగలిసినప్పుడే విజయమనే నిష్పుకణం లభిస్తుంది. అది జీవితాన్ని వెలిగిస్తుంది.

వ్యక్తిత్వ సాఫల్యానికీ, జీవితంలో విజయానికీ ఏడు దివ్య సూత్రాలు ఉన్నాయి. ఈ సూత్రాలను శాస్త్రాలుగా చేసుకుని జీవితాన్ని వాటికి అనుగుణంగా తీర్చిదిద్దుకుంటే, వ్యక్తిత్వం తళతళా మెరిసిపోతుంది. వ్యక్తిత్వ నిర్మాణానికి ఆ ఏడు స్వర్ణ సూత్రాలు ఇవి-

1. మన పూర్తి బాధ్యతను మనమే వహించడం. ప్రోయాక్టివ్ కావడం.
2. సర్వతోముఖమైన యోజనను రూపొందించడం.
3. ప్రాధాన్య క్రమాలు ఆధారంగా కార్యాన్ని నిర్ణయించడం.
4. విజేతవలె ఆలోచించడం.
5. ఇతరులు చెప్పేదాన్ని వినే విజ్ఞతను అలవరచుకోవడం.
6. సరైన సమన్వయాన్ని సాధించడం.
7. ఎల్లప్పుడూ క్రొత్తదనాన్ని నిలిపి ఉంచుకోవడం.

విజయాన్ని చేకూర్చే దివ్యమూ, ప్రభావవంతమూ అయిన ఈ ఏడు సూత్రాలలో వైభవం, మహిమ, ఐశ్వర్యముల నిలయం, భండాగారం నిండి ఉంది. ఈ సూత్రాలలో భౌతిక జీవనంతోపాటు ఆధ్యాత్మిక జీవనపు అనంత అవకాశాలు ఇమిడి ఉన్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, వాటికి రూపం ఇవ్వడానికి మొదటి సూత్రం ప్రోయాక్టివ్‌గా ఉండడం. అనగా - మన జీవితానికి పూర్తి బాధ్యతను మనమే స్వయంగా స్వీకరించడం. ఈ భావనను లోతుగా అనుభూతి పొందడం విజయానికి ఒక నిర్ణాయకమైన చర్య. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితానికి బాధ్యులు మరొకరు ఎవరో కారనీ, స్వయంగా మనమేననీ, మన మంచి చెడు పరిస్థితులకు, ఫలితాలకూ బాధ్యత పూర్తిగా మనమీదనే ఉన్నదనే అవగాహన కలగడం ఒక మేలు కొలుపు, నిజమైన ఒక విజ్ఞత. ఈ విజ్ఞతతోపాటు, ఈ బాధ్యతాయుతత్వంతోపాటు -మనం మన జీవితానికి భాగ్య విధాతలం, నిర్మాతలం అనే ఎరుక కలుగుతుంది. ఈ ఎరుక మనల్ని మన లక్ష్యంవైపు ముందుకు నడిపిస్తుంది.

మన యోజన ఎలా ఉండాలో ఈ బాధ్యతాయుతత్వంవల్ల అవగాహన అవుతుంది. స్వామి వివేకానంద ఇలా అంటారు - 'మొదట్లోనే పెద్ద పెద్ద పథకాలు వేసుకోవద్దు. నెమ్మది నెమ్మదిగా పని ప్రారంభించు. నీవు ఏ నేలమీద నిలబడ్డావో దానిని గట్టిగా పట్టుకుని క్రమ క్రమంగా పైకి ఎక్కడానికి ప్రయత్నించు.' దీనితోపాటు - యోజన రూపురేఖలు స్పష్టంగా మన మనో ఫలకంపై ముద్రించబడి ఉండాలి. స్పష్టమైన చిన్నచిన్న పథకాలను జీవితంలో అమలుచేయడం, వాటిని పూర్తిచేయడం తేలికవుతుంది. వాటిని పూర్తి చేసినప్పుడు మనసుకు అపారమైన సంతోషం కలుగుతుంది. పని పూర్తయినప్పుడు ఆత్మవిశ్వాసం కూడ నిర్మాణం అవుతుంది. ఈ ఆత్మవిశ్వాసమే మరింత పెద్ద పనులు పథకాలు పూర్తి చేసే ప్రేరణను, ప్రోత్సాహాన్నీ మనకు ఇస్తుంది. జీవితంలో మహా కార్యాలను, మహా లక్ష్యాలను సాధించడంలో సఫలమయ్యే సామర్థ్యాన్ని మనకు ఇస్తుంది. మహాపురుషుల విజయాలకు తారకమంత్రం ఇదే - వారు మొదట చిన్న చిన్న స్పష్టమైన పథకాలను చేపడతారు. క్రమ క్రమంగా విజయ శిఖరాగ్రాలను ఆరోహణ చేస్తారు.

పథకపు రూపురేఖలు స్పష్టంగా చిత్రించుకున్న తర్వాతనే - ఏ పని అతి ముఖ్యమైనదో, ఏ పని మొట్ట మొదట చేయాలో, ఏ పనిని తర్వాత చేయాలో నిర్ణయించడం, ఎంపిక చేయడం సాధ్యపడతాయి. ఇలా పనుల ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించే సామర్థ్యమే విజయ రహస్యం. పరీక్షల సమయంలో విద్యార్థికి అన్నిటికన్న ముఖ్యమైన పని పరీక్షకోసం ఆయా విషయాలను సమగ్రంగా అధ్యయనం చేయడం. పరీక్షకు పూర్తిగా సిద్ధం కావడం. వర్షాకాలంలో రైతుకు మొట్టమొదటి పని

**డబ్బు బాహ్య ఆడంబరం. సుఖం లోపలి తరంగం.**

వ్యవసాయంపై దృష్టి నిలపడం. విద్యార్థికాని, రైతుకాని తన పనుల ప్రాధాన్యక్రమాన్ని నిర్ణయించుకోలేకపోతే, అతడి విజయం సందిగ్ధమే అవుతుంది. అలాగే - మనం కూడ మన జీవితంలో మన తప్పనిసరి అవసరాలు ఆధారంగా పథకం ప్రకారం ఆయా పనులను ఎంపిక చేసుకునే కళను అలవరచుకోవాలి. ఈ కళా కౌశల్యం లేకపోతే, జీవితం చుక్కాని లేని నావలా అలల తాకిడికి ఇటూ అటూ ఊగిపోతూ ఉంటుంది. చివరికి ఏదో సుడిగుండంలో చిక్కుకుని నదీ గర్భానికి చేరుకుంటుంది. నిర్ణయం తీసుకునే వ్యక్తి పురుషార్థ పరాయణుడు, కార్యశూరుడు అనిపించుకుంటాడు. అతడు జీవితపు చుక్కానిని తన చేతుల్లో దృఢంగా పుచ్చుకుని, అదృష్ట దురదృష్టాలనూ భవిష్యత్తునూ లెక్కచేయకుండా ఒడుపుగా గమ్యానికి చేర్చుతాడు. అతడి ఆలోచన ఎప్పుడూ విజేత ఆలోచనగా ఉంటుంది. విజయం అతడి కాళ్లను తాకుతుంది.

విజేత దృక్పథం జీవితంలో ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ, సృజనశీలతనూ నింపుతుంది. అలసిపోయి, ఓడిపోయి, నిరాశా నిస్పృహలకు లోనయిన జీవితపు అంధకారాన్ని చీల్చివేసి, ఆశాదీపాన్ని వెలిగిస్తుంది ఈ దృక్పథం. విజయం మనకు జన్మతో వచ్చిన హక్కు, ఎట్టి పరిస్థితిలోనూ మనం దాన్ని సాధించితీరుతాం - అనే విశ్వాసాన్ని ఈ దృక్పథం మనిషిలో నింపుతుంది. విజేతలోని ఈ ప్రచండ ఆత్మవిశ్వాసం అతడిని ఎన్నడూ అపజయం పాలు కానివ్వదు. విజేతలోని నిర్మాణాత్మక, భావాత్మక ఆలోచన అతనిలోని వ్యతిరేకాత్మక సంస్కారాలనూ, అలవాట్లనూ, ప్రవృత్తులనూ అన్నింటినీ పూర్తిగా అణచివేసి ముందుకు సాగుతుంది. నెపోలియన్‌వలె అతడు 'లేదు, కాదు' అనే మాటలను వినడానికిసైతం ఇష్టపడడు. ఎందుకంటే, 'లేదు, కాదు' అనే మాటలు పని మొదలుపెట్టకముందే మృత్యుతుల్యమైన అపజయాన్ని ఆహ్వానిస్తాయి. విజేత పురుషార్థ పరాయణుడుగా ఉంటాడు. పరాక్రమ వంతుడుగా ఉంటాడు. అతడి బుద్ధిలో ఎప్పుడూ 'అవును' అనే మంత్రమే ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అతడు ఇలా అంటాడు - అవును. నేనీ పని చేయగలను. నా ప్రాణాలను బలి చేయవలసివచ్చినా సరే, ఈ లక్ష్యాన్ని, ఉత్కృష్టమైన ఈ ఆశయాన్ని సాధించి తీరుతాను.

ఈ విజేత మనస్తత్వం వ్యక్తిలో శాశ్వత యౌవనం అనే దుర్లభమూ, అలౌకికమూ అయిన వరాన్ని నింపుతుంది. ఈ మనస్తత్వం పూర్ణ యౌవనానికి ప్రతీకం, ప్రతినిధి. ఇది వ్యక్తిని వయస్సు అనే పరిమిత సంకుచిత పరిధిలో బంధించదు. 70-80 సంవత్సరాల వ్యక్తి యువకునిలా క్రియాశీలంగా ఉండవచ్చు. 20-30 సంవత్సరాల వ్యక్తి ముసలివానిలా ఈసురోమంటూ ఉండవచ్చు. సమాజంలో, ప్రపంచంలో జిజ్ఞాసా, క్రియాశీలతా కలిగిన యువకుల కొరత విపరీతంగా ఉండడం ఈ యుగంలో మహావేదన కలిగించే అంశం. బలిష్ఠమైన యువకుల భుజ స్కంధాలమీదనే జాతి భారం నిలచి ఉంటుంది. ఎందుకంటే, యౌవనం జిజ్ఞాసకూ, బాధ్యతాయుతత్వానికీ, సృజనకూ మహాప్రతీక. ఆ వయస్సులోనే జీవించాలనే అడ్డులేని ఆకాంక్ష, నేర్చుకోవాలనే అనంతమైన కాంక్ష, ప్రాణాలతో ఆడుకోవాలనే సంఘర్షశీలత, మహాసాహసం - ఇవన్నీ సమన్వయం పొందుతాయి. వినే, అర్థం చేసుకునే, పూర్వాపరాలను బేరీజు వేసే అపారమైన సామర్థ్యం యౌవనంలోనే ఉంటుంది. భవిష్యత్తు గురించిన బంగారు కలలను నిజం చేసే మహాసాహసం యౌవనంలోనే పరిపక్వం అవుతుంది.

యౌవనంలోని ఈ ప్రత్యేక లక్షణాన్ని ఏ వయస్సులో అయినా అలవరచుకోగలుగుతాము. ఏ వయస్సులో అయినా - తన్మయత్వం, అంకితభావం, పనిలో పూర్తిగా నిమగ్నమయే లక్షణం ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్ని సృష్టిస్తాయి. 'శ్రేష్ఠమూ, ఉత్కృష్టమూ, మహత్తరమూ అయిన లక్ష్యాన్ని సాధించడానికై ఇప్పుడు కూడా ప్రాణ శక్తి, శక్తి సామర్థ్యాలు ఏమాత్రం మొక్కపోలేదు. అవి తరిగిపోలేదు. జీవించి ఉన్నాయి. జీవితంలోని చివరి ఘట్టంలో ఇప్పటికీ జిజ్ఞాస, ఉద్యమశీలత, సంఘర్షించే లక్షణం నాలో నిండి ఉన్నాయి' - అని చెప్పగలగడం వ్యక్తిత్వంలోని యౌవనానికి నిజమైన అర్థం. ప్రతి యువకునిలో ఈ జిజ్ఞాసా తరంగాలు పొంగి పొరలాలి. రాయిలా జడపదార్థంగా మారిన అంతరంగంలో జీవించే, నేర్చుకోవాలనే ఆకాంక్ష తిరిగి రగలాలి. తన కోసం, తన జాతి కోసం జీవితాన్ని బలిదానం చేయాలనే సంకల్పం మేలుకొనాలి. సామూహికంగా, సంఘటితంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగే సాహసం, ఔదార్యం మనలో విజృంభించాలి. జీవన లక్ష్యాన్ని చేరే పథం నుండి మనలో ఏ ఒక్కరూ తప్పిపోకూడదు. పరస్పర సమన్వయం, నిజమైన సమరస భావన - ఇది విజయానికి మరో దివ్య సూత్రం. సినర్జీగా నేడీ భావం ప్రసిద్ధి పొందింది.

**ఇవ్వడానికి ఏదైనా ఉన్నపుడే తీసుకోవడం భావ్యం.**

సినర్జీ (అనగా నిజమైన సమన్వయ సామరస్యాలు) లోనే ప్రేమ, ఆత్మీయత, ఔదార్యం, సహానుభూతి, సహయోగం, సహకారం, సేవ అనే సద్గుణాలు వికసిస్తాయి. ఈ సమరసత మనలో ఆంతరిక శక్తిని నింపుతుంది. ఫలితంగా, జీవన వీణ శ్రావ్యంగా మ్రోగుతుంది. ఈ ఏకాత్మ భావన లోపించినందువల్లనే ఇంతటి ఉదాసీనత ఉంటోంది. ఇంతటి దుఃఖం ఉంటోంది. ఇంతటి వ్యధ ఉంటోంది. ఆ కారణం వల్లనే వ్యక్తిలో, సమాజంలో, విశ్వంలో ఇంతటి అంధకారం ఉంది. ఇంతటి హింస ఉంది. ఇంతటి విద్వేషం ఉంది. నిజమైన స్వర మేళనం లేనందువల్లనే వైరుధ్యాలతో కూడిన, ఆలోచన లోపించిన, గొంతులు కోసే పోటీ విజృంభిస్తోంది. హృదయాల కలయిక ఈ వైషమ్యాలను, ఈ దుఃఖ దైన్యాలను దూరం చేస్తుంది. కలసికట్టుగా, సంఘటితంగా పని చేసేందుకు ప్రేరణనూ, ప్రోత్సాహాన్ని ప్రదానం చేస్తుంది. నిజమైన సామరస్యం మన ఆంతరిక చేతనలో అంకురిస్తుంది. ఈ భావన అంతరాంతరాలలో ఉదయిస్తుంది. దీన్ని బయటి నుంచి రుద్దడం వల్ల శాశ్వత ప్రయోజనం ఉండదు. నిజమైన సామరస్యం ఒకప్రక్క విపరీత పరిస్థితులలో సైతం వ్యక్తిని కలిపి నిలిపి ఉంచుతుంది. మరోప్రక్క ప్రగతికీ, వికాసానికీ క్రొత్త క్రొత్త ద్వారాలు తెరుస్తుంది.

నిజమైన సామరస్య భావన ప్రతిరోజూ క్రొత్తపని చేయడానికీ, క్రొత్త ఆలోచన చేయడానికీ, క్రొత్త పథకం రూపొందించడానికీ మనకు ఉత్సాహాన్ని, ప్రేరణను ఇస్తుంది. చేసిన పనిని మరింత సమర్థవంతంగా ఎలా చేయాలి? మన పరిస్థితికీ, మన సాధన సంపత్తికీ అనుగుణంగా మరింత ఉత్తమోత్తమ పథకాలను ఎలా రూపుదిద్దాలి? అని ఆలోచించేందుకు ప్రేరణ మనకు ప్రతిరోజూ ఆత్మ పరీక్ష చేసుకోవడం ద్వారా, ఆంతరిక పరిశోధన చేసుకోవడం ద్వారా లభిస్తుంది. ఆత్మ బోధను, తత్వబోధను సాధన చేయడం ద్వారా ఈ ఆత్మావలోకనం బాగా తేలిక అవుతుంది. బాగా సులువు అవుతుంది. సహజమూ, సరళమూ అయిన ఈ సాధన ద్వారా ప్రతిరోజూ మనకొక క్రొత్త జీవితమనీ, ప్రతిరాత్రీ మనకొక మరణమనీ అనుభూతి పొందడం జరుగుతుంది. ఇందువల్ల ప్రతిరోజూ మన పనులను బేరీజు వేసుకునే అవకాశం, మన వ్యక్తిత్వాన్ని లోతుగా అంచనా వేసుకునే అవకాశం మనకు లభిస్తాయి. ప్రతిరోజూ ఒక క్రొత్త సంకల్పం ప్రారంభం అవుతుంది. ప్రతిరోజూ ఒక క్రొత్త పని ప్రారంభం అవుతుంది. ఇందువల్ల మన వ్యక్తిత్వం ఇతరులను ఇట్టే ఆకర్షిస్తుంది. విజయ పరంపరలను మనం అంది పుచ్చుకుంటాం.

విజయ సాధనకు ఉపకరించే ఈ ఏడు సూత్రాలలో వ్యక్తిత్వ నిర్మాణంలోని, వ్యక్తిత్వ వికాసంలోని రహస్యం ఇమిడి ఉంది. ఈ సూత్రాలను దృఢ సంకల్పంతో జీవితంలో అమలు జరిపితే, వ్యక్తిత్వం సంస్కరించబడి, ఆకర్షవంతం అవుతుంది. అలాంటి వ్యక్తిత్వంద్వారానే ఒక క్రొత్త ఆధ్యాత్మిక జీవితానికి శ్రీకారం చుట్టవచ్చు. భౌతిక విజయాలను అందించడంతోపాటు ఆధ్యాత్మిక జగత్తులో ప్రవేశించడానికికూడా ఈ సూత్రాలు తారక మంత్రాలు అవుతాయి.

G G G

## తలపాగా ఎందుకు?

ఎవరి అంతఃకరణ ఉదారమైనదో వారు ప్రతి చిన్న వస్తువుకూ విలువ నిస్తారు. ఎవరి కార్యక్షేత్రం విశాల విశ్వమో వారు పరిమితమైన స్వార్థ పరిధిలో ఎలా బంధించబడి ఉండగలరు?

ఒక రైతు గాంధీజీ దర్శనార్థమై వచ్చి తలమీద టోపీలేని గాంధీజీని చూచి ఆశ్చర్యంతో లోకమంతా ఖ్యాతి చెందిన గాంధీ టోపీ గాంధీజీ నెత్తిన లేకపోవటమేమిటని ప్రశ్నించాడు. దానికి గాంధీజీ రైతు తలమీద ఉన్న పాగాను తీక్షణంగా చూస్తూ - ఇంత పెద్ద బట్టను నీ వంటివారు తలపాగాగా ఉపయోగించినంతకాలం నాలాంటి వాళ్లు ఇలా బోడితలతో ఉండక తప్పదని బదులు పలికేరు. పాగాకి ఉపయోగించే బట్ట కూడా అవసరానికి మించి ఉపయోగిస్తే ప్రజలను దోచుకొన్నట్లేనని బాపూ మాటలు స్పష్టంగా తెలియచేశాయి. ఆ రైతు పాగాను పరిత్యజించి అశ్రునయనాలతో ఆ మహనీయునికి ప్రణమిల్లాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సద్భావం కలిగి సత్కర్మ చేసే ఆత్మలు పరమాత్మకు ప్రియమైనవి.**

# మనం-మన ఆరోగ్యం

# 'విహారం'లో పాటించవలసిన నియమాలు

శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం తీసుకోవడంతోపాటు విహారం గురించి కూడా శ్రద్ధ తీసుకోవాలి. క్రింది అంశాలను చింతన చేసి, మననం చేసి, వీటిని మన స్వభావంలో అంతర్భాగాలు చేసుకోవాలి.

## 1. శ్రమించడంలో సమతూకం

ప్రతి ప్రాణికీ శ్రమించడం అత్యవసరం. శ్రమించకపోతే అవయవాలు పట్టుకుపోతాయి. ఆహారం జీర్ణం కావడంలో, రక్త ప్రసరణలో ఆటంకాలు ఏర్పడతాయి. సమతూకంతో కూడిన శ్రమను మన దినచర్యతో ముడిపెట్టాలి. శ్రమ ప్రయోజనం అత్యధికం. శరీరంలోని అవయవాలు తమ తమ పనులను సక్రమంగా చేయడం, రక్త ప్రసరణ సక్రమంగా ఉండడం, జీర్ణ మండలంలోని ప్రక్రియలు సవ్యంగా సాగడం - అన్నింటికీ శ్రమించడం అత్యవసరం.

బద్ధకంతో సమయాన్ని వృధా చేసేవారు, శ్రమించకుండా తప్పించుకునేవారు మలబద్ధం, గ్యాస్, తలనొప్పి, మధుమేహం, కీళ్లవాతం వంటి రోగాలకు గురి అవుతారు. సృష్టిలోని ఇతర ప్రాణులు ఆహారాన్ని వెదకడానికీ, ఆశ్రయాన్ని వెదకడానికీ, ప్రమాదాలనుండి తప్పించుకోవడానికీ, వినోదానికీ పరుగులు పెడుతూ ఉంటాయి. అవి బలిష్టంగా ఉండడానికి కీలకం ఇదే.

## 2. విశ్రాంతిలో సమతూకం

శ్రమించిన తర్వాత తగినంతగా విశ్రాంతి తీసుకోవడం అత్యవసరం. అత్యధిక శ్రమవల్ల ఖర్చయిన శక్తి పుంజుకుని, తర్వాతి పనులకు తగినంతగా జీవం, జవం పొందడం అవసరమనే సిద్ధాంతం ఆధారంగా పగలు తర్వాత రాత్రి, జీవితం తర్వాత మరణం అనే క్రమం ఏర్పడింది. శ్రమకూ, విశ్రాంతికీ ఇలాంటి సంబంధమే ఉంది. మనం శరీర శ్రమ చేయాలి. దానితోపాటు విశ్రాంతి తీసుకోవడం మరువకూడదు. జీవితంలో సమతూకానికి ఆధారం ఇదే. ఇందువల్ల శక్తి, శాంతి లభిస్తాయి.

ఆరునుండి ఎనిమిది గంటలపాటు గాఢంగా నిద్రపోవడం తప్పనిసరి. నశించిన జీవకణాల తొలగింపు, కొత్త జీవకణాల నిర్మాణం నిద్రావస్థలో వేగంగా జరుగుతాయి. శ్రమవల్ల జీవకణాలు నశిస్తాయి. కనుక అలసట కలుగుతుంది. శరీరం శ్రమ తర్వాత విశ్రాంతి కోరుతుంది. తగినంతగా నిద్రపోయిన తర్వాత శరీరంలో జీవశక్తి పెరుగుతుంది. కొత్త స్ఫూర్తి అనుభవం అవుతుంది.

పనిచేసి అలసిపోయిన తర్వాత కూర్చుని లేక పడుకుని శారీరికమైన అలసటను తొలగించుకుని, మనసులో మాత్రం దురాలోచనలు సుళ్లు తిరుగుతూ ఉండే స్థితి విశ్రాంతి కానే కాదు. విద్వేషం, క్రోధం, ప్రతీకారం, హింస మున్నగు భావాలు చెలరేగుతున్నపుడు శరీరం విశ్రాంతి తీసుకున్నా శాంతి లభించదు. మనస్సు అశాంతిగా ఉంటే, దాని చెడు ప్రభావం శరీరంమీద పడుతుంది. అందువల్ల ధమనులు శిథిలం అవుతాయి. రక్తం చెడిపోతుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. మానసిక ఒత్తిడిని తొలగించుకుని శారీరికమైన అలసటను అంతం చేసుకున్నప్పుడే విశ్రాంతి సార్థకం అవుతుంది.

మానసిక ఒత్తిడివల్ల జనానికి అంత త్వరగా నిద్ర పట్టదు. శరీరం మంచంమీద పడుకుని ఉంటుంది. కాని అందువల్ల విశ్రాంతి తీసుకునే అవసరం పూర్తి కాదు. ఇలాంటి స్థితి వచ్చినప్పుడు శరీరాన్ని వదులు (రిలాక్స్) చేయడానికి ప్రయత్నించాలి. విశ్రాంతి తీసుకునేముందు మన మనస్సును చింతలు లేకుండా చేయాలి. శరీర అవయవాలన్నింటినీ పూర్తిగా వదులుచేసి, కళ్లు మూసుకోవాలి. మీరు శరీరంలోని ఏదో ఒక అవయవాన్ని గురించి ఆలోచించడం ప్రారంభించినప్పుడు లోపల లోపల ఆ అవయవం వదులు అవుతుంది. ఈ విధంగా క్రమంగా రెండు చేతులు, కాళ్లు, తల మున్నగు అవయవాలను గురించి ఆలోచిస్తూ అన్ని అవయవాలనూ వదులు చేయడం అభ్యాసం చేయడంవల్ల మనం కోరుకున్న ప్రకారం శరీరాన్ని వదులు చేసి పూర్తి విశ్రాంతిలోని ఆనందాన్ని పొందడం సులువు అవుతుంది. ఒకటి రెండు వారాలలో ఈ క్రియ సహజం అయిపోతుంది. విశ్రాంతి తీసుకునే ముందు ఇలా శరీరాన్ని వదులు చేయడంవల్ల మంచి నిద్ర, గాఢ నిద్ర పడుతుంది. ఆ అనుపాతంలో శరీరానికి శక్తి లభిస్తుంది. తర్వాత పని చేయడానికి అది జీవం జవం తెచ్చుకుంటుంది.

## 3. శ్వాస సరిగా తీసుకోవాలి

ఊపిరితిత్తులు శ్వాస ద్వారా మన రక్తాన్ని శుభ్రపరుస్తాయి. ప్రతి జీవాణువుకూ ప్రాణవాయువు అందుతుంది. స్వచ్ఛమైన

**ఆదర్శాలకు అంకితం కావడం దైవప్రేమకు కొలబద్ద.**

వాయువు అందడానికై లోతుగా గాలి పీల్చుతూ ఉండాలి. రాత్రి నిద్రపోయేటప్పుడు ముఖం కప్పుకోకూడదు. నిద్రపోయేటప్పుడు గది కిటికీలు తెరచి ఉంచాలి. గాలి ముక్కుతోనే పీల్చడం అలవాటు చేసుకోవాలి. వంగి కూర్చొన కూడదు. కూర్చునే టప్పుడూ, నడిచే టప్పుడూ నడుము నిటారుగా ఉండాలి. లోతుగా గాలి పీల్చే అలవాటు చేసుకోవాలి. అందువల్ల స్వచ్ఛమైన గాలి తగినంతగా లోపలికి ప్రవేశించడానికీ, మలినమైన గాలిని బయటకి వదలడానికీ వీలు కలుగుతుంది. ఇంటి నలువైపులా పచ్చదనం వ్యాపించి ఉండాలి. అందువల్ల మనకు అత్యవసరమైన ప్రాణవాయువు లభిస్తుంది. చెట్లమధ్య ఇల్లు కట్టుకోవాలి. లేదా, ఇంటిచుట్టూ చెట్లు పెంచాలి. నియమబద్ధంగా ప్రాణాయామం చేయాలి.

## 4. పరిశుభ్రత

శరీరంలోని ప్రతి అవయవాన్నీ శుభ్రపరచాలి. రోమకూపాలు మున్నగు వాటిని శుభ్రపరచే పద్ధతులు నేర్చుకుని అమలు చేయాలి. ప్రాతఃకాలం చన్నీళ్లతో స్నానం చేయాలి. స్నానానికి ముందు చర్మాన్ని చేతితో రుద్ది రుద్ది ఎర్రబడేలా చేయాలి. స్నానం తర్వాత చర్మాన్ని ఎండబెట్టాలి. శరీరంలోని ప్రతి భాగాన్నీ శుభ్రంగా ఉంచడం, ఎక్కడా మురికి చేరకుండా చూడడం - ఇదే స్నానం చేయడంలోని ఉద్దేశ్యం. భోజనం తర్వాత త్రేన్చాలి. నోరు శుభ్రం చేసుకోవాలి. పళ్లమధ్య మెతుకులు, ఇతర ఆహార కణాలు ఇరుక్కోకుండా చూడాలి. ఆహారం, నీరు, గాలి - వీటికి ఆధారాలు అన్నీ స్వచ్ఛంగా ఉండేటట్లు తగు జాగ్రతలు తీసుకోవాలి.

మూత్రశాల, మరుగుదొడ్డి, వంటింటి గొట్టాలు, నీరు నిల్వచేసే స్థలం మున్నగునవి శుభ్రంగా ఉండేటట్లు పూర్తి జాగ్రతలు తీసుకోవాలి. ఎందుకంటే, రోగక్రిములు ఇలాంటి స్థలాలలో పెరుగుతాయి. అవకాశం చూచుకుని ఆక్రమించి శరీరాన్ని రోగగ్రస్తం చేస్తాయి.

## 5. త్వరగా నిద్ర లేవాలి

ప్రాతఃకాలం త్వరగా లేవడం, రాత్రి త్వరగా నిద్రపోవడం అన్నది ఒక నియమంగా చేసుకోవాలి. బ్రహ్మ ముహూర్తంలో ప్రాణశక్తి ప్రవహిస్తూ ఉంటుంది. ఉదయం త్వరగా నిద్రలేచే వ్యక్తి క్రియాశీలంగా, స్ఫూర్తిమంతుడుగా, ప్రసన్నుడుగా, ఆరోగ్యవంతుడుగా నిలచి ఉంటాడు.

## 6. నడక

ప్రాతఃకాలంలో త్వరగా నిద్రలేచి నడవడం అన్ని వయసులవారికీ ఆరోగ్యకరం. శరీరికంగా బలహీనంగా ఉన్న వ్యక్తులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అందరూ తమ తమ పరిస్థితులకు అనుగుణంగా నడక అలవాటు చేసుకుని ప్రయోజనం పొందవచ్చు. దీనివల్ల హాని కలిగే అవకాశం ఏమాత్రం లేదు. నడవడం తేలిక అయిన వ్యాయామం.

నడక శరీరానికే కాక మనసుకూ మంచిదే. దీనివల్ల మనస్సు ప్రసన్నం అవుతుంది. కనుకనే, దీన్ని మించిన వ్యాయామం లేదని ప్రపంచంలోని ఆరోగ్య నిపుణులూ, మహాపురుషులూ సలహా ఇచ్చారు. తమ నిత్య జీవనంలో ఆ నియమాన్ని అమలు జరిపారు. రోజంతా దుకాణాలలో కూర్చునేవారు, కార్యాలయాలలో కూర్చుని పని చేసేవారు, బుద్ధిజీవులు - అందరికీ నడక అత్యవసరం. ఇందువల్ల శరీరం అంతటికీ సహజంగా వ్యాయామం జరుగుతుంది.

నడకవల్ల శరీరం అంతటిలో జవ సత్వాలు నిలచి ఉంటాయి. ఊపిరితిత్తులకూ, గుండెకూ బలం పెరుగుతుంది. భోజనం జీర్ణ మవుతుంది. శరీరాన్ని శుభ్రపరచే అవయవాలు వేగంగా పని పూర్తి చేస్తాయి. నియమబద్ధంగా ఆరుబయట నడవడంవల్ల, తద్వారా స్వచ్ఛమైన గాలి పీల్చడంవల్ల దీర్ఘాయువు లభిస్తుంది. లావుగా ఉన్న వ్యక్తులు సన్నబడతారు. ఉచ్ఛ్వాస నిశ్వాసముల ప్రక్రియ మెరుగవుతుంది. అందువల్ల వ్యాయామం, ప్రాణాయామాలు రెంటి ప్రయోజనమూ చేకూరుతుంది, లోతుగా శ్వాస పీల్చుతూ వేగంగా నడవడంవల్ల మలబద్ధం తొలగిపోతుంది.

## 7. ఉషా పానం

సూర్యోదయానికి పూర్వం కాలకృత్యాలకు వెళ్లే ముందు రెండు గ్లాసుల మంచినీళ్లు త్రాగడం ఉషాపానం. ఆ మంచినీళ్లు రాగి పాత్రలో రాత్రంతా ఉంచినవి అయితే - అది అత్యుత్తమం. ఉషాపానంవల్ల మూత్రపిండాలు బలపడతాయి. కళ్లలో వెలుగు పెరుగుతుంది. తల వెంట్రుకలు త్వరగా తెల్లబడవు. శరీరం నిర్మలం అవుతుంది. ప్రేవులు క్షాళన అవుతాయి. మలబద్ధం తొలగిపోతుంది.

## 8. నవ్వు, నవ్వించు

నవ్వుల గలగలలు, పకపకల ధ్వనులు ఎక్కడ మాయమైనాయో ఈనాడు. కృత్రిమ సభ్యత మనిషి నిద్రనూ, శాంతినీ హరించివేసింది. ఎటు చూచినా ఉరుకులూ, పరుగులూ. ఎవరికీ క్షణం తీరిక లేకుండా పోయింది. ఒకవేళ తీరిక దొరికినా - ఒత్తిళ్ల కోసం, చింతల కోసం, ఉద్విగ్నతలకోసం మాత్రమే.

**లక్ష్యప్రాప్తి పట్ల తన్మయత్వం సాధకునికి గుర్తు.**

ఫలితంగా శరీరం రకరకాల రోగాలకు నిలయం అవుతోంది. చిత్ర విచిత్రమైన మానసిక రోగాలు మనిషిని కృంగదీస్తున్నాయి. శరీర ఆరోగ్యం కోసం, మానసిక సంతులనం కోసం, జీవితంలో సుఖ శాంతుల కోసం మనిషి రకరకాల సాధనాలను సమకూర్చుకుంటున్నాడు. వీటన్నిటి కోసం ఎంతో సమయం, శ్రమ, డబ్బు ఖర్చు చేస్తున్నాడు. కానీ, అతడికి మిగులుతూన్నవి అసఫలత, అశాంతి, అసంతృప్తి మాత్రమే.

మనిషి ఒత్తిడి నుండి విముక్తి పొందినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ విముక్తి ఔషధాలవల్ల కలుగదు. నవ్వుల గలగలలవల్ల లభిస్తుంది. మానవ స్వభావంలోని రహస్యాలు తెలిసిన నిపుణులు చెపుతూన్న మాట ఇది. పకపకా నవ్వడం, కడుపుబ్బ నవ్వడం, ఆనందం వెదజల్లేలా గలగలా నవ్వడం, విరగబడి నవ్వడం - ఇదే ఈ సమస్యలన్నింటికీ దివ్య ఔషధం. నవ్వువల్ల కలిగే బహుముఖ ప్రభావాలపై, ప్రయోజనాలపై వైజ్ఞానిక నిపుణులు ఎన్నెన్నో పరిశోధనలు చేశారు. నవ్వును మించిన ఔషధం లేదని వారు తేల్చి చెప్పారు.

## కొన్ని ఇతర సూచనలు

1. తుమ్ము, మూత్ర విసర్జన, మల విసర్జన మున్నగువాటిని ఆపకూడదు.

2. మనస్సును ఇంద్రియాలకు అధిపతిగా పరిగణించాలి. సంయమనంతో కూడిన జీవన విధానాన్ని అనుసరించాలి.

3. సింథటిక్ వస్త్రాలను, బాగా బిగుతుగా ఉండే వస్త్రాలను ధరించకూడదు.

4. ఎత్తు మడమల బూట్లను, చెప్పులను వాడకూడదు.

5. నియమబద్ధంగా ఉపాసన, సాధన తప్పనిసరిగా చేయాలి. అనగా-జపం, ధ్యానం, పూజ, స్తోత్రం మున్నగునవి.

6. సదాచారాన్ని, సద్భావనను, సేవాభావాన్ని, పరోపకారాన్ని అలవరచుకోవాలి.

7. అసూయ, ద్వేషం, చింత, భయం, క్రోధం మున్నగు తీవ్ర భావాలను దూరంగా ఉంచడానికి ప్రయత్నించాలి.

8. రోజూ ఒక గంటసేపు సత్ సాహిత్యాన్ని స్వాధ్యాయం చేయాలి.

9. మనస్సును నిశ్చింతగా ఉంచుకుని ఆరునుండి ఎనిమిది గంటలపాటు గాఢ నిద్ర పోవాలి.

10. టీవిని దగ్గరగా ఉండి చూడకూడదు. రోజంతటిలో ఒకటి రెండు గంటలకు మించి టీవి చూడకూడదు.

11. కృతిమ వాసనలకు దూరంగా ఉండాలి.

పైన చెప్పిన విహారానికి సంబంధించిన నియమాలను పాటిస్తూ మనమంతా ఆరోగ్యంగా, సుఖంగా జీవించడానికి ప్రయత్నిద్దాం. ఈ నియమాలను పాటించడానికి ఇతరులకు ప్రేరణ ఇద్దాం.

K K K

## లోభికి శాస్తి

ఎవరైతే సంగ్రహించాలని తపన పడుతూఉంటారో వారికి కేవలం సంగ్రహిస్తున్న ఆనందమే తప్ప, సద్వినియోగం చేయటానికి కావలసిన ఏ ఒక్క మంచి ఆలోచనా తట్టదు. అలా చివరకు దుర్గతి పాలు అవుతారు.

ఒక లోభి ఉండేవాడు. ఎంతో ఆర్జించినా ఒక్క పైసా ఎవ్వరికీ ఈయక సొంతానికి ఖర్చుచేసికోక ఎవరికీ తెలియకుండా అడవికి పోయి రహస్యంగా భూమిలో త్రవ్వి పాతిపెట్టేవాడు. ఒకరోజు ధనంతో నిండిన కుండను నెత్తిన పెట్టుకొని అడవిలోకి పోతూఉండగా ఒక దొంగ అనుమానం కల్గి అతడిని అనుసరించి రహస్యంగా దాగుకొని విషయాన్ని తెలిసికొన్నాడు. లోభి పనిని పూర్తి చేసికొని వెళ్ళగానే దొంగ నెమ్మదిగా పాతిపెట్టిన ధనాన్ని తీసికొని కుండ నిండా రాళ్ళు రప్పలు నింపి యథాప్రకారం నేలను పూడ్చివేసి వెళ్ళిపోయాడు.

చాలా కాలం వరకు లోభి దూరాన్నుండే పాతిపెట్టిన ప్రదేశాన్ని చూసుకొని సంతృప్తి చెంది వెళ్లి పోయేవాడు. చివరకు ఒకనాడు నేలను త్రవ్విచూడగా రాళ్ళు రప్పలు కనిపించాయి. గుండె బాదుకొని రోదిస్తూ ఇల్లు చేరుకొన్నాడు. గ్రామ పెద్దలు ఇతన్ని ఓదారుస్తూ నీ ధనం అక్కడే ఉన్నా, ఆ చోటు మారినా నీకు పెద్ద తేడా ఏమీ లేదు. అక్కడే ఉన్నదని భావించుకోమని నచ్చచెప్పారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**శత్రువును కోరుకుంటే ఎదుటివాడిని దాటి వెళ్లు. మిత్రుడిని కోరుకుంటే ఎదుటివాడిని దాటి వెళ్లనివ్వు.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 3

# ఏనీ బీసెంట్ భవిష్యవాణి

1911 సంవత్సరానికి దేశ చరిత్రలో మహత్తరమైన స్థానం ఉంది. ఆరు సంవత్సరాల ముందు 1905లో మొదటి వైస్‌రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ రాష్ట్రాన్ని విభజించాడు. ఈ విభజన భారత జాతిని కుదిపివేసింది. మేలుకొలిపింది. వైస్‌రాయ్ నిర్ణయంతో ప్రజలలో ఆగ్రహావేశాలు కట్టలు త్రెంచుకున్నాయి. ప్రజలు బ్రిటిషు వస్తువులను, ముఖ్యంగా ఇంగ్లండులో తయారైన వస్త్రాలను బహిష్కరించడం ప్రారంభించారు. "వందేమాతరం" నినాదం మిన్నుముట్టింది. ప్రజలు భారత్‌ను మాతృభూమిగా, మాతగా పూజించసాగారు. మాతృభూమిని ఆంగ్లేయుల దాస్యంనుండి విముక్తి చేయాలనే చైతన్యం ప్రజలలో ఉద్భవించింది. బ్రిటిషు ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సహించలేకపోయింది. చీలికలు తెచ్చే విధానాన్నీ, దమన విధానాన్నీ అది అనుసరించింది. ఉద్యమంలో పాల్గొనేవారిపై జరిమానాలు విధించింది. వారి సౌకర్యాలను రద్దు చేసింది. వారిని ఉద్యోగాలనుండి తొలగించింది. అయినా ఉద్యమం ఆగలేదు. ఫలితంగా దమనకాండ తీవ్రమయింది.

ఈ దమనకాండవల్ల ప్రజల ఆగ్రహావేశాలు మరింతగా విజృంభించాయి. సాయుధ ప్రతిఘటన, విప్లవవాద కార్యకలాపాలు ప్రారంభమైనాయి. ప్రజాభిప్రాయానికి ప్రభుత్వం లొంగవలసి వచ్చింది. చివరికి 1911లో బెంగాలు విభజనను ప్రభుత్వం రద్దుచేసింది. చరిత్రవేత్త రమేశ్ చంద్ర మజుందార్ ఇలా వ్రాశారు: "భారత ప్రజలు తొలిసారిగా తీవ్ర వ్యతిరేకతను ప్రకటించారు. ఆ రోజులలో దేశంలోని వివిధ భాగాలలో రహస్య సమితులు ఏర్పడ్డాయి. తమ కార్యకలాపాలను ఉధృతం చేశాయి. బ్రిటిషు పాలనను పెల్లగించివేయడమే వాటి విస్పష్ట లక్ష్యం. బెంగాలులోనే కాక పంజాబు, మద్రాసువంటి దూర ప్రాంతాలలో కూడ అశాంతి ప్రబలింది. ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు విప్లవవాదులను అడ్డుకోలేకపోయాయి. బెంగాలు విభజనను రద్దుచేయడం తప్ప మరే చర్య తీసుకున్నా శాంతించని మహావేశం అది. 1911 డిసెంబరులో ఢిల్లీ దర్బారు సందర్భంలో అయిదవ జార్జి చక్రవర్తి, మహారాణి బెంగాలు విభజనను రద్దు చేశారు."

## నవజాగరణకు నాంది

భారత రాజధానిని కలకత్తానుండి ఢిల్లీకి మార్చే నిర్ణయాన్ని కూడ ఆ ఢిల్లీ దర్బారులో ప్రకటించారు. ఈ నిర్ణయాలు రెండూ పరస్పర పూరకాలుగా ఋజువైనాయి. రాజధాని ఢిల్లీకి మారడంతో విప్లవవాదుల తీవ్రత కొంత తగ్గింది. ఆ ఉద్యమం అలా విజృంభించి ఉంటే, స్వరాజ్య చైతన్యాన్ని మేలుకొలపడానికి అన్ని సంవత్సరాలు పట్టి ఉండేది కాదేమో. ఈ చర్యవల్ల బ్రిటిషు ప్రభుత్వానికి ప్రయోజనం కలిగింది. ప్రజల ఆగ్రహానికి వెంటనే గురికావలసిన అవస్థ దానికి తప్పింది. ఈ నిర్ణయం తీసుకోవడంలో ప్రముఖ పాత్ర వహించిన వైస్‌రాయ్ లార్డ్ హార్డింజ్‌పై ఆనాడు విమర్శ వచ్చింది. ఇక్కడి బ్రిటిషు అధికారులూ, బ్రిటిషు ప్రజలూ ఆయనను నానామాటలూ అన్నారు. అయితే ఆయన నిర్ణయం సరైనదని కాలం నిరూపించింది. ఆ నిర్ణయం జరిగిన మూడు సంవత్సరాల తర్వాత మొదటి ప్రపంచ యుద్ధం వచ్చిపడింది. అప్పుడు దేశంలోని సంస్థానాధిపతులూ, సమాజంలోని ఉన్నత వర్గాలవారూ ఆంగ్లేయులను బాహాటంగా ఆదుకున్నారు. యుద్ధం ముగిసిన తర్వాత బ్రిటిషు ప్రభుత్వం మాట తప్పింది. తన హామీలు పెక్కింటిని అమలు చేయలేదు. మరోప్రక్క భారతీయ సమాజంలో ఉదయించిన ఆత్మవిశ్వాసం, జాగరణ నిరంతరం తీవ్రతరం అవుతూవచ్చాయి.

1911నాటి రాజకీయ సంఘటనలు భావి పరిణామాలను ప్రభావితం చేశాయి. దేశ భవిష్యత్తును నిర్ణయించిన సంవత్సరం అది. సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడ ఆ రోజులలో అనేక మహత్తర పరిణామాలు జరిగాయి. ఆ సంవత్సరం భారతీయ ధర్మంపై, అధ్యాత్మపై గల మహత్తర విశ్వాసం కొత్త రూపంలో వ్యక్తమయింది. ఆ నవజాగరణ సమయంలో రాజా రామమోహన రాయ్, కేశబ్ చంద్ర సేన్, మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్, మహాదేవ గోవింద రానడే, గోపాల కృష్ణ గోఖలే, లోకమాన్య తిలక్ మున్నగు మనీషులూ, నాయకులూ దేశపు గత వైభవ గరిమనూ, ఆంతరిక సామర్థ్యాన్నీ కళ్లకు కట్టినట్లు ప్రజలకు వర్ణిస్తున్నారు. మేడమ్ బ్లావెట్స్కీ, కర్నల్ ఆల్కాట్, ఏనీ బీసెంట్ మున్నగు ఐరోపా విద్వాంసులు భారతీయ అధ్యాత్మను కీర్తిస్తున్నారు. స్వామి వివేకానంద పాశ్చాత్య దేశాలలో భారతీయ ధర్మ సంస్కృతుల విజయ దుందుభిని మ్రోగించారు. దాని ప్రతిధ్వని ఈ విభూతుల వాణిలో, కర్మలో వినిపించింది.

పాశ్చాత్య విద్వాంసులు భారతీయ ధర్మ దర్శనాల మూలతత్వాన్ని ముక్త కంఠంతో కొనియాడారు. అది ఆధారంగా నవప్రపంచ రచన జరగాలని కలల కన్నారు. అయితే ఇక్కడ ఉన్న

**నీ విలువ దిగజారకుండా చూచుకో. ప్రగతి పొందు.**

పెక్కు ఆచార వ్యవహారాలను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. భారతీయ మనీషులలో కొందరు ఈ వైఖరి అవలంబించారు. రామ్‌ధారీ సింగ్ దినకర్ ఆ పరిస్థితిని విశ్లేషిస్తూ ఇలా వ్రాశారు - "వీరు సంస్కరించబడిన హిందూత్వాన్ని సమర్థిస్తున్నారు. అయితే సమగ్ర హిందూత్వంలో ఉన్న బలం సంస్కరించబడిన హిందూత్వంలో లేదు. ఈ సంస్కర్తల, ప్రగతిశీల భావాల ప్రాచుర్యం ఉన్నప్పటికీ, ప్రజలంతా రాళ్లను పూజిస్తూవచ్చారు. రాముణ్ణీ, కృష్ణుణ్ణీ అవతారాలుగా పరిగణిస్తూవచ్చారు. పురాణాలనూ, పురోహితులనూ వదులుకోవడానికి సిద్ధంగా లేరు. ఇందుకు సమాధానం ఏమిటి? ఆ సమయంలో హిందూత్వం క్రైస్తవానికి భారతీయ రూపంగా తయారయింది."

సంస్కరించబడిన లేదా ప్రగతిశీలంగా చెప్పబడిన హిందూత్వం అసంపూర్ణమైనదనీ, ఖండితమైనదనీ ఏనీ బీసెంట్ ప్రకటించారు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతల తత్వాన్ని వివేచన చేసి ఊరుకోలేదు ఆమె. ఎక్కడ ఏ సందర్భం వచ్చినా, స్మృతులు, పురాణాలు, ధర్మ శాస్త్రాలు, మహా కావ్యాలను ఉదహరిస్తూ సనాతన ధర్మ సమగ్ర స్వరూపాన్ని అభివర్ణిస్తూ వచ్చారు. ఇంగ్లండులో జన్మించి, అక్కడే విద్యాభ్యాసం చేసి, పెరిగి పెద్దదైన ఏనీ బీసెంట్ నోటినుండి పునర్జన్మ, అవతారాలు, దేవతలు, యోగం, జపం, తపం, అనుష్ఠానం, సిద్ధులు, 84 లక్షల జీవరాశుల ప్రస్తావన విని - ఆధునిక సంస్కరణవాదుల ప్రచారంవల్ల అనుమానంలో పడిన ప్రజలుసైతం కళ్లు తెరచి నిలచారు. ఆ ప్రచారంవల్ల ప్రభావితులైనందుకు సిగ్గుపడ్డారు. 1914లో చేసిన ప్రసంగంలో ఏనీ బీసెంట్ ఇలా అన్నారు - "సనాతన ధర్మాన్ని భారతదేశమే, ఇక్కడి ప్రజలే రక్షించగలుగుతారు. సనాతన ధర్మం ప్రపంచంలోని అన్ని మతాలకన్న వైజ్ఞానికమూ, గహనమూ, ఆధ్యాత్మికతా పరిపూర్ణమూ అయినదని 40 సంవత్సరాల తీవ్ర చింతన తర్వాత నేను నిర్ణయానికి వచ్చాను. ఇక్కడి ప్రజలే దీనిని రక్షించగలుగుతారు. బయటి వ్యక్తులము మేము మిమ్మల్ని ఎంతగా ప్రశంసించినప్పటికీ, మీ ఉద్ధరణ మీ చేతుల్లోనే ఉంది. మీరు ఎలాంటి భ్రమలోనూ పడకండి. సనాతన ధర్మం వినా భారత్‌కు భవిష్యత్తు లేదు."

ఏనీ బీసెంట్ సనాతన ధర్మ స్వరూపాన్ని పాశ్చాత్య విద్వాంసులకూ, వారి భారతీయ అనుచరులకూ బోధపరచారు. ఆ స్వరూపానికి మూలాలు వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, స్మృతి శాస్త్రాలు, రామాయణం, మహాభారతం, పురాణాలు మున్నగు గ్రంథాలు. ఆ స్వరూపంలో దేవీ దేవతలు, సిద్ధ ఆత్మలు, అవతారాలు, దైవీ శక్తులు, పరమేశ్వరుని సగుణ నిర్గుణ రూపాలు చేరి ఉన్నాయి. తీర్థాలు, ఆశ్రమాలు, దేవాలయాలు, మందిరాలు మున్నగు పవిత్ర స్థలాలలో ఆ సనాతన ధర్మ స్వరూప తరంగాలు ప్రత్యేకంగా అనుభవం అవుతాయి. ఆ నిగూఢ తత్వాలు చింతనలో, సహజమైన ప్రజా విశ్వాసాలలో వివిధ రూపాలలో వ్యక్తం అవుతాయి. బ్రిటన్ నుండి వచ్చిన భారత భక్తురాలు, విదుషీమణి అయిన ఏనీ బీసెంట్ 1920 తర్వాత స్వరాజ్య ఉద్యమానికికూడ ప్రేరణ ఇచ్చారు. అయితే ఆమె మౌలిక కృషి సాంస్కృతిక రంగంలోనే జరిగింది.

బెనారస్‌లోని సెంట్రల్ హిందూ కాలేజిలో భారతీయ తత్వజ్ఞానాన్ని వివేచన చేస్తూ ఆమె ప్రసంగించారు. సనాతన ధర్మ పునరుజ్జీవనం, దాని ఉద్ధరణ, దానిని సుదృఢం చేయడం - ఇది భారతీయులు చేయవలసిన మొదటి అనుష్ఠానమని ఆమె అన్నారు. ఆత్మగౌరవం, గతం పట్ల గౌరవం, భవిష్యత్తులో విశ్వాసం, భారత్‌తో పాటు విశ్వాన్ని నవనిర్మాణం చేసే బాధ్యత దీనితో ముడిపడి ఉన్నాయని ఆమె వివరించారు. 1911లో ఆమె ఈ ప్రసంగం చేశారు. ఈ కాలేజీని ఏనీ బీసెంట్ స్వయంగా స్థాపించారు. దాని స్థాపనకూ, వికాసానికీ ఆమె తాను కూడబెట్టిన సంపదనంతా వెచ్చించారు. ఈ కాలేజి అనంతర కాలంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా పరిణతి చెందింది. ఈ జీవిత చరిత్రకు నాయకుని దీక్షా గురువు అయిన పండిత మదన మోహన మాలవ్యా ఆ విశ్వవిద్యాలయ స్థాపన తర్వాత దాని వికాసానికీ, వైభవానికీ కృషిచేశారు. ఆ కృషి వెనుక భారతీయ ఆత్మ ఏనీ బీసెంట్ పరిశ్రమ ఉన్నది.

## సూక్ష్మ జగత్తులో ఆహ్వానం

బనారస్ పండితులు 'సర్వశుక్ల సరస్వతి'గా సంబోధించిన ఏనీ బీసెంట్ వెల్లడించిన ఒక రహస్యాన్ని ఇక్కడ ప్రస్తావించడం అవసరం. మౌలికంగా ఈ ప్రకటన దివ్యజ్ఞాన సమాజం సంస్థాపకురాలు మేడమ్ బ్లావెట్స్కీ చేసినట్టిది. మేడమ్ బ్లావెట్స్కీకి హిమాలయాలలోని శరీరధారులూ, అశరీరులూ అయిన సిద్ధ సంత్‌లతో సంపర్కం ఉన్నదని దివ్యజ్ఞాన సమాజం సభ్యులు విశ్వసిస్తారు. ఆ సిద్ధ సంత్‌ల ప్రేరణతో ఆ విదుషీమణి ఎన్నో రహస్యాలను వెల్లడించారు. భారత్‌కు తన నియతిని సాక్షాత్కరింపజేయాలని హిమాలయాలలోని సిద్ధ ఆత్మలు దృఢంగా సంకల్పించుకున్నారన్నది ఆ రహస్యాలలో ఒకటి. వారి యోజన ప్రకారం సమర్థములైన దివ్య ఆత్మలు అనేకం శరీరాన్ని ధరిస్తాయి. చిన్న స్థాయిలో పని ప్రారంభించి నిరంతరం క్రియాశీలంగా ఉంటాయి. తగు సమయంలో పూర్తి వైభవంతో

**అసత్యం నుండి సత్యానికీ, చీకటి నుండి వెలుగుకూ, వినాశనం నుండి వికాసానికీ పురోగమించడమే అధ్యాత్మ.**

తమను తాము ప్రకటించుకుంటాయి. బోధిసత్త్వుడు (బుద్ధ భగవానుని అవతారం) ఈ రోజులలోనే అవతరిస్తాడనీ, తగు సమయంలో ఆయన వ్యక్తం అవుతాడనీ మేడమ్ బ్లావెట్స్కీ సహచరుడు కర్నల్ ఆల్కాట్ ప్రకటించారు. ఆయన జన్మ ఎత్తే పరిస్థితులు ఏర్పడని పక్షంలో, ఆయన ఏదో ఒక శరీరాన్ని ఎంపిక చేయవచ్చుననీ, ఆ శరీరంద్వారా తన పని చేస్తాడనీ ఆయన వివరించారు. ఏనీ బీసెంట్ అనుభూతి మరోవిధంగా ఉంది. ప్రజాహిత రంగంలో, ముఖ్యంగా రాజకీయ రంగంలో పని చేసే వ్యక్తులు తమ రహస్య అనుభవాలను అందరిముందూ వ్యక్తం చేయరు. అలా వ్యక్తం చేయడంవల్ల ప్రముఖ రాజనీతివేత్తల ప్రభావం సైతం తగ్గుతుంది. ఏనీ బీసెంట్ మౌలికంగా ఆధ్యాత్మిక మహిళ. ఆమె తన అనుభవాన్ని ఉన్నది ఉన్నట్లు వెల్లడించారు.

ఆస్ట్రేలియాలో కొందరు సాధకులకు ఒక ధ్యాన ప్రక్రియను వివరిస్తూ ఆమె ఇలా అన్నారు - 'ఈ ప్రక్రియ సూక్ష్మ జగత్తుతో సంపర్కం కల్పిస్తుంది. దీనివల్ల దివ్య, సిద్ధ ఆత్మల సాన్నిధ్యం లభిస్తుంది. సాధన తీవ్రతరం అయినప్పుడు సాధకునికి తనను గురించే కాక, సమాజం గురించీ విశ్వంగురించీ కొన్ని వాస్తవాలు తెలుస్తాయి.' ఇలాంటి ధ్యాన ప్రక్రియలో ఆమెకు ఒక అనుభూతి కలిగింది. "సూక్ష్మ జగత్తులో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక సంఘటన 1911లో జరుగుతుంది. ఒక శిశువు జన్మిస్తాడు. ఆ శిశువు మామూలు శిశువులవలె పెరిగి పెద్దవాడు అవుతాడు. క్రమక్రమంగా క్రియాశీలుడు అవుతాడు. ఆయన క్రియాశీలుడు అయ్యేకొలదీ సనాతన ధర్మంపై ముసురుకున్న మబ్బులు విడిపోతాయి. సనాతన ధర్మం మహోజ్వలంగా, మహాతీక్షణంగా వెలుగొందుతుంది." - ఇదీ ఆ అనుభూతి.

ఆ శిబిరంలో కర్నల్ ఆల్కాట్ విద్యార్థులూ, దివ్యజ్ఞానపు తొలి సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూన్న సాధకులూ కూడా ఉన్నారు. వారిలో ఒకరు ఇలా ప్రశ్నించారు - 'బోధిసత్త్వుడు తన లక్షణాలతో అవతరిస్తాడని మహాత్ములు చెప్పారు కదా. ఆ లక్షణాలు మొదటనే నిర్ణయం అయినాయి. ఆ లక్షణాలు ఆధారంగానే తథాగతుని నూతన అవతారం గుర్తించబడుతుంది. మీరు చెప్పింది అందుకు భిన్నంగా ఉంది. ఎందువల్ల?, ఈ ప్రశ్నకు సమాధానంగా ఏనీ బీసెంట్ ఇలా అన్నారు - 'ధ్యాన స్థితిలో నాకు కలిగిన అనుభవాన్ని నేను వివరిస్తున్నాను. ఇతర మహానుభావుల మాటలను ఖండించే ఉద్దేశ్యం నాకు లేదు. ఎక్కడైనా ఏదైనా భిన్నత కనిపిస్తే దాని అర్థం సత్యం వేరువేరుగా ఉన్నదని కాదు. ఒకే సత్యం మన స్థితి కారణంగా, మన దృష్టి కారణంగా వివిధ కోణాలలో కానవస్తుంది.'

ఏనీ బీసెంట్ తన ఈ అనుభవాన్ని ఆతర్వాత పలు సందర్భాలలో వర్ణించారు. ఈ చర్చ సాధకులమధ్య జరిగింది. బోధిసత్త్వుడు మానవ శరీరంలో దిగిరావడం, కొత్త అవతారం కోసం ఎదురు చూడడం, పలువురు తాము భగవానులమని ప్రకటించుకోవడం, కొన్ని ఇతర కారణాలవల్ల అనేక ప్రత్యేకతలు కానవచ్చిన తర్వాత వారిని సాక్షాత్తు పరమేశ్వరులుగా ప్రకటించడం- ఈ సంఘటనలుకూడ ఆ చర్చలో వచ్చాయి. ఏనీ బీసెంట్ ప్రకటన వీటన్నటికీ భిన్నంగా ఉంది. ఏదో అద్భుతం జరుగుతుందని ఆమె ప్రకటించలేదు. శ్రీరాముని, శ్రీకృష్ణుని లీలలు కావ్యాలలో వర్ణించిన విధంగా తిరిగి జరుగుతాయనీ ఆమె చెప్పలేదు. తాను పేర్కొన్న సంవత్సరంలో జన్మించే శిశువు వ్యక్తిత్వం అత్యంత తీక్షణంగా, తేజోవంతంగా ఉంటుందనీ, ఆ వ్యక్తిత్వం కారణంగా లక్షల కోట్ల ప్రజల ఆధ్యాత్మిక జీవితాలలో కొత్త మలుపు వస్తుందనీ ఆమె చెప్పారు.

ఆ శిశువు ఎక్కడ జన్మిస్తాడు? అతడి కుటుంబ నేపథ్యం ఎటువంటిది? అతడు ఏ తిథిలో, ఏ నక్షత్రంలో జన్మిస్తాడు? ఈ విషయాలను ఆమె పేర్కొనలేదు. ఏనీ బీసెంట్ ఇచ్చిన సంకేతం అప్పటికప్పుడు, ఎదటివారికి ఆ ధ్యాన ప్రక్రియలో నమ్మకం కలిగించడానికి మాత్రమే ఇచ్చినది. సమీప భవిష్యత్తులో ఏదో మహాద్భుతం జరుగుతుందని జోస్యం చెప్పి, నిశ్చింతగా ఉండవలసిందిగా ప్రజలకు సందేశం ఇవ్వడం ఆమె ఉద్దేశ్యం కానే కాదు.

ఏనీ బీసెంట్ 1911లో వారణాసిలోనే ఒక పాఠం చెపుతూ మరో విషయం స్పష్టం చేశారు. బహుశా అది వసంత పంచమి రోజే అయిఉంటుంది. సాధకుల బృందానికి ఆమె ఇలా చెప్పారు - 'సనాతన ధర్మంలో ఇమిడి ఉన్న శక్తి ఏవో గ్రహ నక్షత్రాలవల్ల వచ్చినది కాదు. దాని స్వభావంలో ఉన్నది. పొగ దట్టంగా క్రమ్మినప్పుడు, తన స్వరూపం మసకబారినప్పుడు, బాహ్య కారణాలు తనను ఆవరించినప్పుడు - ఇదంతా ఒక హద్దు దాటిన ప్రతిసారీ సనాతన ధర్మం పూర్తి వేగంతో తనను తాను వ్యక్తపరచుకుంటుంది. సనాతన ధర్మం భారతదేశానికే కాక సమస్త విశ్వానికీ భవిష్యత్తు. దానిని కప్పిఉన్న మాలిన్యాన్ని తొలగించడానికి మామూలు ఆత్మలు సరిపోవు, సమర్థములు కావు. సనాతన ధర్మం నుండి శక్తినీ, పోషణనూ అందుకునే సిద్ధ పురుషుల సహకారం పొందిన విశిష్ట ఆత్మలు మాత్రమే ఆ కార్యాన్ని నిర్వహించగలుగుతాయి. ఆ తరుణం ఇప్పుడు వచ్చింది."

K K K

**ఆదర్శం కోసం నవ్వుతూ నవ్వుతూ బలి కావడమే సాహసం.**

## మాతాజీ దివ్య జీవనం - 5

# అందరికీ మాతాజీ

అఖండ జ్యోతి సంస్థాన్ ప్రాంగణంలో మాతా భగవతి అందరికీ "మాతాజీ" అయింది. చుట్టుప్రక్కల ఉన్న పిల్లలేకాక, అఖండ జ్యోతి కార్యాలయానికి వచ్చి వెళ్ళే వారందరూ ఆమెను మాతాజీ అనటం మొదలుపెట్టారు. ఇక్కడికి రాగానే ఆమె అనేక బాధ్యతలను ఒకేసారి తీసుకుంది. ప్రేమ, సదాశయములు, సహిష్ణుత, శ్రమశీలత అనే ప్రకాశ కిరణముల పుంజము ఆమె వ్యక్తిత్వమును ఇంకా ఎక్కువగా కాంతివంతం చేయసాగింది. ఆమె అందరికంటే చివర పడుకుని అందరికంటే ముందు లేచేది. ఆమె నిద్రలేచే సమయం నిశ్చితంగా ఉన్నప్పటికి నిద్రకు ఉపక్రమించే కాలం స్థిరంగా ఉండేది కాదు. ఎందువల్లనంటే ప్రతిరోజూ క్రొత్త క్రొత్త పనులు వచ్చి కాలాతీతమయ్యేది. ఏ పనీ లేకపోయినా సమయా సమయాలు చూడకుండా వచ్చే ఆగంతకులకు భోజన వసతి ఏర్పాటు చేయటంలో సమయం సరిపోయేది. రాత్రి పడుకోవటానికి ఆలస్యం అగుటకు కారణం ఏమి అయినా ఆమె ఖచ్చితంగా మూడు గంటలకు నియమపూర్వకంగా మేలుకొనేది.

నిద్రలేచాక నిత్యకర్మలు పూర్తిచేసుకుని ఆమె యోగసాధనకు కూర్చునేది. ఆమె పూజావేదిక మీద ఎల్లప్పుడూ పరమపూజ్య గురుదేవులు, గాయత్రీమాత చిత్రములు ప్రతిష్ఠితమై ఉండేవి. వారే ఆమె జీవిత సర్వస్వం, ఆమె ఆరాధ్యదైవాలు. తన ఆరాధ్యదైవమైన భర్తలోనే ఆమె జగన్మాత గాయత్రి అనుభూతి పొందేది. ఈ పటమునకు పంచోపచార పూజ చేశాక ఆమె కొన్ని విశిష్ట ప్రాణాయామ ప్రక్రియలు చేసేది. అవి పూర్తయిపోగానే గాయత్రీ మంత్ర జపం ఆమె అంతశ్చేతనలో జరగటం మొదలుపెట్టేది. ఆమె కఠిన సాధనలతో జాగృతమూ, చైతన్యమూ అయిన గాయత్రీ మహామంత్రంలోని ప్రతి బీజాక్షర స్ఫోటన ఆమె అస్తిత్వం గుహ్య కేంద్రములలో జరుగుతూ ఉండేది. ఆమె చేసే గాయత్రీ జపము ఈ అద్భుత ప్రణాళికలో జరిగేది. అనంతరం ఆమె ధ్యానస్థమయ్యేది. ధ్యాన భావదశలో తన మహాశక్తి స్వరూప పరిపూర్ణతలో నిమగ్నమై ఉండేది. ఈ సాధనా క్రమం సాధారణంగా సూర్యోదయం వరకు జరిగేది.

ఆ తరువాత ఇంటి పనులు, కార్యాలయ బాధ్యతలూ మొదలయ్యేవి. ఈ పనులను ఆమె యోగ సాధనలకంటే తక్కువగా తీసుకునేది కాదు. ఏ పని అయినా, అది చిన్నది అయినా పెద్దది అయినా, నిజమైన భక్తి భావంతో భగవానునికి అర్పణచేసి చేస్తే అది నిజమైన యోగ సాధనగా మారుతుంది అని, తద్వారా ధ్యాన సమాధిలో జరిగేటట్టే యోగ విభూతులు ప్రకటితమవుతాయి అని ఆమె చెపుతూ ఉండేది. ఈ మాటలు శబ్దములు మాత్రమే కావు. ఆమె అనుభూతుల సత్యదర్శనం. తను చేసే ప్రతి పని ద్వారా ఆమె నిరంతరం సాధన చేస్తూ ఉండేది. స్వార్థము, అహంకారముల విషాక్తత వల్ల సాధారణంగా మనం చేసే ప్రతి పనీ కలుషితమవుతుందని ఆమె అంటూ ఉండేది. ఈ రెండూ ఉన్నంత వరకు ఏ పనీ యోగముగా మారదు. వీటి బదులు తమ ఆరాధ్యుని పట్ల నిష్ఠ, సమర్పణా భావనలు పనిలో చోటు చేసుకుంటే అంతా మారుతుంది. అటువంటి స్థితిలో అంట్లు తోమటం, చీపురు పట్టి ఊడవటం, కడగటంలాంటి తుచ్ఛం అనుకునే పనులు కూడా ధ్యాన సాధనగా మారతాయి.

ఈ అనుభవ సత్యం ఆమె జీవితంలో రోజూ ప్రకటితమయ్యేది. అంట్లు తోమటం, ఇల్లు ఊడ్చటంతో పనులు మొదలుపెట్టి వండటం, అందరికీ వడ్డించటం కూడా తానే స్వయంగా చేసేవారు. ఇంట్లో కుటుంబ సభ్యులే కాక వచ్చిపోయే వారి సంఖ్య ఎప్పుడూ ఉండేది. వచ్చేవారి సంఖ్య ఖచ్చితంగా తెలిసేది కాదు. ఒకసారి 5,10 మంది అయితే ఒక్కొక్కసారి 30,40 మంది వరకు అయ్యేవారు. ఎలాంటి పరిస్థితి అయినా వీరందరికీ భోజన వ్యవస్థ అన్నపూర్ణ వలె మాతాజీయే చేయవలసి వచ్చేది. తన ఈ బాధ్యతలను ఆమె చాలా ఉత్సాహంగా నిర్వర్తించేది. భోజనం చేసే వారికి వండిన భోజ్య పదార్థాలతో పాటు తల్లి ప్రేమ అనే అలౌకిక ప్రేమ కూడా లభించేది. నిరంతరం శ్రమపడాల్సివచ్చే ఇంటి పనులలో ఎప్పుడూ ఆమె విసుక్కోవటం కానీ కోపగించుకోవటం కానీ ఎవరూ చూడలేదు. స్నేహమయమైన చిరునవ్వుతో ఆమె నిరంతరం పనులలో నిమగ్నమై ఉండేవారు.

ఇంటి పనులు అధికమవటం వలన పరమ పూజ్య గురుదేవులు మాతాజీకి సహకరించటానికి ఒక మహిళను ఏర్పరచారు. మధురలోని బైరాగ్‌పురా పేటలో నివసించే ఒక

**సద్భావనలూ, సత్ప్రవృత్తులూ సర్వేశ్వరుని సాన్నిధ్యాన్ని సాధిస్తాయి.**

భర్త్య విహీనురాలు ఈమె. ఒక ఇరుకు గదిలో తన చిన్నపిల్లవాడితో ఏ విధమైన ఆధారం లేక ఆర్థిక సహాయం లేకుండా ఉన్న ఒక మహిళ. ఆమెను పనులకు నియోగించుకున్నారు. అప్పుడామె వయస్సు 20,22 సంవత్సరాలు ఉండి ఉండవచ్చు. కానీ పేదరికం వల్ల ఆ చిన్న వయస్సులోనే ఆమె వృద్ధురాలుగా కనిపించేది. పొడుగైన చామనచాయ గల ఈ మహిళ కాలిన కర్ర వలె కనిపించేది. బలహీనత వల్ల ఆమె కళ్ళు, బుగ్గలు లోతుకు పోయాయి. ఆమె పేరు గులాబీ. కానీ అఖండజ్యోతి సంస్థానంలో ప్రతిమాటకీ ఆమె 'ఏజా' అనే అలవాటు వల్ల ఆమె పేరు 'ఏజా' అని పెట్టేశారు. అందరూ ఆమెను ఆ పేరుతోనే పిలిచేవారు.

'ఏజా' కొన్ని రోజులలోనే మాతాజీకి అత్యంత ప్రియ సహాయకురాలుగా మారింది. ఆమె ఆరోగ్యం పట్ల, ఆహారం పట్ల మాతాజీ శ్రద్ధ వహించటం వలన దీనంగా, బలహీనంగా ఉండే ఆమె కొలది రోజులలోనే ఆరోగ్యంగా, పుష్టిగా, అందంగా కనిపించటం మొదలిడింది. వీధిలో ఇష్టం వచ్చినట్లు తిరిగే ఆమె కొడుకును మాతాజీ బడిలో చేర్పించారు. ఆమె, ఆమె కొడుకు ఇద్దరూ ధన్యులయ్యారు. 'ఏజా' సహకారం వల్ల పని వేగం పెరిగిందే కాని మాతాజీ పడే శ్రమలో ఏమీ తగ్గుదల రాలేదు. ఆమె ఇంటి పనులలోనే కాక అఖండజ్యోతి కార్యాలయంలోని పనులలో కూడా సహకరించేది. పరిజనులకు పంపే అఖండజ్యోతి పత్రిక రేపర్‌ల మీద స్టాంపులు అంటించటం, పంపించటం బాధ్యత తనే స్వీకరించారు.

పత్రిక చదివే వారి, పరిజనుల ఉత్తరాలు కార్యాలయానికి వస్తూ ఉండేవి. వాటికి జవాబు ఇవ్వటానికి గురుదేవులకు సహాయం చేయుట మాతాజీకి అత్యంత ప్రియమైన పని. గురుదేవుల ముందు కూర్చుని తన ముందు ఉత్తరాల రాశి పెట్టుకునేది. ఒక్కొక్క ఉత్తరం గురుదేవులకు చదివి వినిపించేది. ఆయన జవాబిచ్చేవారు. ఈ పని చాలా తీవ్ర గతిలో జరిగేది. మాతాజీ ఉత్తరం చదువుతున్నపుడే గురుదేవులు దానికి జవాబిచ్చేవారు. ఒక్క సిట్టింగ్‌లో సుమారు నూరు ఉత్తరాలకు జవాబివ్వటం అయిపోయేది. ఆ రోజులు గుర్తు చేసుకుంటూ మాతాజీ ఇలా అనేది - "గురుదేవులు రోజల్లా తీరిక లేకుండా పనిచేసేవారు. ఆయన రాత్రంతా సాధనా, సమాధిలో గడిపేవారు. ఈ ఉత్తరములు రాసే సమయంలోనే నేను, ఆయనా కలుసుకునే వారము. ఆ క్షణాలలో అప్పుడప్పుడూ ఇంటి విషయాలు మాట్లాడుకోవడానికి వీలుండేది. "

ఇంటి విషయాలు, కుటుంబ విషయాల నుండి గురుదేవులు నిశ్చింతగా ఉండేలా మాతాజీయే పూర్తి బాధ్యత వహించారు. వచ్చే బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మొదలగు వారి మంచి చెడ్డలే కాక తగిన మర్యాదలు, ఆహారం గురించి కూడా పూర్తి బాధ్యత ఆమె ఒంటరిగా నిభాయించేది. ఆమె ప్రేమపూర్ణ వ్యవహారం కుటుంబ సభ్యులను, బంధువులను సంతృప్తి పరచేది. అఖండ జ్యోతి సంస్థానంలో నివాసమున్న ఈ మొదటి సంవత్సరాలలోనే ఆమె ఇద్దరు బిడ్డలకు జన్మ నిచ్చింది. ఆమె పవిత్ర గర్భం నుండి ముందు మృత్యుంజయ శర్మ ఆతరువాత శైలబాల జన్మించారు. విశ్వజనని తన గర్భంలో పెంచిన ఈ విశిష్ట ఆత్మలు నిజంగా ధన్యులే. ఇంటిలో ఈ పిల్లలను ఆమె సతీష్, శైలో అని పిలిచేవారు. కుటుంబ సభ్యులు వారిని ఈ పేర్లతోనే పిలిచేవారు. పిల్లల భావ వికాస శిక్షణతో పాటు ఆమె దైనందిన క్రియాకలాపాలు యధావిధిగా కొనసాగాయి.

ఆ రోజులలో ఆమె పని చేసే వేగం, పరిమాణం చూసి బంధువులు, కుటుంబ సభ్యులు ఆశ్చర్యచకితులయ్యేవారు. వారికి ఆశ్చర్యమేమంటే - మాతాజీ ఇంత పని చేస్తున్నా ఎందుకు అలసిపోరు? ఒక్కొక్కసారి ఆమె చేసే పని అనేక వ్యక్తులు సామూహికంగా శ్రమపడి చేస్తేకానీ అయ్యేది కాదు.

ఏజా ఒక్కొక్కసారి ఆమె రాత్రి, పగలు ఇలా పనిలో నిమగ్నమై ఉండే రహస్యాన్ని అడిగేది. ఈ ప్రశ్నకు జవాబుగా మాతాజీ నవ్వేసేది. ఒక్కోసారి గంభీరురాలై ఇలా చెప్పేవారు - **"మనసులో సమర్పణ తీవ్రంగా ఉంటే వజ్రం కూడా పువ్వు వలె మారుతుంది.** నేను చేసే ఏ పని అయినా - అది అంట్లు తోమటం కాని, ఊడవటం కాని లేక ఆచార్యజీ దగ్గర కూర్చుని ఉత్తరాలు వ్రాయటానికి సహాయపడటం కాని - నన్ను నేను ఆయన చరణాలకు అర్పించుకునే విధానం మాత్రమే. నేను ఎంత ఎక్కువ పని చేస్తే నన్ను నేను ఆయనకు అంత ఎక్కువగా సమర్పించుకుంటున్నాను అని అనిపిస్తుంది." ఇలా అనేక పనుల మధ్య ఆమె మాతృత్వం తీవ్రగతిలో విస్తరణ పొందుచున్నది. ఆమె వాత్సల్య సంవేదన నిరంతరం వికసించుచున్నది.

## విస్తరించిన మాతృత్వం

మాతృత్వ విస్తార సజల సంవేదనా స్పర్శతో వచ్చి వెళ్లేవారు అప్రయత్నంగానే తన్మయులయ్యేవారు. అఖండజ్యోతి

**మనిషిని సన్మార్గానికి తేవడం అన్నిటినీ మించిన ఉపకారం.**

సంస్థానమునకు వచ్చినవారు తమ సొంత తల్లి వద్దకు వచ్చిన అనుభూతికి లోనయ్యేవారు. వీరిలో ఎంతో మందికి మాతాజీ తమ అమ్మ కంటే ఎక్కువ ప్రేమ మూర్తి ! అనిపించేది. సొంత తల్లయినా అప్పుడప్పుడు అలసట వలన, విసుగు వలన, పనిలో వ్యస్తత వలన తన పిల్లలను పట్టించుకోకపోవచ్చు. కాని మాతాజీ ప్రేమలో ఎప్పుడూ తగ్గుదల రాలేదు. సొంత తల్లే పిల్లలను పెద్దయ్యేక అంతగా పట్టించుకోదు. కానీ మాతాజీకి పిల్లలు పిల్లలే. వారు పెద్దవారు కావచ్చు, చిన్నవారు కావచ్చు. అసలామె తన పిల్లలను చూసుకొనుటకే అవతరించిందా అనిపించేది.

ఇల్లు, కుటుంబ బాధ్యత కానీ, కార్యాలయంలో ఉన్న పని ఒత్తిడి కానీ ఎంత ఉన్నా మాతాజీ మాతృత్వపు పైటచెరగు ఎన్నటికీ చిన్నదయ్యేది కాదు. రోజురోజుకు అది విస్తరించుచూ వ్యాపించుచున్నది. ఈ రోజులలోనే ఆమె ఓంప్రకాశ్, దయల జీవితాలను సవరించింది. సతీష్ (మృత్యుంజయ శర్మ), శైలో (శైలబాల) కూడా పెద్దవారవుతున్నారు. వారి చదువు సంధ్యల గురించి కూడా ఆమె చూసుకోవాల్సి వచ్చేది. సాధారణంగా పిల్లలు అల్లరి చేస్తారు, విసిగిస్తారు. ఈ పిల్లలూ అలాంటివారే. కాని మాతాజీకి కొట్టడం, తిట్టడం మీద నమ్మకం లేదు. అలసట లేకుండా ప్రేమతో పిల్లలకు నచ్చచెప్పటమే ఆమె విధానం. ఏరోజు వారికి విషయం పూర్తిగా అర్థం అవుతుందో ఆరోజే వారు అల్లరి చేయటం మానేస్తారు - అనేది ఆమె.

దీనిని ఆచరించటం చెప్పినంత సులభం కాదు. ఇది చాలా కష్టసాధ్యం. విసుగుతో కూడినది. దీని కొరకు చాలా సహనం, ధైర్యం, ప్రేమ అవసరం. అప్పుడప్పుడూ చాలా కఠినమైన పరిస్థితులు ఏర్పడతాయి. మాతాజీ మాతృత్వం కూడా కొన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చింది. అది 1951వ సంవత్సరం. మార్చినెల. ఓంప్రకాశ్ ఇంటర్ పరీక్షలు వ్రాస్తున్నాడు. ఇంగ్లీష్ రెండవ పేపర్ వ్రాయాలి. తన గదిలో కూర్చుని చదువుకుంటున్నాడు. పొద్దున సుమారు 7.30 అయ్యుంటుంది. అబ్దుల్ లతీఫ్ ట్రెడిల్ మిషను నడుపుతున్నాడు. మాతాజీ బంధువులలో ఒకరైన 'చందా' కంపోజ్ చేస్తున్నారు. ఇంతలో సతీష్ పైనుండి వచ్చాడు. అతని చెయ్యి ప్రమాదవశాత్తు మిషన్‌లో పడింది.

భయ్యా!!! చందా గట్టిగా అరిచారు. ఓంప్రకాష్ పరిగెట్టుకుంటూ వచ్చాడు. సతీష్ మౌనంగా ఉండటం చూశారు. అతనిని ఒళ్ళోకి తీసుకుని శిరస్సును చేతితో నిమిరారు. అతని తలకి దెబ్బ తగిలిందేమో అనిపించింది. అప్పుడు చందా అన్నాడు, ఏడుస్తూ భయ్యా!! చెయ్యి!! అరచేయి సగం తెగిపోయి వేళ్ళు వేలాడుతున్నవని గమనించారు. ఈ హృదయ విదారక దృశ్యం చూసి ఆయన తాయిజీని, మాతాజీని పిలిచారు. ఇరువురూ పరుగుపరుగున వచ్చిరి. ఓంప్రకాష్ నిక్కరూ, బనియనూ రెండూ నెత్తురుతో తడిసిపోయి ఉన్నవి. మథురలో సివిల్ సర్జన్ ఎస్.కె. ముఖర్జీకి చూపించారు. ఆయన ఆగ్రాకి తీసికువెళ్ళమని సలహా ఇచ్చారు. అంతేకాక చెయ్యి తీసివేయవలసి వస్తుందని అనుమానంగా చెప్పారు.

ఈలోపుగా పరమపూజ్య గురుదేవులుకూడా వచ్చేశారు. ఆయనతోపాటు రఘునాథ్ అగర్వాల్, శ్యామలాల్ కాంపౌండర్, జగదీష్ తమ్ముడు లక్ష్మణ్‌కూడా ఉన్నారు. మందువేసి కట్టుకట్టి ఇంజక్షన్ ఇచ్చారు. సతీష్ స్పృహలో లేడు. ఎవరికీ ఏమి చెయ్యాలో పాలుపోవటం లేదు. అప్పుడు మాతాజీ డాక్టర్ ముఖర్జీతో ఇలా అనెను-"డాక్టరు గారూ మీరు భగవంతునిపై నమ్మకముంచి ఇక్కడే ఏమి చేయగలరో చేయండి." పూజ్య గురుదేవులు మాతాజీ మాటలను సమర్థించారు. శస్త్ర చికిత్స చేశారు. మాతాజీ చాలా ధైర్యంగా ఆపరేషన్ థియేటర్ బయట నిలచింది. కొద్దిసేపటిలో శస్త్ర చికిత్స పూర్తయింది. సతీష్‌ను వార్డులోకి తెచ్చారు. పరిస్థితులు చక్కబడుటకు చాలా రోజులు పట్టింది. ఈ సంఘటన మచ్చ ఈనాటికీ మృత్యుంజయ శర్మ చేతిమీద ఉన్నది. ఈ విధంగా మాతాజీ మమకారం పెరుగుతూ ఉన్నది. ఆమె చాలా ఓర్పుతో పిల్లల వ్యక్తిత్వ నిర్మాణం చేయుచున్నది.

మాతాజీ మమకారం ఆరోజులలో చాలా వైపులకి విస్తరించేది. ఆమెకు సతీష్, శైలో అంటే ఎంత ప్రేమ ఉండేదో అంతే ప్రేమ అబ్దుల్ లతీఫ్ మీద కూడా ఉండేది. ఈ ముస్లిమ్ యువకుడు అఖండ జ్యోతి సంస్థాన్‌లో మెషిన్ మెన్‌గా పని చేసేవాడు. పత్రిక అచ్చు అయ్యేటట్లు చూసేవాడు. తన కుటుంబ సభ్యులతో పాటు మాతాజీ అతనికి భోజన వ్యవస్థ చూసేది. నియమం ప్రకారం మధ్యమధ్యలో టీ, ఫలహారాలు పంపిస్తూ ఉండేది. ఆమె వ్యవహారం వచ్చే బంధువులకు నచ్చేది కాదు. కొందరు నిర్మొహమాటంగా ఇలా అనేవారు-"అబ్దుల్ లతీఫ్ భోజన వ్యవస్థ చేయటం తప్పు కాదు. కానీ కనీసం మీరతని పాత్రలు వేరుగా ఉంచాలి. మనం బ్రాహ్మణులం కదా! ఆచార వ్యవహారములు జాగ్రత్తగా పాటించాలి". బంధువుల ఈ మాటలకి ఆమె జవాబుగా "మడి, ఆచారం

**ధర్మాన్ని ఆచరించినపుడే దాని ప్రయోజనం అనుభవమవుతుంది.**

అనగా అంటరానితనం కాదు. మన ఆలోచనలు, పనులు దోషరహితంగా ఉండాలని అర్థం'' అని వివరించారు.

ఆమె ఈ మాటలు ఎవరికీ అర్థం అయ్యేవి కావు. ఆమె చాలా వివరించి చెప్పినప్పటికీ బంధువులిలా ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. తమ ఛాందసాన్ని ఆమె నెత్తిన రుద్దటానికి ప్రయత్నించేవారు. ఆమె వద్ద పని చేసే ఏిజా కూడా "మీరు ఎందుకు ఒప్పుకోరు? వారు నిజమే చెపుతున్నారు కదా! అతను మహమ్మదీయుడే కదా! అతని గిన్నెలు వేరుగా పెట్టటంలో తప్పేమిటి?'' అని అడిగేటట్లు చేసింది. ఈ మాటలు మాతాజీని బాధించాయి. ఆమె లేచి వెళ్ళి అబ్దుల్ లతీఫ్ తినేసి వదిలేసిన గిన్నెలు పెట్టిఉన్న గదిలోకి వెళ్ళింది. ఆ ఎంగిలి గిన్నెలు అంట్లుతోమే చోటుకి తీసుకువచ్చింది. ఏిజా ఇంకా ఏదైనా అర్థం చేసుకోవటానికి ముందే ఆమె ఇలా అన్నది - "ఇన్ని రోజులబట్టి నువ్వు నాదగ్గర ఉన్నావు. కానీ నీకు నేను ఏమీ అర్థంకాలేదు. నేను కేవలం తల్లిని. హిందువులకీ తల్లినే, మహ్మదీయులకీ తల్లినే. నాకు ఓంప్రకాష్, సతీష్ ఎంతో అబ్దుల్ లతీఫ్ అంతే.''

ఆమె మాటలు విన్న ఏిజా దిగ్భ్రాంతి చెందింది. కొంతసేపటి వరకు ఏమి చెప్పాలో తెలియలేదు. ఆమె జవాబిచ్చేలోపు మాతాజీ అబ్దుల్ లతీఫ్ ఎంగిలి గిన్నెలను తన చేతులతోనే కడిగివేసింది. ఏిజాకి ఆవిడ మానవమాత్రురాలుగా కనిపించలేదు. దేవత అనిపించింది. కొన్ని రోజుల తరువాత ఈ విషయం అబ్దుల్ లతీఫ్‌కి ఎలా తెలిసిందో తెలిసింది. అంతా విన్న అతని కన్నులలో కన్నీరు ఉబికింది. కన్నీరు నిండిన కళ్ళతో రెండు చేతులూ జోడించి మాతాజీకి నమస్కారం చేస్తూ ఇలా అనెను - "మీరు నిజంగా అమ్మే. మీస్థాయి దేవదూతలకంటే పెద్దది. మీరు ఫాతిమా బి కంటే పవిత్రురాలు.'' చేతులు జోడిస్తూ ఇలాంటి ఎన్నో మాటలు అతను భావవిహ్వలుడై అన్నాడు. ఆమె అక్కడినుండి వెళ్ళిపోయిన తరువాత ఆమె నుంచున్న స్థలం నుండి మట్టిని తీసుకుని శిరస్సున ధరించాడు. సాష్టాంగ ప్రణామం ఆచరించాడు.

కొన్ని విలక్షణ క్షణాలలో మాతృత్వపు ఈ అనంత విస్తార పరిచయం ఆమె స్వయంగాకూడా ఇచ్చేది. ఒకసారి ఒక ప్రఖర గాయత్రీ సాధకుడైన రామసంజీవ అఖండ జ్యోతి సంస్థానమునకు వచ్చెను. గత కొద్ది సంవత్సరములనుండి అనేక కఠోర నియమములు పాటిస్తూ ఆయన గాయత్రీ అనుష్ఠానం చేయుచుండెను. అఖండజ్యోతి సంస్థానమునకు వచ్చినప్పుడు మాతాజీ వడ్డించిన భోజనం తినే సౌభాగ్యం పొందెను. భోజనం చేస్తూ మాతాజీని చూస్తూ ఆయన ఏవో అనుభూతులకు లోనైరి. ఎందుకో హఠాత్తుగా ఆయన నోటినుండి "అమ్మా! నీవు ఎటువంటి అమ్మవు?'' అనే ప్రశ్న వెలువడింది. ఈ ప్రశ్నకు జవాబుగా మాతాజీ "నాయనా! తల్లి అలాగ ఇలాగ ఉండదు. అమ్మ అమ్మే.'' తరువాత మెల్లిగా ఇలా అంది - "నేను నిజంగానే అమ్మను నాయనా. గురుదేవుల పత్ని రూపంలో తల్లిని కాను. కేవలం సతీషు, శైలాల తల్లిని కాను. అందరి అమ్మనూ.'' ఈ మాటలు విన్న గాయత్రీ ప్రఖర సాధుకుడైన రామసంజీవకు ఈరోజు గాయత్రీ తత్త్వము, సత్యము సాక్షాత్కరించిందా అని అనిపించింది. గాయత్రీమాత తనముందే నిలబడి ఉన్నదని అనిపించింది. తరువాత ఆయన సక్రియ ప్రేరణతో గాయత్రీ తపోభూమి నిర్మించబడింది.

K K K

## సహకారంలో సార్థకత

పంచభూతాలు ఒక రమ్యమైన పర్వతం మీదికి చేరుకొని ఎవరి గొప్ప వారు చెప్పుకో నారంభించాయి. ప్రపంచం భారాన్నంతనీ తానే మోస్తున్నానని అందరి కడుపులు నింపుతున్నాని, తాను లేకపోతే జగత్తే లేదని అన్నది పృథ్వి. తాను లేకపోతే జీవులు, వృక్షాలు, వనస్పతులు ఒకటేమిటి సమస్త ప్రాణులు ఎండి, బీటలువారి హాహాకారాలు చేస్తాయని అన్నది జలం. తిండి, నీరు లేకపోయినా కొంతకాలం జీవించవచ్చు. కానీ గాలి లేకుండా క్షణం జీవింపజాలరు. నేను కంటికి కనిపించకపోతేనేమి? నేను లేకుండా ప్రాణులు క్షణం జీవింపజాలరు. ఊపిరి ఆడక చనిపోతారన్నది వాయువు. వేడి, వెలుగు లేకుంటే ఈ లోకంలో నిశ్శబ్దం, శీతలత్వం తప్ప ఏముంటుంది? బ్రతుకులు అంధకార బంధురమైపోతాయి అన్నది అగ్ని. నల్గురి మాటలు వింటూ ఉన్నదే గాని, ఆకాశం ఏమీ మాట్లాడక చివరకు "మిత్రులారా! మనం కలిసి ఉండటం వలననే ఈలోకం నడుస్తోంది. మనలో ఏ ఒక్కరు అలిగినా లోకం స్తంభించి పోతుంది. కాబట్టి గొప్పతనం మనలో ఏ ఒక్కరిదీ కాదు. కలసి ఉండటంలోనే, సహకారంతో పనిచేయటంలోనే మన గొప్పదనం నెలవైఉన్నది అని వాస్తవాన్ని తెలియజేసింది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మనసొక అద్దం. దేని నీడ పడితే దాని ప్రతిబింబం దానిలో కానవస్తుంది.**

శతసూత్ర కార్యక్రమం: 41-50

# సభ్య సమాజ నిర్మాణానికి సోపానాలు

సామాజిక వ్యవస్థ సక్రమంగా పని చేయాలంటే మనం మన వ్యక్తిగత జీవితాన్నీ, కుటుంబ జీవితాన్నీ ఆదర్శవంతంగా రూపుదిద్దుకోవాలి. అప్పుడు వాటి ప్రభావం సామాజిక వ్యవస్థమీద పడుతుంది. అలాగే సామాజిక వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దాలి. మంచి సంప్రదాయాలను పటిష్టం చేయాలి. దురాచారాలను నిర్మూలించాలి. తద్వారా సభ్య సమాజం నిర్మాణం అవుతుంది. ఇందుకోసం కొన్ని కార్యక్రమాలను దిగువ ఇస్తున్నాం.

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థ -** ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహించాలి. వ్యక్తి సంకుచిత పరిధిలో గిరిగీసుకుని కూర్చొనకూడదు. తన భార్యను, పిల్లలను మాత్రమే తనవాళ్ళుగా పరిగణించకూడదు. సోదరులు, తల్లి దండ్రులు, కుటుంబంలోని ఇతర బంధువులు - వీరందరి ప్రగతి కోసం, వికాసం కోసం ఆత్మీయతా భావంతో కృషి చేయాలి. అంతా కలసిమెలసి జీవించాలి. ఒకరి కొకరు సాయపడాలి. సహన గుణం, త్యాగం, ఔదార్యం వంటి సద్గుణాలను పెంపొందించాలి. ఆత్మవికాసానికి ఉత్తమ మార్గం ఇదే. స్వార్థాన్ని పరమార్థంగా పరిణతి పొందించే సంప్రదాయం ఉమ్మడి కుటుంబంలోనే రూపొందుతుంది. అశాంతినీ, మనస్తాపాలనూ సృష్టించే కారణాలను తొలగించాలి. అయితే మూలాధారాన్ని దెబ్బతీయకూడదు. సమాజవాదానికి ప్రాథమిక స్వరూపం ఉమ్మడి కుటుంబ సంప్రదాయమే. దానిని వికసింపజేయడం శ్రేయస్కరం.

**కుటుంబంలో సత్సంగం -** ప్రతి కుటుంబంలో ప్రతిరోజూ గోష్ఠి రూపంలో సత్సంగాన్ని నిర్వహించడం అవసరం. కథలు వినిపించాలి. పుస్తకాలు చదివి వినిపించాలి. రోజూ వచ్చే వార్తలపై చర్చ జరపాలి. తద్వారా జీవితంలోని వివిధ సమస్యలను పరిష్కరించడంలో శిక్షణ ఇవ్వాలి. పెద్దలకు పాదాలు తాకి ప్రణామం చేయడం, చిన్నవాళ్లను 'ఏరా' అని పిలవకుండా 'ఏమయ్యా' అని పిలువడం అనే శిష్టాచారాన్ని కుటుంబాలలో పాటించాలి. ప్రతి ఇంటిలో పూజ గది ఉండాలి. కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆ గదిలో కనీసం పది నిముషాలపాటు ఉపాసన జరపాలి. కుటుంబ గ్రంథాలయం లేని ఇల్లు ఉండకూడదు. ఎలా జీవించాలి, జీవితంలో ఎదురయ్యే చిక్కు సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అనే సంజీవని విద్యను అందించే సాహిత్యాన్ని చిన్నతనం నుండే చదివించాలి, వినిపించాలి. ఉపాసన, స్వాధ్యాయం, సత్సంగములు క్రమబద్ధంగా జరగాలి.

**సత్ ప్రవృత్తుల అభ్యాసం -** పరస్పర సహకారం, కష్టపడి పని చేయడం, చెడిపోయిన వస్తువులను మరమ్మతు చేయడం, ఇంటిలో మూల మూలనూ శుభ్రం చేయడం, బట్టలు ఉతుక్కోవడం, కుటుంబ సభ్యులంతా క్రమబద్ధంగా వ్యాయామం చేయడం, చిన్న చిన్న తగాదాల పరిష్కారానికి ఏర్పాటు, విద్యలో అందరికీ అభిరుచి, స్వావలంబనకూ బుద్ధి వికాసానికీ నిరంతర కృషి, మితవ్యయం, నిరాడంబరత్వం, బట్టలు కుట్టడంవంటి గృహ పరిశ్రమల ప్రారంభం, ప్రజా క్షేమం కోసం రోజూ దానం చేయడం వంటి అనేక కార్యక్రమాలకు ఇల్లు ప్రయోగశాల కావాలి. ఈ శిక్షణ భారీ యెత్తున జరిగితే, సమాజమంతా సభ్యమూ, సంస్కారవంతమూ అవుతుంది.

**సంతానంపట్ల బాధ్యత -** కొత్త తరం నిర్మాణాన్ని పరమ పవిత్రంగా, సమాజ సేవకు ఉత్తమోత్తమ సాధనంగా పరిగణించాలి. సంతానోత్పత్తిని భోగ విలాసంగాకాక, జాతీయ కర్తవ్యంగా, దేశభక్తి పూర్వక చర్యగా భావించాలి. ఇందుకోసం మొదటినుండే ఆర్థికంగా తగు సన్నాహాలు చేసుకోవాలి. తల్లి దండ్రుల గుణ దోషాలు సంతానానికి సంక్రమిస్తాయి. కనుక, భార్యా భర్తలు తమ సద్గుణాలను శిఖరాగ్ర స్థాయికి పెంచుకోవాలి. ఎంతో ప్రేమతో, ఆత్మీయతతో జీవించాలి. ఈ ఏకత్వం ఉన్నతోన్నతంగా ఉండడం అన్నదానిపై పిల్లల ఆంతరిక వికాసం ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రులలో పరస్పర విద్వేషం, అవిశ్వాసం, కలహం చోటు చేసుకుంటే దుర్మార్గమైన సంతానమే జన్మిస్తుంది. తల్లి గర్భిణిగా ఉన్న సమయంలో ఆమె మనస్సులో కలిగే భావాల సంస్కారం సంతానానికి కలుగుతుంది. పిల్లల శిక్షణ తల్లి గర్భంలో ఉన్నపుడే ప్రారంభం అవుతుంది. వాస్తవానికి అంతకు ముందే ప్రారంభమవుతుంది. తల్లి దండ్రుల గుణ కర్మ స్వభావాలు, ఆరోగ్యం, మనోభావాలు, బుద్ధికుశలత స్థాయి - వీటి ప్రభావం సంతానంపై పడుతుంది. కనుక విజ్ఞత కలిగిన భార్యా భర్తలు దాంపత్య జీవన ప్రారంభం నుండే సభ్యత కలిగిన నవతరాన్ని నిర్మాణం చేసే సామర్థ్యాన్ని సంపాదించాలి. అత్యధికంగా బ్రహ్మచర్యాన్ని పాటించాలి. దాంపత్య జీవితాన్ని అన్ని విధాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలి.

**దృఢ సంకల్పం సాఫల్యానికి జనని.**

**సత్కార్యాల అభినందన -** పేరు ప్రతిష్ఠలు పొందాలనే కోరిక సహజమైనది. మనిషి తనకు పేరు తెచ్చే పనుల వైపు మొగ్గుతాడు. నేడు డబ్బుకు, పదవికే గౌరవం లభిస్తోంది. కనుక జనం వాటిపట్ల ఆకర్షితులౌతున్నారు. విలువ కట్టే ఈ పద్ధతిని మార్చాలి. జ్ఞానులకు, త్యాగమూర్తులకు, పరాక్రమవంతులకు సన్మానం చేయడానికి, బహిరంగ సభలలో వారిని అభినందించడానికి తగు కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. అలాంటి వ్యక్తులకు సన్మాన పత్రాలు సమర్పించాలి. పతకాలు, బహుమతులు ప్రదానం చేయాలి. పత్రికలలో వారి మంచి పనులపై చర్చ జరగాలి. వారి ఫోటోలు రావాలి. వారి జీవిత చరిత్రలు పుస్తకాలుగా రావాలి. ఈ పనులన్నింటినీ మనం చేపట్టాలి. ఇలాంటి వారికి సన్మానాలు నచ్చక పోవడం సహజమే. అయినా ఇతరులను ప్రోత్సహించడానికీ, వారిని అనుకరించాలనే కోరిక ఇతరులలో జనించడానికీ ఇలాంటి అభినందన సభలను ఏర్పాటు చేస్తూ ఉండాలి. స్వార్థ ప్రయోజనాల కోసమో, అనర్హులను పొగడడం కోసమో ఇలాంటి సభలు జరగకూడదు. జరిగితే అసూయ, ద్వేషం పెరుగుతాయి. సభ్య సమాజాన్ని నిర్మించాలంటే ధనానికీ, శక్తికే కాక ఆదర్శాలకు గౌరవం లభించాలి.

**మానవత్వానికి సహకారం -** మనుషుల స్థాయి పెరగాలంటే మంచితనానికి సహకారం అందించే విధానాన్ని అవలంబించాలి. అది జరగకపోతే మంచితనం మరణిస్తుంది. అలాగే చెడును ఎదిరించకపోతే అది నానాటికీ పెరిగిపోతుంది. కనుక సత్ ప్రవృత్తులను అభివృద్ధి పరచేవి, అవినీతిని నిరుత్సాహపరచేవి అయిన విధానాలను ప్రతి పౌరుడూ అనుసరించాలి. ఒకవేళ చెడును ఎదిరించే పరిస్థితి లేకపోతే, కనీసం దానితో సహకరించకుండా ఉండాలి. దానికి దూరంగా ఉండాలి. సాధ్యమైతే చెడుతో పోరాడాలి. అది సాధ్యపడకపోతే చెడుకు సహాయనిరాకరణ చేసే సాహసాన్ని ఎట్టి పరిస్థితులలోనైనా ప్రదర్శించాలి.

**నైతిక కర్తవ్యాల నిర్వహణ -** నైతిక కర్తవ్యాలను, పౌర విధులను నిర్వహించాలి. సత్ సంప్రదాయాలను సమర్థించాలి. ధర్మం ఆధారంగా, నీతి ఆధారంగా నడుచుకోవాలి. శిష్టాచారాన్ని పాటించాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. సహకార గుణాన్ని, ఔదార్యాన్ని పెంపొందించుకోవాలి. నిజాయితీగా శ్రమించి సంపాదించినదానితో తృప్తి పడాలి. నీతిగా, నిరాడంబరంగా జీవించాలి. కొరతలను, అసౌకర్యాలను, కష్టనష్టాలను ఎదుర్కొనవలసి వచ్చినప్పటికీ మంచినీ, మానవత్వాన్నీ ప్రతిబింబించే జీవన సరళిని రూపొందించుకోవాలి. సోమరితనాన్ని వదులుకోవాలి. ఒక్క క్షణాన్ని కూడా వృథా చేయకూడదు. శ్రమను, సమయాన్ని సద్వినియోగం చేయడం సాఫల్యానికి రాచబాట. జూదం, దొంగతనం, మోసం, లంచం తీసుకోవటం, కల్తీ చేయటం, దగా వంటి అవాంఛనీయ పద్ధతులలో డబ్బు సంపాదించి గొప్పవాడు కావడం కన్న నిజాయితీగా పని చేసి దారిద్ర్యాన్ని అనుభవించడం మిన్న.

**సహకారం, సామాజిక స్పృహ -** సహకారంతో, కలసి మెలసి ఉమ్మడిగా కార్యక్రమాలను నిర్వహించే ధోరణిని ప్రోత్సహించాలి. ఆర్థిక రంగంలో సహకార సంఘాలు ఆధారంగా వ్యాపారాలను, పరిశ్రమలను, ఉత్పత్తి ప్రక్రియలను రూపొందించాలి. ఇందువల్ల పెట్టుబడి సమస్య పరిష్కారం అవుతుంది. భారీ ఎత్తున పని చేయడం వల్ల వస్తువులు చౌకగా, నాణ్యమైనవిగా తయారవుతాయి. ఇందువల్ల ఉత్పత్తి దారులకు లాభం వస్తుంది. వినియోగదారులకు సౌకర్యం పెరుగుతుంది. కార్యకర్తల మధ్య పరస్పర ప్రేమాభిమానాలు పెరుగుతాయి. వ్యక్తిగత స్వార్థంతో కన్న సామూహిక ప్రయోజనం, సామూహిక సంఘటన ఆధారంగా నడిచే కార్యకలాపాలలో పాల్గొనడం, వాటికి సహకరించడం, వాటిని పెంపొందించడం మరింత సముచితమైన పని. సహకార విధానం దెబ్బతింటే సమాజం పతనమవుతుంది. ఆ విధానం బలపడితే సమాజం ఉన్నతోన్నతం అవుతుంది.

**పిసినారితనాన్ని, విలాసాలను వదులుకోవాలి -** అవసరాన్ని మించి డబ్బు కూడబెట్టడం, మధ్యతరగతి ప్రజల జీవన స్థాయిని మించి విలాసంగా జీవించడం అనే ధోరణులను నిరుత్సాహపరచాలి. ఈ ధోరణుల వల్ల వ్యక్తులలో అనేక దుర్గుణాలు ఏర్పడతాయి. సమాజం స్థాయి పతనమవుతుంది. వ్యక్తులు తమకోసం కనీసంగా ఖర్చు చేసి మిగతా డబ్బును సమాజానికి తిరిగి ఇవ్వాలి. సమాజంలో ఎందరో వ్యక్తులు దుఃఖ దైన్యాలతో, దారిద్ర్యంతో సతమతమవుతున్నారు. వెనుకబడి ఉన్నారు. సమాజాన్ని అనేక విషమ సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. వీరందరినీ ఉపేక్షించి వ్యక్తి తనకోసం మితిమీరిన ఆస్తిపాస్తులు కూడబెట్టడం మానవీయ ఆదర్శాలకు విరుద్ధం.

సంతానాన్ని యోగ్యులుగా తీర్చిదిద్దడం అవసరమే. వారికి తగు రక్షణ కల్పించడం అవసరమే. కానీ వారిని కూర్చుని తినే వారుగా, వడ్డీలపై, అద్దెలపై బ్రతికే సోమరులుగా తయారు చేయాలని అనుకోవడం మాత్రం పెద్ద పొరపాటు. అందువల్ల సంతానానికి హాని జరుగుతుంది. పలువురు వ్యక్తులు సంతానం కలగని స్థితిలో తమ ధనాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగించడానికి బదులు ఎవరినో తెచ్చి పెంచుకుంటారు.

**పక్షి ఎంత చిన్నదయినా దాని గూడు అదే నిర్మించుకుంటుంది.**

అతడు తమ వాడేనని మురిసిపోతారు. తాము కూడబెట్టిన ఆస్తిపాస్తులను అతడికి అప్పగిస్తారు. ఇలాంటి సంకుచితత్వం నిలచి ఉన్నంత వరకు సమాజం బాగుపడదు.

సంపాదించినదాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగించడం గర్వకారణంగా, గౌరవ ప్రదంగా భావించే ప్రవృత్తిని వ్యక్తులలో మేలుకొలపడం అవసరం. ప్రజలు ఉదారులుగా, దాతలుగా రూపొందినపుడే సత్‌ప్రవృత్తులు జనించడం వృద్ధి పొందడం అన్నది సాధ్యపడుతుంది. పిసినారితనం మహాపాపమనీ, విలాసాలలో మునిగి తేలడం పాషాణ హృదయుల పని అనీ భావించే విధంగా ప్రజలకు శిక్షణ ఇవ్వాలి.

**శ్రమకు గౌరవం -** శ్రమకున్న గౌరవాన్ని పెంచాలి. మానసిక శ్రమ చేసేవారికి అధికంగా ధనం, పలుకుబడి లభిస్తున్నాయి. కాయకష్టం చేసేవారిని చిన్నచూపు చూస్తున్నారు. ఈ దృక్పథంలో మార్పు రావాలి. శారీరక శ్రమకు, శ్రామికులకు తగు గౌరవం లభించాలి. జనక మహారాజు నాగలి దున్ని బ్రతుకు దెరువు సాగించే ఆదర్శాన్ని ప్రజల ముందుంచాడు. నసీరుద్దీన్ పాదుషా టోపీలు కుట్టి, ఖురాన్ ప్రతులు వ్రాసి బ్రతుకుదెరువు సాగించాడు.

మన సమాజంలో పారిశుద్ధ్య పనివారిని, చేనేత కార్మికులను, చెప్పులు కుట్టేవారిని, బట్టలు కుట్టే దర్జీలను, ఇళ్లు కట్టే కార్మికులను, బరువులు లాగే శ్రామికులను, కాయ కష్టం చేసే కూలీలను నీచంగా చూస్తున్నారు. వారు శారీరిక శ్రమ చేస్తూ ఉండడమే అందుకు కారణం. తమ కొద్దిపాటి సామానును మోయడం నామర్దాగా భావిస్తున్నారు నేటి విద్యావంతులూ సంపన్నులూ. ఈ వర్గాల స్త్రీలు వంట వండడం, అంట్లు తోమడం, ఇళ్లు ఊడ్చడం, పక్కలు వేయడం వంటి పనులను పరువు తక్కువ పనులుగా భావిస్తున్నారు. ఈ చిన్నచిన్న పనులకు పనిమనుషులను పెట్టుకుంటున్నారు. ధనవంతులు చెప్పులు తొడిగే, బట్టలు తొడిగే పనులను సైతం నౌకర్లచేత చేయుంచుకుంటున్నారు. ఇలాంటి ప్రవృత్తులు సమాజ పతనానికి కారణాలు అవుతాయి.

శ్రమకు గౌరవం తగ్గడంవల్ల దానిపట్ల ప్రజలకు ఏవగింపు కలుగుతుంది. సోమరితనానికి గౌరవం లభిస్తే అందరూ అలాగే ఉండాలని కోరుకుంటారు. కనుక - కార్మికునికి ప్రోత్సాహం లభించాలి. గౌరవమూ లభించాలి. తాము శ్రామికులమనే మనోభావాన్ని మనలో ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి. శ్రమను గౌరవించడంపై సామాజిక ప్రగతి చాలావరకు ఆధారపడి ఉంది.

U U U

## కలయికలో గెలుపు

సాఫల్యం పొందటంలో ప్రముఖ పాత్ర వహించేది బలమా, సంకల్పమా, వివేకమా? అనే సందేహం కల్గి ఈ మూడూ ప్రజాపతివద్దకు వెళ్ళి ఆయన అభిప్రాయాన్ని కోరాయి. కేవలం తన అభిప్రాయాన్ని వినిపించటం కాక ప్రామాణికంగా తెలియచేయాలని ప్రజాపతి నిశ్చయించుకున్నాడు.

ఆడుకొంటున్న పిల్లవానివద్దకు వెళ్ళి ఒక వంకర మేకు, సమ్మెట ఇచ్చి మేకును చక్కచేయమని కడుపునిండా మిఠాయి తినిపిస్తానని చెప్పాడు. బాలుడు అంగీకరించాడు. కానీ అంత పెద్ద సమ్మెట మోసే శక్తి నాకెక్కడ ఉంది? అన్నాడు నిరుత్సాహంగా, కాస్త ముందుకు వెళ్ళేసరికి ఒక పనివాడు కనిపించాడు. నిద్రపోతున్న అతన్ని మేల్కొల్పి మేకు సమ్మెట ఇచ్చి మేకును సరిచేసి 5 రూపాయలు తీసుకోమన్నాడు. 5 రూపాయల మాట వినగానే ఆశ పుట్టి పనికి ఉపక్రమించాడే గాని, గట్టి సంకల్పం లేక మళ్ళీ నిద్ర ముంచుకువచ్చి పనిని మధ్యలో వదలివేసాడు. మరికాస్త ముందుకు వెళ్లే సరికి ఒక బుద్ధిమంతుడైన ఇంజనీరు కనిపించటంతో మేకును సరిచేసి 50 రూపాయల పారితోషికాన్ని స్వీకరించమన్నాడు. ఇంజనీరు అనారోగ్యంగా ఉన్నాడు. శ్రమకు తట్టుకోలేని పరిస్థితి అతనిది. అందుకే ఆ పని తనవల్ల కాదని నిరాకరించాడు. ఇంక ముందుకు సాగనవసరం లేదని నిర్ధారణచేసి ప్రజాపతి ఈ ముగ్గురు వ్యక్తులు కలిసి ఉంటే పని అవలీలగా జరిగిపోయేది. వివేకం లేని బాలుడు, సంకల్పంలేని నిద్రమత్తులో ఉన్న పనివాడు, బలంలేని ఇంజనీరు కావటం వలన పని చిన్నదే అయినా సాధించలేకపోయారు. ఈ మూడు శక్తులూ కలిసి ఉంటే ఎంతటి అసాధ్యమైన పనులైనా అవలీలగా సాధించవచ్చు. శక్తి, సంకల్పం, వివేకం ఈ మూడూ తమ పొరపాటును తెలిసికొని కలిసి ఉండటానికి నిశ్చయించుకొని ప్రజాపతివద్ద సెలవు తీసికొన్నాయి. ఆనాటి నుండి ఈ మూడూ ఎక్కడ ఉంటే అక్కడ విజయం, సాఫల్యం, సన్మానం లభించసాగేయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మనం మంచి అనుకున్నదాన్ని నిర్భయంగా ఆచరించాలి .**

జీవన పథం

# పరస్పర సహకారం వికాసానికి కీలకం

మనిషి ప్రపంచానికి శిరోమణి. పరమాత్మ మనిషితో ఇలా ఒప్పందం చేసుకున్నాడు: నా సృష్టి అనే ఉద్యానవనాన్ని నీవు చక్కగా చూచుకోవాలి. దాన్ని అందంగా, సమున్నతంగా రూపుదిద్దడానికి అన్ని విధాలా ప్రయత్నించాలి. నేను నీ యోగక్షేమాలను రక్షిస్తాను. 'యోగక్షేమం వహామ్యహం'.

యుద్ధరంగంలోకి వెళ్లేముందు సైనికునికి అత్యాధునికమైన ఆయుధాలను సమకూర్చుతారు. అలాగే-ఈ ఒప్పందంతోపాటు పరమాత్మ మనిషికి వివేకాన్నీ, బుద్ధినీ, మనోబలాన్నీ ప్రసాదించాడు. మనిషి ఈ వాస్తవాన్ని గుర్తించకపోతే, ఈ జీవన సంపదను సక్రమంగా వినియోగించకపోతే - అతడు మనిషిగా జన్మించినా క్రిమికీటకాలవలె బ్రతుకు వెళ్లదీస్తాడు. ఇందువల్ల ఒరిగేదేమిటి? ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇది. జగన్నియంత పట్ల నమ్మకద్రోహం ఇది.

**మీ జీవితాన్ని సమీక్షించుకోండి :** నిశితంగా ఆలోచించండి. మీ జీవితంలోని క్షణ క్షణం ఇలాగే గడచిపోయిందా? లేక ఇంతవరకు మీరు చెప్పుకోదగిన పని ఏదైనా చేశారా? మీరు విద్యార్థులైతే జ్ఞానంలో వ్యవహారంలో మీరు కొత్త రికార్డు సృష్టించారా? శ్రేష్ఠ వ్యక్తిగా, ఉత్కృష్ట వ్యక్తిగా ఎదగడంకోసం ముందడుగు వేశారా? పరమాత్మ మనిషికి బుద్ధితోపాటు లోతయిన భావనలనూ, సంవేదనలనూ, హృదయ స్పందనలనూ ఇచ్చాడు. ఇందులో జగన్నియంత ఉద్దేశ్యం ఒక్కటే-వ్యక్తిగత జీవితంలో సరసత్వం, సానుభూతి, ఆత్మ సౌందర్యం, హర్షం, ఉల్లాసం, ఆనందానుభూతి తొణికిసలాడడం, సామాజిక జీవనంలో ప్రేమ, సౌహార్ద్రం, సహకారం పెంపొందే విధంగా ఆత్మీయత వికసించడం, సృష్టిని సౌందర్యంతో నింపడం.

వ్యక్తి జీవితం బుద్ధి వివేకాల, భావ సంవేదనల అపురూప సమ్మేళనం. జ్ఞానం, గుణం, కర్మ, స్వభావం-వీటి సమ్మేళనం మీ జీవితంలో ఏ మేరకు జరిగిందని పరీక్షించుకోండి. జరగపోతే-మీరు మీ జీవితం గురించి ఎలా ఆలోచిస్తున్నారు? చింత, స్తబ్దత, నిరాశ, ఆత్మనింద, ఆత్మన్యూనతల వలలో ఎలాగో చిక్కుకుని మీరు దిక్కు తోచని స్థితికి చేరుకోలేదు కదా! చేరుకుంటే- జేబులో రూపాయలు ఉన్న సంగతి మరచి బిచ్చం అడుక్కుంటూ తిరిగే వ్యక్తి మనో దశ ఇదే.

గుర్తుంచుకోండి. మనిషి స్థాయి చాలా ఉన్నతమైనది. తన సమయాన్ని ఇలా తెగిన గాలిపటంలా తిరుగుతూ గడిపితే- అతడు పరమాత్మతో చేసిన ఒప్పందాన్ని ఉల్లంఘించడం అనే నేరం చేసినవాడవుతాడు. అతడు అందుకు శిక్ష అనుభవించవలసివస్తుంది. వ్యక్తి తన ఉద్యోగంలో సమయపాలన చేయలేకపోతే, తన పనిని సమయానికి సక్రమంగా చేయకపోతే అతడిపై రకరకాల క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. ఒకొసారి ఉద్యోగం ఊడిపోతుంది కూడా. అలాగే- పరమాత్మ కూడా సోమరులను, పద్ధతి ప్రకారం నడుచుకోని వారినీ, సమాజంలో వికృతిని వ్యాప్తిచేసే వారినీ క్షమించడు. వారి జీవితాలు దుర్భరములు అయిపోతాయి. మీరు మీ బాధ్యతలనే కాక సమాజం మొత్తాన్ని సమున్నతం చేసే బాధ్యతను కూడ నిర్వహించాలి. మీరు జీవితపు లోతులను తరచిచూడాలి.

**మీ దృక్పథాన్ని మార్చుకోండి :** మనం ఎవరము? ఏమి చేయడానికి వచ్చాము? ఏమి చేస్తున్నాము? మనం ఏమి చేయాలి? ఈ ప్రశ్నలన్నింటికీ జవాబులు మన లోపల ఉన్నాయి. కానీ, మన దృక్పథం సవ్యంగా లేనందువల్ల ఆ జ్ఞానశక్తి అంతా మనలోపల దాగి ఉంది. మీ దృక్పథాన్ని సరిచేసుకోండి. జడత్వం నుండి మేలుకోండి. ఆరోగ్యవంతమైన మనస్సు కోసం గట్టి ప్రయత్నం చేయండి. జీవితంలో ఔదార్యానికీ, కర్తవ్యపరాయణతకూ ఉన్నత స్థానం ఇవ్వండి. ఆత్మ సంపదను ఆర్జించండి. ఇవన్నీ లోపిస్తే మనిషి జ్ఞానవంతుడూ, ధనవంతుడూ అయినప్పటికీ, మణి లేని సర్పంవలె, పనికిరానివాడు అయిపోతాడు. ఆత్మ సంపద కలిగిన వ్యక్తియే జీవితంలో నిజమైన ఆనందాన్ని పొందుతాడు.

**జీవితం ఒక సంగ్రామం :** జీవితంలోని అవాంఛనీయతతో పోరాడాలి. దురాచారాలనూ, మాంద్యాన్నీ కూకటివ్రేళ్లతో పెల్లగించివేయాలి. మొరటుతనాన్ని నిర్మూలించాలి. అసూయా ద్వేషాలనూ, వైర విరోధాలనూ జీవితం నుండి పెరికివేయాలి.

**జీవితం ఒకవ్యవస్థ :** దీనికి కేంద్రం మనిషి. మనిషి శరీరం, మనస్సు, ఆత్మ, ప్రాణముల సమ్మేళనం. మనం వీనిలో ప్రతి దానినీ ఆరోగ్యవంతంగా నిలిపి ఉంచుకోవాలి. శరీరం బలంగా ఉండాలి. మనస్సు పవిత్రంగా ఉండాలి. ఆత్మ శక్తివంతంగా ఉండాలి. ప్రాణం తీక్షణంగా ఉండాలి. కల్మషాలూ, కశ్మలాలూ వీటిని తాకనే కూడదు. అలా జరగపోతే ఏడుస్తూ దుఃఖిస్తూ ఉన్న వ్యక్తులు భూమాతకు బరువుగా మిగిలిపోతారు. మరి ఏం చేయాలి? మనం జీవితం పట్ల మెలకువతో ఉండాలి. చెడు ఆలోచన ఏదీ మన మనస్సులో

**మనం చెడు అనుకున్న దాని ముందు ఎట్టి పరిస్థితిలోను లొంగకూడదు.**

చొరకుండా చూడాలి. కష్టాలను చూచి భయపడవద్దు. వీటిని ఎదిరించేందుకు సరైన పద్ధతులను అనుసరించాలి. సాత్వికత ఆధారంగా సమస్యలకు శాశ్వత పరిష్కారాలను కనుగొనాలి. సాత్విక భావంతో జీవించడాన్ని అభ్యసించాలి. విలువను వికసింపజేయాలి. అందువల్ల వ్యక్తిత్వం నిగ్గుతేలుతుంది. అస్మితను రక్షించుకోవడంలో సహాయం లభిస్తుంది. వ్యక్తిలోని యోగ్యతలూ, అర్హతలూ, శక్తి సామర్థ్యాలూ పెరుగుతాయి. నమ్రత, నిర్భయత్వం, నియమపాలన మన జీవితాలలో అంతర్భాగాలు కావాలి. మన నిజాయితీకి మచ్చ రాకూడదు.

స్వచ్ఛత, నిరాడంబరత్వం, సంతృప్తి, సేవ, సౌహార్ద్రం, సంయమనం, సమయపాలన, స్వావలంబన, స్వాధ్యాయం, సదాచారం, శిష్టాచారం, ప్రేమ, సత్యవ్రతం వంటి మానవ విలువలను మనం మన జీవితంలో రంగరించుకోవాలి. విశ్వబంధుత్వం మన ఊపిరి కావాలి. ఈ మానవ విలువలే జీవితానికి మూలాధారాలు. జీవితాన్ని శిఖరాగ్రానికి చేర్చే అద్భుత సామర్థ్యం వానిలో ఉంది.

**=¼ë, <=¶D**

పరమార్థ ప్రవృత్తి లోపించిన సమాజం మనుగడ నిలవడం అసాధ్యం అవుతుంది. కుటుంబ పెద్దలు తమ పిల్లలకు సేవ చేయడం, పోషించడం, చదువు సంధ్యలు చెప్పించడం వంటి విషయాలలో శ్రద్ధ వహించకపోతే, ఈ ధోరణి సమాజంలో వ్యాపిస్తే-మానవ జాతి క్షీణించిపోతుంది. కుటుంబంలో సమాజంలో పరస్పర సంబంధాలలో ప్రేమ, సానుభూతి నుండి జనించిన ఆత్మీయత నశిస్తే - వికాసం, సామర్థ్యం, యోగ్యత లేని వ్యక్తుల జీవన యాత్ర కష్టమవుతుంది. వృద్ధుల, వికలాంగుల, రోగుల, దుఃఖితుల జీవితాలు దుర్భరములు అవుతాయి. మనిషి ప్రవృత్తులలో ఈ పరమార్థ భావన ఎంతగా లోపిస్తే సామాజిక వ్యవస్థలో సమృద్ధి కోసం మనిషి ఎంతగా కృషి చేసినప్పటికీ, ఎంతటి సంపద, వైభవం గడించినప్పటికీ అతడు పరమార్థానికి ఏవిధంగానూ ఉపయోగపడడు. అతడివల్ల సమాజ వికాసానికి ఎలాంటి మేలూ జరగదు. అంతే కాదు. అతడి వ్యక్తిగత వికాసం కూడా ఆగిపోతుంది. ఎందుకంటే సమాజంతోపాటు వ్యక్తికీ, వ్యక్తి ద్వారా సమాజానికి వికాసం సాధ్యపడుతుంది.

**స్వార్థమేకాక పరమార్థంకూడా :** స్వార్థపరత్వం ద్వారా, స్వప్రయోజనాల సాధన ద్వారా సుఖ సమృద్ధులతో కూడిన, వికాసం పొందిన సమాజాన్ని నిర్మించడం సాధ్యపడదు. అలాంటి స్థితిలో మనిషి వైమనస్యంతో నిండి ఉంటాడు. కీచులాటలలో, కుట్రలలో, అసూయా ద్వేషాలలో మునిగి ఉంటాడు. సమాజంలో పరస్పరం అవిశ్వాసం, సందేహం, భయం, అనుమానం పెచ్చుపెరుగుతాయి. ఫలితంగా సమాజంలో వికృతులూ, దోషాలూ విజృంభిస్తాయి. మోసం, అవినీతి, దౌర్జన్యం, లూటీలు, దోపిడీ వంటి ఘోర నేరాలకు బీజాలు మనిషిలోని ఈ స్వార్థ సంకుచితత్వాలలోనే ఇమిడి ఉన్నాయి. ఈ స్థితిలో మనిషి ఎంత సంపన్నుడయినా, శక్తిశాలి అయినా సుఖ శాంతులకూ, ఆనందానికీ దూరం అవుతాడు. అనుక్షణం కొత్త వేదనలను, కుట్రలనూ, సంఘర్షణలనూ దురాక్రమణలనూ అతడు ఎదుర్కొన వలసి వస్తుంది. అతడి జీవితం ఒక శాపంగా పరిణమిస్తుంది. కనుక - స్వార్థం గురించేకాక పరమార్థం గురించి కూడా ఆలోచించండి. పరస్పర సానుభూతి, సౌజన్యం, సేవ, సహాయ సహకారాలు, సంఘటన మున్నగు అంశాలపై సమాజ వికాసం ఆధారపడి ఉంటుంది. ఇవన్నీ పరమార్థ భావన ద్వారానే జనిస్తాయి. స్వార్థ సంకుచితత్వాలవల్ల సమాజంలో విచ్ఛిత్తి, సంఘర్షణ పెచ్చుపెరుగుతాయి.

**నీ కోసమేకాక, సమాజం కోసం కూడా జీవించు :** మన జీవితం, మన కార్యకలాపాలన్నీ వ్యక్తిగతం కాక సమష్టిగతంగా, దేశంలోని ప్రజందరికీ ఉపకరించేవిగా ఉండాలి. నిర్మాణాత్మకంగా, ఇతరులకు శ్రేయస్కరంగా ఉండాలి. మనిషి తన కోసం కాక, సమాజం కోసం ప్రపంచం కోసం జీవించాలి. ఈ సత్యం ఆధారంగా వ్యక్తి వికాసం, ఔన్నత్యం సాధ్యమవుతాయి. ఇందుకుతోడు సమాజంలో పరస్పర సహకారం, ఆత్మీయత, సౌజన్యములతో కూడిన సంబంధాలు స్థిరపడతాయి. మనిషి చేసే ప్రతి పనీ విశ్వయజ్ఞంలో ఆహుతి ఇవ్వడంగా ఉంటే, భువిపై దివి అవతరిస్తుంది.

**మన శక్తిని ఇతరుల ఉద్ధరణకు వినియోగించాలి :**శక్తి సామర్థ్యాలను వినియోగించి ఏ రంగంలో అయినా పదవులనూ, పేరు ప్రతిష్టలనూ పొందడం తప్పు కాదు. జీవిత సర్వతోముఖ వికాసానికి ఇది అవసరం కూడా. అయితే, శక్తి సామర్థ్యాలనూ, పదవినీ, అధికారాన్నీ దళిత జనుల ఉద్ధరణకూ, దారి తప్పిన వారిని సరైన దారిలో పెట్టడానికీ, ముందడుగు వేసే వారికి ఆసరా ఇవ్వడానికీ వినియోగిస్తే అవి సార్థకం అవుతాయి. తమ శక్తి సామర్థ్యాలకూ, అధికారానికీ పదవికీ గర్వించి, ఇతరులను పడగొట్టే వారినీ, ఇతరులకు హాని కలిగించే వారినీ, ఇతరులకు దుఃఖాలనూ, కష్టాలనూ తెచ్చిపెట్టేవారినీ, మనుషులయి కూడా మానవత్వాన్ని మంటగలిపే వారినీ సమాజ నిర్మాతలు క్రూరులుగా, పాపులుగా, దుష్టులుగా, నీచులుగా పరిగణించారు. వీరివల్ల సమాజానికి కీడు జరుగుతుంది. పరస్పర సంఘర్షణ, అశాంతి, కష్టనష్టాలు దాపురిస్తాయి.

**ఇతరుల సుఖ దుఃఖాలలో పాలు పంచుకో :** హాయిగా, ఆనందంగా ఉండడం మనిషి జీవితానికి అత్యవసరం. భూమిపై ఉన్న దేవ దుర్లభమైన మానవీయ ఆనందాన్ని పొందడానికే ఇక్కడ జీవుడు

**సంకోచించి ఆగడం తెలియని వ్యక్తి ముందు కష్టాలు లొంగిపోతాయి.**

అవతరిస్తాడు. అయితే ఇలాంటి ఆనందాన్ని అందరితో కలిసిమెలసి అనుభవించాలి. సమాజంతో పాటు అనుభవించాలి. భారతీయ సంస్కృతిలో, భారతీయ ధర్మంలో పండగలూ, పబ్బాలూ, పర్వదినాలూ, తిరునాళ్ళూ, ఆచార వ్యవహారాలూ ఈ సత్యానికి ప్రతీకలు. ఒంటరిగా, వ్యక్తిగతంగా ఆనందించడానికి శాస్త్రకారులు ప్రాముఖ్యం ఇవ్వలేదు. మన పర్వాలూ, పండగలూ, తిరునాళ్ళూ మొదలైనవి ధనికులూ పేదలూ, చిన్నలూ పెద్దలూ అందరికోసం రూపొందించబడ్డాయి. సమాజంతోపాటు సుఖించాలి. సమాజంతో పాటు దుఃఖించాలి. జీవితంలోని కష్టాలనుండి గట్టెక్కడానికి మూలమంత్రం ఇదే.

ఇలా మన జీవితంలోని ప్రవృత్తులన్నిటికీ ఆధారం బహుజన హితాయ కావాలి. అందరికీ హితాన్ని అందించాలి. పరమార్థ పరాయణం కావాలి. స్వార్థపరాయణం కాకూడదు. మన యొక్క సమాజ జీవనం యొక్క వికాసానికి, ప్రగతికి మంత్రం ఇందులోనే ఇమిడి ఉంది. అందరి హితం, అందరి సుఖం, అందరి ప్రయోజనం, అందరి శుభం-ఇదే మన జీవన దర్శనం కావాలి. మంత్ర ద్రష్ట అయిన ఋషి ఇందుకు ప్రేరణ ఇస్తూ ఇలా అన్నాడు:

**సర్వే భవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః ।**
**సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖమాప్నుయాత్ ॥**

అనగా- అందరూ సుఖించాలి. అందరూ నిరామయులుగా ఉండాలి. అందరికీ శుభం జరగాలి. ఎవరికీ దుఃఖం కలగకూడదు.

సామూహిక ప్రయత్నాలలోనే వికాసం, ఉన్నతి, శుభం జరిగే మార్గం ఇమిడి ఉంది. మనం మన భేద భావాన్నీ, స్వార్థ ప్రయోజనాలనూ వదిలి, సామూహిక ప్రయత్నాల ద్వారా వికాస యాత్రలో పయనించడానికి దృఢంగా ప్రయత్నించాలి. అప్పుడే మన భవిష్యత్తూ, సమాజ భవిష్యత్తూ ఉజ్వలం అవుతాయి.

## [illegible]

నాకు ఎవరి సహాయమూ అవసరం లేదు. నాకు ఎవరి సలహా అక్కరలేదు. నాకు మెదడు ఉంది. చేతులూ, కాళ్ళూ ఉన్నాయి. అంత పనినీ నేను స్వయంగా చేసుకుంటాను- ఇలా పలువురు చెపుతూ ఉంటారు. తాము సర్వగుణసంపన్నులమని భావించేవారు ఇలా బడాయి కబుర్లు చెపుతారు. నిజమే. స్వావలంబన, ఆత్మ విశ్వాసం, సాహసం కలిగి ఉండడం చాలా అవసరమే. తప్పనిసరి కూడా. కానీ, సరైన విజ్ఞత, వివేకం లేకపోతే సద్గుణాలు సైతం ప్రమాదకరమైన దుర్గుణాలుగా పరిణమిస్తాయి. అవి మనిషిని పతనం, సర్వనాశనం అనే అగాధంలోకి కూలద్రోస్తాయి. సమయస్ఫూర్తి, వివేకం లేని డ్రైవరు ఖరీదయిన వాహనాన్ని సైతం ప్రమాదానికి గురిచేసి తుత్తునియలు చేస్తాడు. మరో ప్రక్క గుండె నిబ్బరం, విజ్ఞత కలిగిన డ్రైవరు చెత్త కారునయినా గమ్యస్థలికి చేర్చుతాడు. ఇతరుల సహాయాన్ని ఉపేక్షించే వ్యక్తి, ఇతరుల సలహాలనుండి అనుభవాలనుండి ప్రయోజనం పొందకుండా తన బుద్ధిని మించిన బుద్ధి లేదని భావించే వ్యక్తి మొండివాడు, మూర్ఖుడు, అవివేకి అవుతాడు. అతడు తన గొడ్డలితో భవిష్యత్తు అనే తన కాళ్లను నరుకుకునే మూఢునివంటివాడు.

**పరస్పసహకారం ద్వారానే వికాసం సాధ్యం :** ఇటుకనూ, ఇటుకనూ కలిపితేనే భవ్యమైన భవంతి నిర్మాణం అవుతుంది. నీటి బొట్టూ, నీటి బొట్టూ కలిస్తేనే నదీ, సరోవరం, సాగరం అవుతాయి. నీటి బొట్టు విడిగా ఉంటే దానికి విలువ ఉండదు. ఒక ఇసుక రేణువు, ఒక చిన్న సూర్యకిరణపు వేడి దానిని నామ రూపాలు లేకుండా చేస్తాయి. గాలి ఏ కొంచెం వీచినా అది ముక్క చెక్కలు అయిపోతుంది. పలువురు వ్యక్తుల పరస్పరం సహకారం ద్వారానే వారందరి ప్రగతి, వికాసం సాధ్యపడతాయి. ఈ సహకారం ఆధారంగానే సమాజం, జాతి సుఖ సమృద్ధులను సాధిస్తాయి. ప్రతి నిర్మాణ కార్యంలో ఎందరో కార్మికుల రక్తం, చెమట కలిసి ఉంటాయి.

ప్రతి వ్యక్తికీ ఒక పరిమితి అనేది ఉంటుంది. వైద్యుడు చికిత్సలో, కళాకారుడు తన కళలో, రాజకీయవేత్త రాజనీతిలో, సాహిత్యవేత్త సాహిత్యంలో నిపుణులుగా ఉంటారు. అయితే ఏ వ్యక్తీ సర్వజ్ఞుడు కాడు. ప్రతి వ్యక్తీ తన సమాజంలోని ఇతరులకన్న చిన్నవాడు, అయోగ్యుడు. కళాకారునితో పోల్చితే వైద్యుడు అయోగ్యుడు. వైద్యునితో పోల్చితే ఇంజనీరు, సాహిత్యవేత్తతో పోల్చితే వ్యాపారస్థుడు అయోగ్యులే అవుతారు. ఒక రంగంలో నిపుణుడు అయినప్పటికీ ఆ వ్యక్తి ఇతర రంగాలలో అయోగ్యుడు అవుతాడు. కనుక ఆయా రంగాలలో ఆయా నిపుణుల సలహా సహకారం లేనిదే పని పూర్తికాదు. తన రంగంలో వికాసం ప్రగతి జరగాలన్నా వ్యక్తికి ఇతరుల సలహా, సహకారం అవసరం అవుతాయి. ఒక మేధావికి ఇతర మేధావుల ఆలోచనల గురించి తెలియాలి.

వికాసం సహకారం ద్వారానే జరుగుతుంది. ఒక తరం పొందిన జ్ఞానాన్ని, అనుభవాన్ని, వైఫల్యాలను తెలుసుకుని, వాటి నుండి ప్రయోజనం పొంది, తర్వాతి తరం తన పరిశోధనలో వాటి సహాయం తీసుకొని, కొత్త వాస్తవాలను కనుగొంటుంది.

**బుద్ధిపరమైన దివాళాకోరుతనం హానికరం :** సమన్వయం, సహకారం, సమాజంతో కలిసి ముందడుగు వేయడం ఉన్నతికీ, వికాసానికీ సోపానాలు. ఈ వాస్తవాన్ని గుర్తించని వ్యక్తి, మూర్ఖత్వానికే పెద్దపీట వేసే వ్యక్తి సర్వనాశనం కావడం ఖాయం. ఇది బుద్ధిపరమైన

**నిజాయితీగా ఉండు, నిజాయితీగా పనిచేయి, నిజాయితీగా మాట్లాడు. నీ హృదయం తేలికవుతుంది.**

దివాళాకోరుతనం.ఈ రోగం ముదిరితే వ్యక్తి, సమాజం నష్టమైపోతాయి. భ్రష్టమైపోతాయి. కులతత్వం, వర్గతత్వం, లింగ వివక్ష, పార్టీతత్వం, సాంప్రదాయికత, భాషాతత్వం మున్నగు సిద్ధాంతాల వల్ల ఏర్పడే సంఘర్షణ, వ్యక్తుల మధ్య ఏర్పడే వైమనస్యం-ఇవన్నీ బుద్ధి దివాలా తీయడానికి గుర్తులు. పరస్పర సహకారం, సర్దుబాటు, సమన్వయం అసాధ్యాన్ని సాధ్యంచేసి చూపుతాయి. ఇవి లోపిస్తే తగాదాలూ, ఘర్షణలూ తప్పవు.

**ఇతరులనుండి నేర్చుకోవడానికి సంకోచించవద్దు :** నిత్యజీవితంలో పరస్పర ఔదార్యం, ఒండొరుల సుగుణాలను గ్రహించడం అనే లక్షణాలు లోపించడంవల్ల సహకారం, సమన్వయం మొగ్గలోనే త్రుంచివేయబడతాయి. ఇది వైఫల్యానికి దారితీస్తుంది. గుణగ్రాహకత ద్వారా, ఇతరులలోని సుగుణాలను గ్రహించడం ద్వారా వ్యక్తి సామాన్య వ్యక్తులనుండి కూడా సహకారాన్ని పొంది, తన జ్ఞానాన్నీ, శక్తి సామర్థ్యాలనూ వికసింపచేసుకుని సాఫల్యాన్ని సాధిస్తాడు. కాని, జనం అహంకారంతో ఇతరుల సుగుణాలను గ్రహించడం, వారిని సలహా అడగడం అవమానాలుగా పరిగణించడం కద్దు. దత్తాత్రేయ మహర్షి పశు పక్ష్యాదులతోసహా 24 గురిని గురువులుగా చేసుకున్నారు. కానీ, ఏ వ్యక్తి అయినా మంచి సలహా చెపితే దానిని అవమానంగా పరిగణించి అతడిని ఎదిరించడానికి సిద్ధమయ్యేవారు పలువురు ఈనాడు కనిపిస్తున్నారు.

మనసు విప్పి ఇతరులనుండి నేర్చుకోవడం, అలాగే ఇతరులకు నేర్పడం ఇతరులను ప్రోత్సహించడం నిత్యజీవితంలో ఎంతగానో అవసరం అవుతాయి. మన కళలు లోపించడానికీ, వాటి వికాసం నిలిచిపోవడానికీ ఒక కారణం జనం ఇతరులనుండి నేర్చుకోవడం అవమానంగా పరిగణించడమే. కానీ, ఇది సంకుచితత్వంతో నిండిన పెద్ద పొరపాటు. ఇతరులకు నేర్పడంలో ఇతరులను ప్రోత్సహించడంలో వ్యక్తి విద్యాభ్యాసం, ఔన్నత్యం దాగి ఉన్నాయి. ఇతరులకు ఏదీ నేర్పని వ్యక్తి కళ, విద్య, యోగ్యతల వికాసం ఆగిపోతుంది.

**సద్గుణాలను ప్రోత్సహించు :** పరస్పరం ప్రోత్సహించుకోకపోవడం మన వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవనంలోనూ కానవస్తూన్న ఒక పెద్ద బలహీనత. ఇతరులను ప్రోత్సహిస్తూ మాట్లాడడానికి బదులు జనం వారిని విమర్శిస్తున్నారు. వారి విజయాన్ని శంకిస్తున్నారు. తద్వారా వారిని నిరుత్సాహపరుస్తున్నారు. వారి ధైర్యాన్ని నీరుగార్చుతున్నారు. ఫలితంగా వారిలో నిరాశా నిస్పృహలు కలుగుతున్నాయి. తద్వారా మన సామాజిక వికాసానికి ఆటంకం ఏర్పడుతోంది. ఎదుటి మనిషిలోని సద్గుణాలను ప్రోత్సహించి, అతడి ప్రగతికి తలుపులు తెరచే ఔదార్యం చూపడం స్వంత వికాసానికి ప్రయత్నించడమే అవుతుంది. విచారకరమైన విషయమేమంటే- భావి కవులు, కళాకారులు, సమాజ సేవకులు, తత్వవేత్తలు, మేధావులు, సాహిత్యకారులు పలువురు ప్రోత్సాహం, మార్గదర్శనం లభించకపోవడంవల్ల, తగు శిక్షణ అందకపోవడంవల్ల వైఫల్యాలను చవిచూచి, దీనులుగా, హీనులుగా, నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు.

**పరస్పర సహకారరం అనే పంథా అనుసరించు :** మానవ జీవనంలో పరస్పర సహకారానికి మహత్తరమైన స్థానం ఉన్నది. మనం ఇతరుల సహకారంనుండి ప్రయోజనం పొందాలి. మన శక్తియుక్తుల ద్వారా ఇతరులకు ప్రయోజనం కలిగించే ఔదార్యాన్ని కలిగి ఉండాలి. ఒంటెత్తు పోకడ, స్వార్థపరత్వం నీచత్వానికి గుర్తులు. మానసిక సంకుచితత్వానికీ, పిరికితనానికీ, ఏవగింపునకూ బాహ్యరూపాలు అవి. అందరికీ దూరంగా ఉండి తనను గురించే ఆలోచిస్తూ ఉండడం ఆధ్యాత్మిక ఆదర్శం కూడా కాదు. అది ఒక స్తబ్దత, ఒక జడత్వం. ప్రాచీన కాలంలో ఋషులు, మహర్షులు, ఆరోగ్యాన్నీ, సౌందర్యాన్ని మరింతగా అనుభూతి పొందడానికై ప్రకృతి మాత ఒడిలో నివాసం ఏర్పాటుచేసుకునేవారు. ఉపవనాలలో ఉద్యానాలలో కుటీరాలు నిర్మించుకుని నివసించేవారు. అది వారికొక నివాస పద్ధతి మాత్రమే. మనస్సులో వారు నిరంతరం లోక కళ్యాణం గురించి, మానవసేవ గురించి ఆలోచించేవారు. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహించేవారు. వారి జీవన విధానంలో ఒంటెత్తు పోకడ, అకర్మణ్యత అన్నవి లేనేలేవు.

మనమందరం సమాజానికి ఋణపడి ఉన్నాం. ఆ ఋణాన్ని తీర్చుకోవలసిందే. ఆ ఋణాన్ని తీర్చుకోనంతవరకు ఏ వ్యక్తి అయినా జీవన లక్ష్యాన్ని సాధించజాలడు. మనం మన ఆలోచనా విధానంలో సామూహికతకు, సాముదాయికతకు, సామాజికతకు, సమన్వయానికి, సహనశీలతకు తగు స్థానం ఇవ్వాలి. ఇందులోనే మన శ్రేయస్సు ఉన్నది. ఇందులోనే మానవ కళ్యాణం ఇమిడి ఉన్నది.

జీవితంలోని ఏ రంగంలో, ఏ విషయంలో మీరు ఉన్నతిని సాధించగోరుతున్నారో, అందులో మీ మనస్సును లగ్నం చేయండి. అందులో సాఫల్యం కోసం ఏమి చేయాలో మనస్సు మీకు చెపుతుంది.

మావల్ల ఏ పనీ జరగదు, మేము ఏమి చేయగలం? - అనే నిరాశావాద దృక్పథమే మనిషి ఓటమి పొందడానికి కారణం. ఈ పని చేసి చూపుతాం- అని మనం గట్టి నిర్ణయం తీసుకుంటే ఆ పని తప్పక జరిగితీరుతుంది. ఆశలో, ఆత్మవిశ్వాసంలో మహత్తరమైన ఉత్పాదక శక్తి ఉంది.మీరు ఆ గుణాలను మీ జీవితాలలో నింపుకోండి. మీ విజయం తథ్యం.

L L L

**సూర్యోదయంతో రాత్రిపూట చీకటి, సద్జ్ఞానంతో జీవితపు చీకటి తొలగిపోతాయి.**

# యుగ గీత

## యజ్ఞం లేకుంటే - ఇహమూ లేదు, పరమూ లేదు

నాల్గవ అధ్యాయం 31వ శ్లోకం ఇది -

**యజ్ఞశిష్టామృతభుజే యాంతి బ్రహ్మ సనాతనమ్ ।**
**నాయం లోకోస్త్య యజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥**


అనగా -

*కురుశ్రేష్ఠుడైన ఓ అర్జునా! యజ్ఞంలో మిగిలిన అమృతాన్ని అనుభవించే యోగిజనులు సనాతన పరబ్రహ్మ పరమాత్మను పొందుతారు. యజ్ఞం చేయని వ్యక్తికి ఈ మనుష్యలోకమే సుఖదాయకం కాదు. ఇక పరలోకం ఎలా సుఖదాయకం అవుతుంది?*

### ముంగిస కథ

పరమవందనీయ మాతాజీ తమ ప్రసంగాలలో మహాయజ్ఞానికి వ్యాఖ్య చెపుతూ తరచు వినిపించే ఒక కథ ఈ సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొనదగినది. పై శ్లోకంలోని భావాన్ని ఆ కథ స్పష్టంచేస్తుంది.

మహాభారతంలో రాజసూయ యజ్ఞం కథ వస్తుంది. దానితోపాటు ఒక ముంగిస ప్రస్తావనకూడా వస్తుంది. శ్రీకృష్ణ భగవానుని సమక్షంలో రాజసూయ యజ్ఞం జరిగింది. యుధిష్ఠిరునితోపాటు పాండవులు ఆ యజ్ఞం జరిపారు. అందరిలో అహంకారం పెచ్చుపెరిగింది. మావల్లనే ఇంతటి మహాయజ్ఞం జరిగందని అందరూ గర్విస్తున్నారు. మేము ఇన్ని దానాలు చేశాము. ఇంతమందికి భోజనాలు పెట్టాము- అని అహంకరిస్తున్నారు.



మనం కూడ 27 అశ్వమేధ యజ్ఞాలు చేశాము. వాజపేయ యజ్ఞం చేశాము. ఇటీవలే తిరుపతిలో అశ్వమేధయజ్ఞం చేశాము. ఒకోసారి మనమూ సంతోషిస్తూ ఉంటాము. మేమే ఇదంతా చేశామని ఏకరువు పెడుతూ ఉంటాము. గురుసత్తా ప్రతాపంవల్ల జరిగిన పనికి ఎవరైనా వ్యక్తిగతంగా అహంకరించడం ఎందుకు? అయినా తరచు అలా జరుగుతూ ఉంటుంది. పాండవుల విషయంలోనూ అదే జరిగింది. ఎక్కడో ఏదో లోపం జరిగి ఉంటుంది; ఈ యజ్ఞం యజ్ఞ భావనతో జరగలేదని స్పష్టంగా కనిపిస్తోంది - అని శ్రీకృష్ణ భగవానునికి అనిపించింది. ఆయన అందరినీ యజ్ఞస్థలానికి తీసుకువెళ్లారు. అక్కడ వారొక విచిత్రమైన దృశ్యం చూచారు.

ఒక ముంగిస ఇటూ అటూ పొర్లుతోంది. దాని శరీరం సగం బంగారు రంగులో ఉంది. సగం మామూలుగా ఉంది. అందరూ ఆ విచిత్ర ప్రాణిని చూస్తున్నారు. అది ఏమిటో, అలా ఎలా జరిగిందో భగవానుని నుండి తెలుసుకోవాలని అందరూ అనుకున్నారు. భగవానుడు ఆ ముంగిసతో దాని భాషలో మాట్లాడారు. ఆ ముంగిస మనుషులకు అర్థమయే భాషలో ఇలా చెప్పింది -

"గతంలో నేనొక మహా యజ్ఞంలో పాల్గొన్నాను. అందువల్ల నా శరీరంలో సగం బంగారు రంగులోకి మారింది. మిగతా శరీరంకూడ బంగారు రంగులోకి మారుతుందనే ఆశతో ఇక్కడికి వచ్చాను. అందుకే ఇలా పొర్లుతున్నాను. కాని ప్రయోజనం లేకపోయింది.''

గతంలో జరిగిన యజ్ఞం గురించి చెప్పమని శ్రీకృష్ణభగవానుడు ఆ విచిత్ర ముంగిసను అడిగారు. అది ఇలా చెప్పింది -

"ఒక బ్రాహ్మణ కుటుంబం అనుష్ఠానం జరుపుతోంది. ఆ ప్రాంతంలో తీవ్రమైన కరవు ఏర్పడింది. తొమ్మిది రోజుల తర్వాత మిగిలి ఉన్న ఆహారాన్ని భుజించాలని బ్రాహ్మణుడు అనుకున్నాడు. అనుష్ఠానానికి భావనాత్మకంగా పూర్ణాహుతి జరిపిన తర్వాత ఆ కుటుంబం భోజనానికి కూర్చున్నది. సరిగా ఆ సమయంలో ఒక చండాలుడు

**సమాజం కోసం సమర్పణ కావాలనే భావన ఉన్నతోన్నత మానవత్వ ఆదర్శం.**

అక్కడికి వచ్చాడు. నాకు ఆకలిగా ఉంది. భోజనం పెట్టండి - అన్నాడు. బ్రాహ్మణుడు తన భోజనాన్ని అతడికి పెట్టాడు. తిన్న తర్వాత అతడు కడుపునిండలేదని అన్నాడు. బ్రాహ్మణుని భార్య తన భోజనాన్ని అతని ముందు ఉంచింది. అది తిన్న తర్వాత అతడు ఇంకా ఆకలిగానే ఉంది - అన్నాడు. ఆ బ్రాహ్మణుని కుమారులు ఇరువురూ తమ భోజనాలను అతని ముందు ఉంచారు. ఇక మీరేమి తింటారు? అని చండాలుడు బ్రాహ్మణుణ్ణి అడిగాడు. మంచినీళ్లు త్రాగి ఉంటాం. భగవదేచ్ఛ ఇదే అనుకుంటాం. అతిథి దేవతను ఆకలితో ఎలా తిరిగివెళ్లనిస్తాం - అని అతడు జవాబు చెప్పాడు. చండాలుడు భోజనం పూర్తి చేశాడు. బ్రాహ్మణునికి కృతజ్ఞత తెలిపాడు. చక్కగా త్రేన్చి తన తృప్తిని ప్రకటించాడు.''

ముంగిస ఆశ్చర్యచకితులైన పాండవులతోపాటు శ్రీకృష్ణునితో ఇలా చెప్పింది - "ఆ చండాలుడు త్రేణుపు త్రేన్చిన స్థలంలో భోజనపు మెతుకులు కొన్ని పడి ఉన్నాయి. నేను వాటిలో దొర్లాను. నా శరీరం సగం బంగారం అయింది.

'నేను మరో దృశ్యం చూచాను. బ్రాహ్మణుడు తన కుటుంబంతోపాటు తన అతిథి అయిన చండాలునికి నమస్కరించడానికి వంగాడు. వంగి లేచేసరికి ఎదురుగా శ్రీమన్నారాయణమూర్తి కానవచ్చాడు. ఆ బ్రాహ్మణ కుటుంబపు యజ్ఞ ప్రవృత్తిని పరీక్షించడానికి భగవానుడు చండాలుని రూపంలో వచ్చాడు.

"ప్రతికూల పరిస్థితులలో సైతం యజ్ఞ భావనను సజీవంగా నిలిపిఉంచుకున్న వ్యక్తి, ఇవ్వాలనే ఆకాంక్ష కలిగిన వ్యక్తి, దృఢమైన భావనలు కలిగిన వ్యక్తి - అతడే నిజమైన దేవత. అలాంటి దేవత ఉన్నచోట కరవు ఉండకూడదు - అని భగవానుడు అన్నాడు. తక్షణం కారు మబ్బులు క్రమ్ముకున్నాయి. కుండపోత వర్షం కురిసింది. కరవు పరిస్థితి తొలగిపోయింది.

"అలాంటి యజ్ఞం మళ్లీ జరగాలని నేను యుగ యుగాలుగా ఎదురుచూస్తున్నాను. నా దురదృష్టం కొద్దీ నేను ఈ మహాయజ్ఞంలోకూడ నా ప్రతీక్ష ఫలించకుండానే, నా సగం శరీరం బంగారం కాకుండానే తిరిగివెళుతున్నాను.''

ఇలా చెప్పి, ముంగిస వెళ్లిపోయింది. మీ మీ ప్రతాపాలు ఎలా ఉన్నాయో చూచుకున్నారా? అని హతప్రభులైన పాండవులను శ్రీకృష్ణ భగవానుడు ప్రశ్నించారు. మొదట యజ్ఞంలోని పరమార్థం తెలుసుకోండి. ఆ తర్వాత మహాయజ్ఞానికి మీరు యజమానులు కాగలుగుతారు - అని వారికి హితవు చెప్పారు. అందరి అహంకారాలూ హరించుకుపోయాయి. అందరూ యజ్ఞమయ జీవనంలోని అంతరార్థాన్ని గుర్తించారు.

"మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీ యం క్రియతే తనుః'' - అని చెపుతోంది శాస్త్రం. అనగా - శ్రేష్ఠతమ యజ్ఞములు, మహాయజ్ఞములు వ్యక్తిని బ్రాహ్మణత్వ పదవిలో కూర్చొనబెడతాయి. బ్రాహ్మణత్వం కులానికీ, వర్ణానికీ సంబంధించినది కాదు. జ్ఞానాన్ని సంపాదించేవాడు, దేవతల పద్ధతిలో జీవించేవాడు బ్రాహ్మణుడు. నాల్గవ అధ్యాయం 13వ శ్లోకంలో భగవానుడు గుణ కర్మ విభాగములను అనుసరించి నాలుగు వర్ణములను ఏర్పరచిన విషయం తెలిపి ఉన్నారు.

## యజ్ఞశేషం పరమ పుణ్యదాయిని

మానవ జాతికీ, సమాజానికీ సేవ రూపంలో చేసే శ్రేష్ఠతమ కర్మయే యజ్ఞం. దాని ఫలితంగా లభించే ఆత్మసంతోషం, కీర్తి, ఐశ్వర్యం మున్నగునవి యజ్ఞ శేషములు. అదే ప్రసాదం. పైన చెప్పబడిన 12 విధముల యజ్ఞముల ఫలితంగా వచ్చే ప్రసాదం. ఈ యజ్ఞాలన్నీ నిష్కామ భావంతో చేయాలి. ఇదే అందుకు షరతు. యజ్ఞశేషం, ప్రసాదం అంటే అర్థం మానసిక శాంతిని ఇచ్చేదీ, తృప్తి ఇచ్చేది అయిన వస్తువు లేక తత్వం. ఈ విధంగా యజ్ఞమయ జీవనం మన వాసనలన్నింటినీ నశింపజేస్తుంది. మనస్సును అనిర్వచనీయమైన శాంతితో నింపుతుంది. నేడు ప్రపంచమంతా వెదుకుతూన్న మనశ్శాంతి యజ్ఞమయ జీవన విధానంద్వారా లభిస్తుంది. వాసనలు క్షయం కాగానే, అంతిమ ఫలితంగా మనకు సమష్టిగత చైతన్యంతో ఏకరూపం అయ్యే సిద్ధికూడ (బ్రహ్మ సనాతనమ్) కలుగుతుంది.

యజ్ఞం చేయనివారికి ఈ లోకం లేనట్లే (నాయం లోకోఽ స్త్యయజ్ఞస్య) ఇక పరలోకం విషయం ఏముంది? (కుతోఽ న్యః) - అని భగవానుడు ఆతర్వాత చెపుతున్నారు. ఈ ఒక్క పంక్తిలో ఎంతో అంతరార్థం ఉంది. భూగోళం అంతటికీ వర్తించే ఒక సత్యం ఉద్ఘాటించబడింది. సమర్పణ భావంతో (యజ్ఞ భావంతో) పని చేయడానికి సిద్ధపడని వ్యక్తికి ఈ లోకంలో నిజమైన ప్రయోజనం, సంతోషకర జీవితం, ప్రసన్నత, తృప్తి లభించదు. మరణించిన తర్వాత శాంతికూడ లభించవు. నిజమైన ప్రసన్నతకూ, సఫల జీవన అనుభూతికీ తాళపుచెవి ఒక్కటే - యజ్ఞ భావంతో ఉద్యమించడం, నిరంతరం కర్మ చేయడం (కుర్వన్నేవేహ కర్మాణి - ఉపనిషత్తు). ఏ సమాజంలో సగటు మనిషి విషయ విలాసాలలో మునిగి ఉంటాడో, ఆలోచనావిహీనుడో, స్వార్థపరుడో, ఆత్యాశపరుడో, భోగ ప్రధానమైన ఆలోచన కలవాడో, ఆ సమాజం ఎన్నడూ ఉన్నతి పొందదు. ఫలించదు. పుష్పించదు. శ్రీకృష్ణుడు స్పష్టంగా చేసిన ప్రకటన ఇది. ఆ సమాజంలో కౌశల్యం కలిగిన పాలకులు, సంఘటనాదక్షులు,

**స్వార్థం, అహంకారం, అజాగ్రత పెరగడం వ్యక్తి పతనానికి కారణం.**

నాయకులు ఉదయించరు. ఆ సమాజానికి ఈ జగత్తులో ఎన్నడూ శాంతి లభించదు - పరిశ్రమలు ఎంతగా పెరిగినా, ఆధునికీకరణ, యంత్రీకరణ ఎంతగా పెరిగినా.

## భోగం కాదు, త్యాగం

నేటి పరిస్థితిపై ఎంత అందమైన సమీక్ష ఈ శ్లోకం! బాహ్య సుఖాలలో శాంతి లేదు. వాటిలో భోగవాదం ఉంది. అసంతృప్తి ఉంది. తృష్ణ ఉంది. అశాంతి ఉంది. నేడు మానవ సమాజమంతా మానసిక ఒత్తిడి (స్ట్రెస్) అనే మహావ్యాధితో బాధపడుతోంది. వ్యక్తులు పైకి ఆరోగ్యంగానే కనబడతారు. లోపల మాత్రం ఏడుపు, బోలు, ఒత్తిడి. ఏదో తెలియని భయం మనందరినీ పీడిస్తోంది. భౌతిక జగత్తులో ఎన్నెన్నో సాఫల్యాలు సాధించవచ్చు. ఆత్మిక జగత్తు ఎండిపోయి ఎడారిలా తయారయింది. కారణం యజ్ఞభావ రహితంగా చేసిన కర్మయే. ఒక జాతి పునర్నిర్మాణం జరగాలంటే - జీవించే విధానాన్ని మార్చాలి. భోగమయ జీవితాన్ని మార్చాలి. త్యాగాన్ని జీవితంలో ప్రతిష్ఠించాలి. జాగరూకమూ, కార్యశీలమూ ఒకప్పుడు జగద్గురువుగా వెలుగొందినదీ అయిన భారతవర్షం సాంస్కృతికంగా నేటికీ బానిసత్వంలోనే ఉంది. పూర్తిగా భ్రష్టం అయింది. దాని కార్యకుశలతకు తుప్పుపట్టింది. ఎందువల్ల? యజ్ఞమయ జీవనాన్ని ఉపేక్షించడంవల్ల. యజ్ఞంకోసం, అనగా పరమార్థంకోసం చేసే సత్కర్మలను ఉపేక్షించడం వల్ల. ఏకాకులుగా, స్వార్థపరులుగా జీవించే విధానాన్ని అనుసరించడం వల్ల. జీవితంలో సుఖ శాంతులనూ - సంతోషాన్నీ పొందాలంటే జీవితంలో యజ్ఞానికి స్థానం ఇవ్వాలి, లేని పక్షంలో - జన్మజన్మాంతరాల వరకు అసంతృప్తి, వాసనలు అనే బంధనాలలో చిక్కుకుపోతారు. నేటి యువతరానికి భగవద్గీత ఇచ్చే సందేశం ఇది. **"తేన త్యక్తేన భుంజీ థా"** (ఈశావాస్యోపనిషత్తు) అనే సూత్రాన్ని పాటించి జీవితంలో త్యాగాన్ని ప్రతిష్ఠించాలి. పాశ్చాత్య దేశాలవైపు చూస్తున్న మధ్యతరగతి ప్రజలు, కంప్యూటర్ యుగంలో జీవిస్తూన్న నేటి తరంవారు నిజంగా భోగంలోని ఆనందాన్ని పొందాలంటే, మానసిక శాంతి అనుభవించాలంటే - తమ జీవన విధానాన్ని ఆమూలాగ్రం మార్చుకోవాలి. ఇక్కడ భగవద్గీత ఇచ్చే సందేశం ఇదే.

పరమపూజ్య గురుదేవులు యజ్ఞ విజ్ఞానానికి తిరిగి ప్రతిష్ఠ కల్పించారు. యజ్ఞాన్ని ఒక దర్శనంగా స్థాపన చేశారు. వేలాది సంవత్సరాల అంధకార యుగంలో, బుద్ధుని, శంకరాచార్యుల ఆగమనం జరిగినప్పటికీ, యజ్ఞం ఒక మొక్కుబడిగా, నిర్జీవమైన కర్మకాండగా మిగిలిపోయింది. యజ్ఞం అనే పదం అర్థాన్నే మార్చివేశారు. భారతీయ సంస్కృతికి తండ్రిగా పరిగణించబడే యజ్ఞానికి పరమపూజ్య గురుదేవులు ప్రజల చింతనలో, నిత్య జీవితంలో, ఉపాసనలో స్థానం కల్పించారు. కృతయుగ వాతావరణాన్ని నిర్మాణంచేసే లక్ష్యంతో. వారి జీవితంలో ఆదినుండి అంతంవరకు, వారి మహా ప్రయాణం తర్వాత జరుగుతూన్న దేవసంస్కృతి దిగ్విజయ పరాక్రమం వరకు - అన్నింటిలో యజ్ఞ దర్శనం ఇమిడి ఉంది. అగ్నిని అధ్యాపకులుగా పూజ్యవరులు మనకు అందించారు. అగ్నిహోత్రం అర్థాన్ని సామాన్య ప్రజానీకానికి బోధపరచారు. అగ్నిహోత్రమే యజ్ఞం కాదు. యజ్ఞానికి విస్తృతమైన అర్థం ఉంది. యజ్ఞంపేరిట సకామ యజ్ఞములు, పండావాదం, దోపిడీ సాగుతూన్న సమయంలో వారు గాయత్రీ యజ్ఞ విధానం, యజ్ఞ విజ్ఞానంవంటి గ్రంథమాలలను రచించారు.

## యజ్ఞం ఒక దర్శనం

వారు అఖండజ్యోతి పత్రికలో ఇలా వ్రాశారు - "ఏవిధంగా అగ్ని యజ్ఞకుండంలో జ్వలిస్తుందో, ఆవిధంగా యజ్ఞాగ్ని అంతఃకరణంలో, తపఅగ్ని ఇంద్రియాలలో, కర్మ అగ్ని దేహంలో జ్వలిస్తూ ఉండాలి. ఇదే యజ్ఞం ఆధ్యాత్మిక స్వరూపం. తన సంకుచితత్వాన్ని, అహంకారాన్ని, స్వార్థపరత్వాన్ని ఈ దివ్య అగ్నిలో హోమంచేసే వ్యక్తి అందుకు ప్రతిఫలంగా నరత్వం నుండి నారాయణత్వాన్ని పొందుతాడు." (1981 ఏప్రిల్, 49వ పుట). యజ్ఞం విశ్వంలోని సర్వోత్కృష్టమైన దర్శనమని చెపుతూ వారిలా వ్రాశారు - "యజ్ఞంలో ఇమిడి ఉన్న భావన, ప్రేరణలు సిద్ధాంతాల సంస్కరణకూ, ఆదర్శాల ప్రతిష్ఠాపనకూ శక్తివంతమైన మాధ్యమాలు. ఇందులో ఇమిడిఉన్న ఆలోచనా ప్రవాహంలో మనిషిని శ్రేష్ఠుడుగా, ఉదారుడుగా, ఉదాత్త స్వభావం కలిగినవాడుగా చేసే తత్వాలన్నీ ఉన్నాయి. యజ్ఞ దర్శనం వివాదరహితమైనది, తేలికగా అర్థమయ్యేది. (అఖండజ్యోతి, సెప్టెంబరు 1981, 47వ పుట). వారిలా వ్రాశారు - "దానం, దేవ పూజ, సంగతీకరణం (ఏకం కావడం)లతో కూడిన యజ్ఞ దర్శనం మనిషిని ఉదారునిగా, ఉదాత్తచరితునిగా చేసే సామర్థ్యం కలిగినట్టిది. ఈ మూడు సిద్ధాంతాలలో మానవ వికాసానికి అనంతమైన అవకాశాలు ఇమిడి ఉన్నాయి." (పై పత్రిక 49వ పుట).

కృష్ణ భగవానుడు ఇలాగే యజ్ఞం ప్రాశస్త్యాన్ని తెలుపుతూ - యజ్ఞం విశ్వంయొక్క పాలనా నియమావళి అన్నారు. యజ్ఞం లేనిదే జీవనమే లేదు, పారలౌకిక జీవనంలో లభించేది ఏదీ లేదు - అన్నారు. లోకంలో ఆధిపత్యమూ లభించదు, పరలోకంలో స్వర్గమూ లభించదు - అన్నారు.

Ð(Ç¬¡°ÆòKÓ‹ŒH.Õ)

**వ్యక్తిత్వ గరిమ ప్రతిభ, పదవి, వైభవాలపై కాక - ఆంతరిక ఔన్నత్యంపై ఆధారపడి ఉంటుంది.**

## సూర్య విజ్ఞానం

# జీవన విద్యకు గురువు సూర్యుడు

సూర్యుడు వెలుగును, వేడిమిని, శక్తిని పైకి కనిపించేటట్లు మన కందిస్తాడు. ఇంతకన్న విశేషమైన కానుకలను మనకు అదృశ్యంగా ప్రసాదిస్తాడు. ప్రేరణ రూపంలో అంతఃకరణలో గ్రహణ శీలత తగినంతగా పెరిగితే ఆ విషయం అర్థ మవుతుంది. సూర్యుడు కేవలం ప్రాణదాత మాత్రమే కాదు. ఏ విధంగా జీవించాలి అనే విషయాన్ని మనకు నేర్పే గురువు గూడా. సౌరమండలం మీద, తత్సంబంధమైన గ్రహ నక్షత్రాల మీద, వాటి గతిమీద మనం దృష్టి సారిస్తే విశ్వ విశాలత్వమేగాక, ఆ విశ్వనిర్మాత గొప్పతనం గూడా తెలుస్తుంది. మనం ఏవిధంగా జీవితాన్ని గడపాలనే రీతి, నీతి అవగతమవుతాయి.

సమస్త గ్రహ నక్షత్రములు సదా క్రియాశీలంగా ఉంటాయి. ఆ గతిశీలతపైనే వాని మనుగడ ఆధారపడి ఉంటుంది. అవి తమ పరిధిలో తిరుగాడుతూ ఉంటాయి. దానితో పాటు కేంద్రం మీద ధ్యానం ఉంచి, దానితో సంబంధం కలిగి ఉంటాయి. తమకు శక్తి నందించే, తమకు సంరక్షణను, సుస్థిరత్వాన్ని అందించే కేంద్రవైన సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తాయి.

ఈ ప్రక్రియను జాగ్రత్తగా గమనిస్తే, పరమనియంత ఇచ్ఛ మనకు కొంచెం అర్థమవుతుంది. అప్పుడు మనం ఆనందంతో ఆయన అనుశాసనం ప్రకారం నడుచుకునేటందుకు సంసిద్ధులం కాగలుగుతాము. గ్రహాలు, ఉపగ్రహాలూ తమ కక్ష్యలో పరిభ్రమణం చేస్తుంటాయి. వ్యక్తిగత జీవన సువ్యవస్థ, ఆలోచన, నియమపాలన, క్రమబద్ధత వీటన్నిటినీ గ్రహాల, ఉపగ్రహాల గతితప్పని పరిభ్రమణాన్ని గమనించి నేర్చుకోవాలి. ఆవిధంగా అవి నడుచుకోకపోతే వాటి గతి దుర్గతియేగదా! మనుష్యుని విషయంలోగూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. అతడు సోమరితనంతో, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తే, పరమేశ్వరుని ఇచ్ఛను ఉల్లంఘించితే దానికి తగిన దండనను అనుభవించి తీరవలసినదే. క్షుద్ర గ్రహకీటకముల (ASTEROIDS) శృంఖల గూడా ఈ బ్రహ్మాండంలో తిరుగాడుతూ ఉంటుంది. తన గతిని ఉల్లంఘించినప్పుడు అది తన అస్తిత్వాన్నే కోలుపోతుంది.

మనం మన పరిధిలో నియమిత రూపంలో క్రమశిక్షణతో ప్రవర్తించడమేగాకుండా, సమాజం అనే కేంద్ర బిందువు యెడల గూడా మన ప్రవర్తనను సవ్యంగా ఉంచుకోవాలి. సూర్యుని చుట్టూ గ్రహ నక్షత్రాలు గతి తప్పకుండా పరిభ్రమిస్తున్నట్లుగానే, సమాజం యెడ తన కర్తవ్యాన్ని పరిపాలిస్తూ మనుష్యుడు మెలకువగా, చురుకుగా ప్రవర్తించాలి. సౌరమండలంలోని గ్రహాలన్నీ సూర్యుని వద్ద నుండి కొద్దిగానో గొప్పగానో ప్రయోజనం పొందుతున్నాయి. అది ఆగిపోతే, అవి మృతస్థితికి చేరుకుంటాయి. సమాజం నుండి మనం పొందుతున్నది ఆగిపోతే మన గతీ అంతే. మన మనుగడకే ప్రమాదం సంభవిస్తుంది. సుఖములు, సదుపాయాలూ ఏకాకిగా అనుభవించడానికి ఉద్దేశింపబడలేదు. సమాజ సహకారంతో మాత్రమే వ్యక్తి సుఖ, సౌభాగ్యాలు వికసితమవటం సాధ్యం. సమాజము నుండి మనం పొందిన దానికి బదులు తీర్చుకోవడానికి, సమాజానికి మనం ఇవ్వవలసింది ఇవ్వాలి. సౌరమండల సహకారం లేకపోతే, సూర్యుని మనుగడకు కూడా ప్రమాదం వాటిల్లవచ్చు. అందువలన నియమిత రూపంలో గ్రహములు సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూ తమ శక్తిని సామర్థ్యాలను పొందుతూ ఉంటే, సూర్యుడు తన దానాన్ని గ్రహములకు అందిస్తూ ఉంటాడు. పాలన, పోషణల విషయం చూచుకుంటాడు. ఈ అన్యోన్యాశ్రయ ప్రక్రియయే సౌరమండల స్థిరత్వానికి వెన్నెముక. అది విరిగిపోతే, ఈ సుందర సౌర పరివారం తన అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

వ్యక్తికీ, సమాజానికీ మధ్య గూడా ఇటువంటి సుదృఢమైన విధి, వ్యవస్థ నడుస్తూ ఉండాలి. సమాజపు మూస వ్యక్తులను వికసింపగలిగే రీతిలో ఉండాలి. అప్పుడు వ్యక్తి సమాజాన్ని తీక్షణంగా, శక్తివంతంగా ఉంచడంలో తన సహకారాన్ని అందిస్తాడు. సౌరమండలంలో గల సువ్యవస్థ సమాజ సంఘటనలో ఉండితీరాలి.

ఇందులో అందరి సౌభాగ్యాన్నీ మనం దృష్టిలో ఉంచుకోవాలి. క్షుద్రమైన క్రిమి కీటకాదుల రీతిలో జీవించడం కాదు, జీవితాన్ని అమృతోపమం చేసుకోవాలి. ఇతర గ్రహ

**మరో వ్యక్తి లోపాల వల్ల జరిగిన హానిని చూసి తన లోపాలను సవరించుకునే వాడు విజ్ఞుడు.**

గోళాలలో లేని సాధన సంపత్తి మన గ్రహంపై ఉన్నందుకు మన అదృష్టానికి మనం గర్వపడుతూ సక్రమంగా జీవించడం నేర్చుకోవాలి. అందరి సౌభాగ్యానికీ బాధ్యత మన అందరిపైనా ఉన్నది. అప్పుడు మనను సృష్టించిన పరమాత్మ వాంఛ నెరవేరుతుంది.

వైజ్ఞానికులు సౌరమండల స్థితిని అధ్యయనం చేసి, భూమికీ, సూర్యునికీ మధ్యగల దూరం తొమ్మిది కోట్ల ఇరవై ఐదు లక్షల మైళ్లుగా అంచనా వేశారు. ఒక మనిషి వేరేదీ చేయకుండా అదే పనిగా నిమిషానికి వంద లెక్కిస్తూ ఉంటే 9 1/4 కోట్లు లెక్కపెట్టడానికి పదకొండు నెలలు పడుతుంది. సూర్యుని వ్యాసం భూమి వ్యాసం కంటే 109 రెట్లు ఎక్కువ. సూర్యుని ఘన పరిమాణం 109 x 109 x 109 రెట్లు. పదమూడు లక్షల భూగోళాలను కలిపితే ఒక సూర్య గోళంతో సమానమవుతుంది.

సూర్యుని ఆకర్షణ శక్తితో 7900మైళ్ల వ్యాసంగల భూగోళం తనచుట్టూ తాను తిరుగుతుంది. 23 గంటల 56 నిమిషాలలో తన చుట్టూ తాను ఒకసారి తిరుగుతుంది. అందువల్లనే పగలు, రాత్రి ఏర్పడతాయి. మనం భూమి మీద నివసిస్తూ ఉండటం వల్ల భూమి పరిభ్రమణం మనకు కనిపించదు. అందువలననే కనిపించేది మాత్రమే నిజం కాదు. వివేక, వివేచన గీటు రాళ్లతో సిద్ధాంతాల మేలిమిని స్వీకరించాలి.

ప్రపంచమందలి ప్రతి అణువూ గతిశీలంగా ఉన్నది. భూమి తనచుట్టూ తాను తిరగడంతోనే సంతృప్తి చెందటం లేదు. సూర్యుని గురుత్వాకర్షణ శక్తితో బంధింపబడి తనచుట్టూ తాను నర్తిస్తూ సుర్యుని చుట్టూ తిరుగుతున్నది. ఒకసారి సూర్యుని చుట్టూ రావడానికి 365 1/4 దినములు పడుతుంది. దినంలో 1/4 భాగం ఎక్కువ పడుతుండటాన 4 సంవత్సరాల కొకసారి లీపు సంవత్సరం వచ్చి అందులో 366 రోజులు ఉంటాయి.

సూర్యునికి అతి సమీపంలో ఉన్న అతిచిన్న గ్రహం బుధుడు. దాని వ్యాసం 3000 మైళ్లు మాత్రమే. బుధగ్రహం సూర్యునికి 3 కోట్ల 60 లక్షల మైళ్ల దూరంలో సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నది. అంటే బుధగ్రహం తనచుట్టూ తాను తిరగడానికి 88 రోజులు పడుతుంది. అంటే బుధగ్రహంలో పగలు భూమి మీద 44 రోజులతో సమానం. రాత్రి 44 రోజులతో సమానం. మన భూమి మీద పరిస్థితులనేగాక ఇతర గ్రహాలలోని పరిస్థితులను గమనిస్తేగాని సృష్టి వైచిత్ర్యం అర్థం కాదు.

బుధుని వలెనే శుక్రుడు గూడా అంతర్గ్రహమే. అంతర్గ్రహం అంటే భూమికీ, సూర్యునికీ మధ్య ఉండే గ్రహం. శుక్రుడు గూడా గతిశీలమైన పిండమే. శుక్రగ్రహం తనచుట్టూ తాను తిరగడానికి 30 రోజులు, సూర్యుని ప్రదక్షిణం చేయడానికి 225 రోజులు పడుతుంది. ఆలోచించిచూస్తే ఆశ్చర్యజనకంగా భయానకంగా ఉంటుంది. అక్కడ పగలు 112.5 రోజులు, రాత్రి 112.5 రోజులు. దీనిని బట్టి చూస్తే, మన మనుగడ కొరకు భగవంతుడు భూమి మీద ఎంతటి అహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాడో అర్థమవుతుంది.

ఇప్పుడు కొంచెం ఆవలి వేపు పయనించి చూస్తే, భూమికి 4 కోట్ల 90 లక్షల మైళ్ల దూరంలో కుజగ్రహం ఉన్నది. అది తన చుట్టూ తాను తిరగడానికి 24 గంటల 37 నిమిషాలు పడుతుంది. అంటే అక్కడి పగలు, రాత్రి దాదాపు భూమితో సమానంగా ఉంటాయి.

కుజగ్రహం సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయటానికి 687 రోజులు పడుతుంది. దాని తరువాత బృహస్పతి (గురు)గ్రహం ఉన్నది. అది దాదాపుగా భూమికి వెయ్యిరెట్టుల పెద్దది. సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయడానికి గురుగ్రహానికి 12 సంవత్సరాలు పడుతుంది. అంటే ఆ గ్రహంలో 4 సంవత్సరాలు వేసవి, 4 సంవత్సరాలు అతిశీతలం, 4 సంవత్సరాలు సామాన్య వాతావరణం ఉంటుంది.

అంతటి భారీ గ్రహమైన గురువు తన చుట్టూ తాను తిరగడానికి 9 గంటల 50 నిమిషాలు మాత్రమే పడుతుంది. అంటే పగలు 4 గంటల 55 నిమిషాలు మాత్రమే. ఇంకా విచిత్రం- అంత చిన్న రాత్రిలో 12 గురు చంద్రులు ఒక్కసారిగా వెన్నెల కాస్తారు.

శనిని చెడు గ్రహంగా భావిస్తారు. కాని అది వాస్తవం కాదు. కాని అది సార్వభౌమిక నియమాలను పాలించడం మాత్రమే చేస్తుంది. తన చుట్టూ తాను తిరగడానికి 10 గంటల 14 ని.లు పడుతుంది. సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయడానికి 29 1/2 సంవత్సరాలు పడుతుంది. యురేనస్ తన చుట్టూ

**ఏకత, ఆత్మీయత, సమత, మమతలు మానవత్వ ఆదర్శాలు.**

తాను తిరగడానికి 10 గంటల 48 ని॥లు పడితే సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయడానికి 84 సంవత్సరాలు పడుతుంది. నెప్ట్యూన్ తనచుట్టూ తాను తిరగటానికి 15 గంటల 48 ని. పడితే సూర్యుని చుట్టూ ప్రదక్షిణ చేయడానికి 165 సంవత్సరాలు పడుతుంది. ప్లూటో తన చుట్టూ తాను తిరగడానికి 6 1/2 రోజులు పడుతుంది. సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేయడానికి 248 సంవత్సరాలు పడుతుంది.

మహా సౌరమండలంలో మరికొన్ని క్షుద్ర గ్రహాలు గూడా కనిపిస్తూ ఉంటాయి. కొన్ని కక్ష్యలను మరికొన్ని గతిని మార్చుకుంటూ ఉంటాయి. అందువల్ల, ఈ అతిక్రమణ వల్ల అవి పొందే లబ్ధి ఏమిటి? అస్తవ్యస్తంగా, వ్యవస్థారహితంగా తయారవుతాయి. ఎగతాళి చేయబడి క్షుద్రంగా పరిగణించబడతాయి. ప్రకృతికి వ్యతిరేకంగా నడవడం వల్ల అవి నష్టపోవడమేగాక ఇతరులకు కూడా కష్టం గలిగిస్తాయి. అవి తప్పుకుపోవడానికి గూడా పరిమితి ఉంటుంది. మహత్వాన్ని కోల్పోయి, క్షుద్రత్వాన్ని పొందుతాయి. అదే విధంగా మానవుడు ప్రకృతి నియమాల నుల్లంఘిస్తే మహత్వాన్ని కోలుపోయి, క్షుద్రతనే పొందుతాడు. దుర్దశలో పడతాడు.

ఖగోళశాస్త్రజ్ఞులు ఈ క్షుద్ర గ్రహాలకు పేర్లు పెట్టకుండా నంబర్లు మాత్రమే ఇచ్చారు. ఇవి వస్తుతః చంచలమైనవి. 133వ నంబరు క్షుద్రగ్రహం ఈరాన్ అనేది కొన్ని కోట్ల మైళ్ల దూరంలో తిరుగుతూ భూమికి 2 1/2 కోట్ల మైళ్ల దూరానికి వచ్చింది. 1566 నంబరు గ్రహాలు 1968లో భూమికి దాపునకు వచ్చి ఢీకొనబోయినాయి. ఇవి కొన్ని సూర్యునికి, బుధునికి మధ్యగల అత్యుష్ణ ప్రదేశంలోనికి గూడా ప్రవేశించాయి.

హెర్మెస్ అనే గ్రహంగూడా 1937లో భూగ్రహ వాసులకు భయం కలిగించేటంత దగ్గరకు వచ్చింది. అది ఏమై పోయిందో తెలియదు. సూర్యుడు తనచుట్టూ తాను తిరుగుతూ, తన గ్రహాల నన్నిటినీ సంరక్షిస్తాడు. ఒక్క సూర్యుడే గాదు, బ్రహ్మాండ మండలి ప్రతిపిండమూ గతిశీలమే.

సమస్త సృష్టి ఒక కేంద్రం నుండి ఉద్భవించింది. అది విరాట్ బ్రహ్మాండానికి నాభి. విరాట్ చేతన దాని అంశమే. ఆ సార్వభౌమిక దివ్యచేతనను దర్శించడమే ధ్యేయంగా నిర్జీవ గ్రహాలన్నీ ప్రవర్తిస్తుంటే మానవీయ చేతన ఎందుకు ఆ ప్రయత్నం చేయడం లేదు?

ఆకాశంలోగల సూర్యుడు, సౌర కుటుంబమూ, ఆకాశమునకు శోభ చేకూర్చడం మాత్రమే గాక, జీవన విద్య శిక్షణను గూడ ఇస్తున్నాడు. సూర్యుని ఆధ్యాత్మిక మహత్వాన్ని గ్రహించలేకపోయినా, అతడి ప్రత్యక్ష గతివిధులను బట్టి, జీవితాన్ని సువ్యవస్థితం చేసుకోవడం నేర్చుకోవచ్చు. సూర్యుడు బ్రహ్మాండమునకు అధిపతి. అందువల్లనే గ్రహ, నక్షత్రాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. ఎవరైనా గ్రూపు లీడరుకు, జనసామాన్యానికి మార్గదర్శనము నిచ్చే సృజేత స్థాయి వ్యక్తికి ఏ లక్షణాలు ఉండాలో సూర్య భగవానుని కార్యకలాపాల నుండి నేర్చుకోవాలి. అట్టి శిక్షణ పొందిననాడు మనం, సూర్యభగవానునివలె మన జీవితాన్ని సఫలం చేసికొని కీర్తి, ప్రతిష్టలను పొందవచ్చు.

L L L

## సంబంధం తెగితే .....

ఒక గ్రద్ద ఆకాశంలో చాలా ఎత్తున ఎగురుతోంది. ఒక గాలిపటం కూడా ఎగిరి ఎగిరి చాలా ఎత్తుకు చేరుకొన్నది. ప్రక్కగా ఎగిరే గ్రద్దను చూచి ఇది స్వతంత్రంగా ఎగురుతోంది. నేను మాత్రం ఒకరి చేతిలో బంధించబడ్డాను. ఇలా ఎందుకు జరగాలి. నేను గ్రద్దలాగే స్వతంత్రంగా ఎగరటం బాగుంటుందని అనుకొని క్షణికమైన భావావేశంలో తనను తాను దారం నుండి వేరుచేసుకొన్నది. మూలాధారాన్ని కోల్పోవటం వలన అది పల్టీలు కొట్టి మరుక్షణమే నేల కూలింది.

వ్యక్తి జీవిత విధానం కూడా గాలిపటం లాంటిదే. ఎవరో ఏదో విచ్చలవిడిగా విర్రవీగుతున్నారని మనం వారిలాగే ఎందు కుండకూడదని భావించి సాధన, సత్సంగం, స్వాధ్యాయం వంటి మూలాధారాలను విడనాడితే భగవంతునితో సంబంధం తెగి జన్మజన్మల వరకు పల్టీలు కొట్టక తప్పదు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**కర్తవ్య బుద్ధి పెంచుకుంటే సద్గుణాలు వికసిస్తాయి.**

## సాధన విజ్ఞానం

# పాత్రతను పెంచుకోండి - సిద్ధులను అందుకోండి

జీవితంలో సాధన అనునది ఎంత సామర్థవంతమైనది అంటే - సామాన్య శ్రమతో కూడిన ఏకాగ్రతలో నిమగ్నమగుట ద్వారా అది అసామాన్య మహత్తులను, శక్తులను ఉద్భవింపచేయగలదు. సాధారణ స్థితిలో ప్రతివస్తువు తుచ్ఛంగా, అల్పంగా కానవస్తుంది. కాని వాటిని ఉత్కృష్టం చేసినట్లయితే, వాటి సూక్ష్మతను లోతుగా పరిశీలించగలిగితే వాటి విశిష్టత, మహత్తు అనుభవంలోనికి వస్తాయి. పైన కనిపిస్తున్న దానిమీద ఆధారపడితే సముద్రంలో ఉప్పునీరు తప్ప మరేమీ ఉండదు. కాని లోపలికి పోయి లోతుగా పరిశీలించిన వారికి అది రత్నాకరునిగా దర్శనమిస్తుంది. సమస్త భూమండలానికీ సుఖాన్నీ, జీవితాన్నీ ప్రసాదించేదిగా ప్రకటితమవుతుంది. నిజానికి రెండు విషయాలూ సత్యమైనవే. వృధాగా ఎంతో భూమిని ఆక్రమించి ఉన్న పైకికనపడే ఉప్పునీటి ప్రవాహం. దాని లోతుల్లో నిగూఢంగా దాగి ఉన్న అమూల్య సంపద. ధూళికణాలు ఎందుకూ పనికిరానట్లు కనపడతాయి. కాని వాటినుండి ప్రచండ అణుశక్తి వెలువడినప్పుడు ప్రపంచమంతా ఆశ్చర్యంతో విస్మయమవుతుంది. కనుక దేనినైనా స్థూలం నుండి సూక్ష్మం లోనికి ఎంత లోతుగా పరిశీలిస్తే అంతే స్థాయిలో సత్యాలు వెల్లడి అవుతాయి.

స్థూల దృష్టికి జీవితం ఒక ఆటగా అనిపిస్తుంది. దాన్ని ఎలాగోలా లెక్కలేకుండా గడిపేస్తాము. అవసరాలు తీర్చుకోడంలో, సమస్యలను పరిష్కరించుకోడంలో ప్రతికూలతలను అనుకూలం చేసుకోడంలో క్రిందా మీదా పడుతూ ఉండగానే జీవితం ముగిసిపోతుంది. కష్టాలనుండి, లోటుపాట్లనుండి తప్పించుకోలేక పోతుంటాము. అనేక సార్లు జీవితం భరించలేనంత భారంగా తయారవుతుంది. ఫలితంగా ప్రయత్న పూర్వకంగా కాని అప్రయత్నంగా కాని అకాలమృత్యువు నోటికి ఆహారం కావలసి వస్తుంది. నిస్సారం, నిరర్థకం అయిన జీవితం గడపవలసి రావడం పెద్ద శాపం. దీన్ని దురదృష్ట రూపంలోనే స్వీకరించవలసివస్తుంది. ఎందుకు పుట్టామో ఎందుకు బ్రతుకుతున్నామో తెలియకుండా ఉంటుంది. మామూలుగా అయితే జీవిత సారం ఇదే. విపరీత పరిస్థితులలో అయితే ఇతర ప్రాణులకంటె నికృష్టంగా ఉంటుందని చెప్పక తప్పదు. ఇక ప్రత్యేకత కలిగిన జీవితాలగురించి చెప్పేదేముంది! సఫలుడు, సమర్థుడు అయి, సమున్నత స్థాయిగల వ్యక్తి అదృష్టశాలిగా కొనియాడబడతాడు. ప్రతివారికీ అలాటి స్థితి పొందాలన్న ఆశ కలుగుతుంది. ప్రాచీన కాలంలోగాని ఈకాలంలోగాని- భౌతిక గౌరవ మర్యాదలతో తులతూగుతున్నవారికి, ఆత్మసంబంధమైన విభూతులతో అలరారుతున్నవారికి కొరత లేదు.

అదృష్టవంతులకు, దురదృష్టవంతులకు మధ్య ఉన్న అంతరం చూస్తుంటే- ఒకేవిధమైన అవయవాలతో జన్మించిన మనుషుల పరిస్థితులలో ఇలా వ్యత్యాసాలు ఉండడానికి కారణమేమిటా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఇది సృష్టికర్త పక్షపాతబుద్ధి అనో ప్రకృతి మాయ అనో అంటే సరిపోదు. ఎందుకంటే, ఈ రెండు రకాలైన మనుషుల నిర్మాణంలోగాని, యోజనలోగాని, సత్తాలోగాని ఎటువంటి మాయోపాయం, తేడా ఉండే అవకాశం లేదుగాక లేదు. సృష్టిక్రమంలో అటువంటి అవ్యవస్థ ఉన్నట్లయితే గ్రహాలు, నక్షత్రాలు గతులు తప్పేవి. పంచభూతాలు, ఋతువులు మొదలైనవి విశృంఖలంగా సంచరించి పరస్పరం ఢీకొంటూ ప్రళయానికి నాంది పలికేవి. కనుక సృష్టిక్రమంలో లోపం లేదన్నది నిర్వివాదాంశం.

మనిషికి మనిషికి మధ్య ఆకాశమునకు భూమికి ఉన్నంత తేడాకు కనపడే కారణం ఏమంటే- జీవితపు పై భాగం వరకే సరిపెట్టుకునే బద్ధకస్తులకు పై పొర మాత్రమే అందుతుంది. కాని ఎవరైతే దానిని లోతుగా అన్వేషిస్తారో వారికి ఒకదాని తర్వాత ఒకటిగా అమూల్యమైన లాభాలు చేకూరుతుంటాయి. ఇలా లోతుగా అన్వేషించడాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో "సాధన" అని అంటారు. సాధన ఎందుకు? ఈ ప్రశ్నకు ఒకేఒక్క నిశ్చితమైన సమాధానం "జీవితానికి" అని. జీవితం కోరుకున్న వరాలిచ్చే కల్పతరువు. ఎవరైనాసరే దానిని ఎంత చక్కగా ఉపయోగించుకుంటే అంతే స్థాయిలో ధన్యత పొందుతారు. వారిపెదవులపై సదా సర్వదా చిరునవ్వుల పువ్వులు విరబూస్తుంటాయి. సృష్టికర్త బీజరూపంలో వైభవపు అపరిమిత భాండాగారాన్ని ఈ మానవ శరీరంలో అమర్చిపెట్టాడు. మనం చేసే పొరపాటు దీన్ని వెతికి పట్టుకోలేకపోవడం, ఉపయోగించలేకపోవడం. ఈ పొరపాటుకు ప్రాయశ్చిత్తం

**నీతి నిజాయితీలు, సౌశీల్యం కలిగిన వ్యక్తుల వల్ల జాతి, చరిత్ర ధన్యమవుతాయి.**

ఆత్మజ్ఞానాన్ని పొందడం. ఈ ఆత్మజ్ఞానం జాగృతమయి క్రియారూపం దాల్చినట్లయితే ఆత్మోన్నతి లక్షణం తక్షణమే గోచరిస్తుంది. ఈ ఆత్మసంస్కరణ పేరే సాధన.

సాధన వలన సిద్ధి కలిగే మాట నూటికి నూరు శాతం సత్యం. భౌతిక జగత్తులో వివిధ రంగాలలో సాధనా తత్పరుడైన పురుషుడు అద్భుతమైన విజయాలను పొందటం చూస్తున్నాం. జీవితం విలక్షణమైన కార్యక్షేత్రం. జడ జగత్తులోని శక్తులు పరిమితమైనవి. కేవలం సాధనాలు మాత్రం పొందగలుగుతాం. కాని చేతనా జగత్తులోని శక్తులు అపరిమితమైనవి. దానిలో ఆనందం, ఉల్లాసాల భాండారం నిండి ఉంటుంది. వీటికి సంబంధించిన సాధన ఒక విస్తృత విజ్ఞానం.

సాధనకు సంబంధించిన ఈ అభ్యాసాలను పైపైన చూచినట్లయితే, మనం కోరికలు కోరుకోడం, అవి నెరవేరడం ఇదంతా ఎక్కడో వెలుపలినుండి జరుగుతున్న కార్యం అన్న భ్రాంతి కలుగుతుంది. సాధన అంటే అర్హతను పొందగలగడం. ఇదే సాధనకు సంబంధించిన తత్వదర్శనం. దీనికోసం జీవితంలో బాహ్యంగా, అంతరంగికంగా వ్యక్తి తననుతాను సంస్కరించుకొన వలసి ఉంటుంది. సంస్కారమును యోగమని, నియమపాలనను తపమని అంటారు. ఇవి సాధనకు సంబంధించిన రెండు రంగాలు. బాహ్యంగా సభ్యత, మర్యాదలకు కట్టుబడి ఉంటూ అంతఃశుద్ధికై ఎంతో కృషి చేయవలసి ఉంటుంది. సర్కస్‌లో పనిచేసే జంతువులకు కొన్ని అంశాలలో ఎటువంటి శిక్షణ నిస్తారంటే- వాటి నైపుణ్యం చూసి అబ్బురపడిపోతాము. ఇదే ప్రక్రియను కుదురుగా ఉండజాలని చంచలమైన మనసును, నియమపాలనలేని జీవితాన్ని క్రమబద్ధీకరించడానికి అమలుచేయవలసి ఉంటుంది. సాధనలోని సమస్త నియమ నిబంధనలు ఈ మహ లక్ష్యం కొరకే నిర్దేశింపబడ్డాయి.

సామాన్యుల నమ్మిక- సిద్ధులు దైవానుగ్రహంతో లభిస్తాయనీ, సాధన అనే క్రియ దీని కొరకు చేసే ప్రార్థన అని. ఈ భావం కొంతవరకే సత్యం. దుకాణదారుడు ఏ వస్తువు అడిగినా తీసి చూపిస్తాడు. కాని దాని ధర చెల్లించినప్పుడు మాత్రమే దానిని మనపరం చేస్తాడు. అలాగే ప్రార్థనను మన కోరిక వ్యక్తీకరించే చర్య అని అనవచ్చు. కాని దానిని యాచన అని అనడం గొప్ప తప్పు. యాచన అంటే ధర చెల్లించకుండానే విలువైన వస్తువును పొందడం కోసం ప్రాధేయ పడడం. ఇందువల్ల చెప్పుకొనదగినంతగా ప్రయోజనం లభించదు. ఏదోవిధంగా దొరికినా, దాని స్థాయి అత్యల్పంగా ఉంటుంది. పైగా మనసుకు సంతోషకరంగా ఉండదు, గౌరవ ప్రదంగానూ అనిపించదు. వాటిని ఉపయోగించే సమయంలో ఆత్మన్యూనత కలుగుతూ ఉంటుంది. వాటినే అర్హత వలన సంపాదించుకున్న వారికి గౌరవం, గర్వం, సంతోషం పొంగి పొర్లుతూ ఉంటాయి. చేసుకున్నవారికి చేసుకున్నంత అన్నట్లు ఈ సృష్టిక్రమంలోనే కర్మ-ఫలితం అన్న విధానం రూపొందించబడి ఉన్నది. పవనుడు ప్రాణవాయువును అందరికీ సమానంగా అందిస్తాడు. సమర్థవంతమైన ఊపిరితిత్తులు మాత్రమే దానిని స్వీకరించగలుగుతాయి. మృతుల ముందు పవనుడు నిస్సహాయుడే అవుతాడు. మనోహరమైన, సుందరమైన దృశ్యాలతో నిండిఉన్న ఈ ప్రపంచాన్ని వీక్షించి ఆనందించే అవకాశం దృష్టి చక్కగా ఉన్నవారికే కలుగుతుంది. అసంఖ్యాకమైన ధ్వని ప్రవాహముల ఆరోహణ అవరోహణములను విని ఆనందం పొందగలిగే అవకాశం కర్ణభేరి చక్కగా పని చేస్తున్నవారికి మాత్రమే కలుగుతుంది. వెలుపలి నుండి దైవ అనుగ్రహాలు వర్షిస్తున్నమాట యదార్థమే అయినప్పటికీ, అవి పొందడానికి "అర్హత" అనివార్యం అన్న షరతు జోడించబడే ఉన్నది.

అర్హతను పెంపొందించుకున్నవారికి యాచించవలసిన అవసరం ఉండదు. వారికి ఉపయుక్తమైనవి సునాయాసంగా అందుతాయి. ఉపయుక్తమంటే వారిస్థాయికి తగినట్టివి అని అర్థం. స్థాయిని అభివృద్ధి చేసుకొనకుండా మహత్తులు విభూతులు లభించవు. ఒకవేళ లభించినా ఎక్కువ కాలం నిలువవు. కాబట్టి అర్హతను అభివృద్ధి చేసుకోవడం తప్పని సరి. సాధనలో చేసే పని ఇదే. ప్రయత్నం ఎంత ప్రౌఢంగా, గాఢంగా, పరిపక్వంగా ఉంటుందో అంతే గాఢమైన విభూతులు లోనుండి ఉబికివస్తాయి. వెలుపలి నుండి వర్షిస్తాయి.

చెట్లు తమ ఆకర్షణ శక్తితో ఆకాశంలో తిరిగే మేఘాలను ఆకర్షించి వర్షం కురిసేలా చేస్తాయి. మొక్కల మీద, ఆకులు పువ్వుల మీద మంచు బిందువులు తమంతట తామే ఆకర్షణకులోనై జమకూడతాయి. ఆకర్షించుకొన్న సజాతీయులు ఎక్కడ ఎంత ఎక్కువ ఉంటే వాటికి ఆ స్థాయి ఆహ్వానం అందుతుంది. ఫలితంగా అవి అదే వేగంతో పరుగు పరుగున సజాతిని కలుసుకోవడానికి వస్తాయి. వికసించిన పూలలోని ఆకర్షణ తేనెటీగలను, తుమ్మెదలను, సీతాకోకచిలుకలను అతిథులుగా ఆహ్వానిస్తుంది. విరిసిన యవ్వనం అనేకుల దృష్టిని అప్రయత్నంగా ఆకర్షిస్తుంది. ప్రతిభ అనేకమందిని ప్రశంసకులుగాను,

**నవ్వుతూ నవ్వుతూ జీవితాన్ని బలిదానం చేయడం ద్వారా సిద్ధాంతానికి రక్షణ జరుగుతుంది.**

అనుయాయులుగాను చేసుకుంటుంది. ఇది ఆకర్షణ శక్తికి ఉన్న మహత్తు. ఇదే విధంగా సాధకుని ఆకర్షణ దైవశక్తులను అదృశ్యరూపంలో ఆహ్వానిస్తుంది. అనుగ్రహాలను అందించడం వాటికి తప్పనిసరి అవుతుంది.

సిద్ధులు, విభూతుల ప్రవాహం ఒక విధంగా పైనుండి వెలుపలినుండి కురుస్తుండగా, మరోవిధంగా లోపలినుండి ఆంతరంగికంగా పొంగివస్తుంది. ఈ దైవానుగ్రహ ప్రవాహంలో ఎంతోమంది అదృష్టవంతులు మునకలువేస్తూ ఆనందిస్తున్నారు. ఆత్మోత్కర్ష అనే ప్రక్రియద్వారా నిద్రించుతున్న సామర్థ్యాలు జాగృతమౌతాయి. దానితో సునాయాసంగా అన్ని విభూతులూ ప్రకటితమౌతాయి. అజ్ఞానం వలన, సరైన మార్గదర్శకులు లేనందున సామాన్య జనులు వాటికి అపరిచితులుగానే ఉండిపోతున్నారు. నిజానికి మనిషిలో లేనిది లేదు. వాటిని విధాత సామర్థ్యంతో సమానమని చెప్పవచ్చు. వృక్షమునకున్న విశాల రూపం చిన్న విత్తనంలోపల అమరి ఉంటుంది. సౌరమండలం సమస్త ప్రక్రియలు సూక్ష్మరూపంతో పరమాణువులో యధావిధిగా నడుస్తుంటాయి. వ్రేళ్లతో భూమిలోనుండి రసం పీల్చి చెట్టు పచ్చగా ఉండడానికి, పూవులు పూయడానికి, కాయలు కాయడానికి కావలసిన సరంజామా ఏర్పరుస్తుంది. ఇవన్నీ కళ్లకు కనపడవు. చెట్టు కేవలం ఆకారానికేగాని, దాని శోభ, సమర్థతల శక్తి వ్రేళ్లలోనే నిక్షిప్తమై ఉంది. జీవుని చిన్న అంతరంగం దాదాపు బ్రహ్మ విరాట్స్వరూపమంత సమర్థవంతమైనది. సిద్ధి అనే శక్తి వ్యక్తి లోపలినుండే అంకురించి పైకి ఎదుగుతుంది. వెలుపల దాని ప్రగతికి సంబంధించిన పరిచయం లభిస్తుంది.

ఈ విధంగా అర్హతను ప్రకటించి ఈ లోకంలో ఏదంటే అది, ఎంత కావాలంటే అంత పొందగలిగే వీలున్నది. ధనవంతులు ఎంత ఖరీదైన సుఖసాధనాలనైనా సరే ఎన్ని కావాలంటే అన్ని ఎలా కొనగలరో, అదేరకంగా సాధనతో అర్హతను పొందినవారు దైవానుగ్రహమనే సంపదతో తమ కోర్కెలను తేలికగా తీర్చుకొనగలరు. అర్హతలేని వారికి ప్రార్థించినా, యాచించినా దక్కేదేమీ ఉండదు. ఈ జీవిత సాధన సిద్ధాంతం శాశ్వత సత్యం. సందేహించడానికి, వాదించడానికి అవకాశంలేని సత్యం.

గాయత్రీ మహావిద్య తత్వదర్శనంతో, దీని సమర్థసాధనతో పాఠకులు సుపరిచితులే. దీనిని పాత్రతకు, సామర్థ్యానికి, వ్యక్తిత్వానికి సంస్కరణ క్రియగా అంగీకరించినట్లయితే, ఆ మహాప్రయత్నంలో నిమగ్నులై ఉన్నట్లయితే-చరిత్రలోనూ వర్తమానంలోనూ ఉన్నటువంటి అధ్యాత్మవేత్తలవలె ప్రతి ఒక్కరూ తమ స్థాయిని ఉన్నతం చేసుకొనగలరు. వారి ప్రతిభ హిమాలయాల కన్నా ఎత్తైన శిఖరాలను చేరుకుని సమున్నతం, సమృద్ధం అవుతుంది. ఇప్పుడు లోకసేవకు కావలసిన ఉత్కృష్ట వ్యక్తుల నిర్మాణం ఈ విధమైన జీవనసాధన వల్లనే సాధ్యపడుతుంది. ఈ సాధన అనే యజ్ఞకుండంలో తమ్ముతాము ఆహుతి చేసుకున్నప్పుడే స్వీయ వ్యక్తిత్వంలో దాగిఉన్న అనంతశక్తుల జాగరణ సంభవిస్తుంది.

L L L

## సంఘర్షణ కాదు - సహకారం

యువరాజు క్రోపాట్కిన్ తన జీవితాన్నంతటినీ ప్రకృతి అధ్యయనంలో గడుపుతూ, జీవ జంతువుల వ్యవహారంద్వారా తెలుసుకొన్న సత్యాలను, చేసిన నిర్ధారణలను, "సంఘర్షణ కాదు - సహకారం" అనే పుస్తకంలో పొందుపరిచారు. ఆయన మానవ జాతి సుఖము, ఔన్నత్యము పోటీలో లేవని, భావనలోనే ఉన్నవని తెలియజేశారు. భావ వికాసం వలన అభావగ్రస్త జీవితాలకు ఆనందం, ఉల్లాసం లభిస్తాయి. ధ్రువప్రాంతంలోని రాజహంసల జీవిత విధానాన్ని చూస్తే మానవుని బుద్ధులు ఇంత నికృష్టంగా ఉంటాయేమిటా అని బాధ కల్గుతుంది. మానవుడు బుద్ధిజీవి అయికూడా, జీవితం లోతులను ఎందుకు గుర్తించలేకపోతున్నాడోనని ఎంతగానో వ్యధ కల్గుతుంది.

ఒక్కొక్కసారి రాజహంసలు తమ పిల్లలను వదిలివేస్తూ ఉంటాయి. ప్రక్కనున్న మరొక రాజహంస తనకు పిల్లలున్నప్పటికీ వాటినికూడా చేరదీసి సొంత పిల్లల్లాగే ప్రేమతో పెంచుతుంది. ఆ పిల్ల హంసలు, ఈ పిల్ల హంసలు కలిసి ఒకే తల్లిబిడ్డలలా జీవిస్తాయి. ఎంత శ్రమయైనా లెక్కచేయక పెరిగి పెద్దవయ్యే వరకూ పరాయి పిల్లల పాలన, పోషణ హంస చాలా చక్కగా చేయటం చూస్తే ఇటువంటి సహకారం మానవులలో అరుదుగానైనా కనిపిస్తుందా అనే ఆవేదన కల్గుతుంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రేమజ్యోతి వెలుగు అంతరంగంలోని కల్మషాన్ని పారద్రోలుతుంది.**

# కృష్ణావతారం-16

# జరాసంధ వధ

మగధరాజగు జరాసంధుడు నరమేధమును చేయవలయునను తలంపుతో చాలమంది రాజులను బంధించెను. ఒకనాడు ఆ రాజుల కరుణకథను వినిపించుటకై ఒకదూత కృష్ణ భగవానుని దగ్గరకు వచ్చెను. అతడు రాజుల సందేశమును ఇట్లు వినిపించెను.

**లోకే భవాన్జగదినః కలయావతీర్ణ**
**సద్రక్షణాయ ఖలానగ్రహణాయ చాన్యః ।**
**కశ్చిత్ త్వదీయమతియాతి నిదేశమీశ**
**కిం వా జనః స్వకృతమృచ్ఛతి తన్న విద్మః ॥**

దేవా! నీవు జగత్తునకు ఈశ్వరుడవు. నీవు జగత్తులో జ్ఞానము బలము మున్నగు కళలతోగూడి సత్పురుషులను రక్షించుటకు దుష్టులను శిక్షించుటకు అవతరించితివి. ప్రభూ! ఇట్టి స్థితిలో జరాసంధాదులైన ఇతర రాజులు నీ యిచ్ఛకు నీ ఆజ్ఞకు వ్యతిరేకముగ మమ్ము ఎట్లు బాధింతురు? మా దుష్కర్మల వలన ఈ విధముగ అగుచున్నదా అను విషయముగూడ తెలియుటలేదు. మేము అందరము నీ ఆదర్శములను అనుసరించు వారమేగదా!

(1) భగవదవతారము సమర్థుడగు వ్యక్తిరూపమున అగును. అవతారము యొక్క ఉద్దేశ్యము సత్పురుషులను రక్షించుట, దుష్టులను శిక్షించుట. భక్తుడు భగవానుని ఆదర్శములను అనుసరింపవలెను.

దూత రాజుల సందేశమును వినిపించి వారిని విడిపింపవలసిందిగా కోరెను. అప్పుడే నారద మహర్షి గూడ అక్కడకు వచ్చెను. శ్రీకృష్ణుడు ఆయనకు స్వాగత మిచ్చి పాండవుల సమాచారము నడిగెను. ధర్మరాజు రాజసూయయజ్ఞము చేయుచు నీ దర్శనము నపేక్షించుచున్నాడని నారదుడు చెప్పెను. నారదుని సమాచారమడిగి శ్రీకృష్ణుడు జరాసంధుని గూర్చి సభాసదుల సలహాను తీసికొనెను. అందరు వానిని శిక్షించమనియే చెప్పిరి. ఉద్ధవుడు వానిని వధించుటకు భీమసేనుని సాహాయ్యమును తీసికొనవలసినదిగా సలహా చెప్పెను.

**స వై దుర్విషహో రాజా నాగాయుత సమో బలే ।**
**బలినా మపి చాన్యేషాం భీమం సమబలం వినా ॥**

జరాసంధుడు గొప్పగా వీరులను గూడ అణచువాడు. అతడు పదివేలయేనుగుల బలము గలవాడు. సమానబలము గలిగిన భీమసేనుడే వానిని ఓడింపగలడు.

(1) యుక్తితోను, అందరి అభిప్రాయము ననుసరించి కార్యము చేయవలెను.

(2) ఎవడు ఏ పని చేయుటకు యోగ్యుడో అతడే ఆ పని చేయును.

ఉద్ధవుడు తన అభిప్రాయమును స్పష్టపరుచుచు ఇట్లు చెప్పెను - రాజసూయ యజ్ఞము రాజనైతిక సమతౌల్యమును తెచ్చుటకు చేయబడును. అందువలన నీవు పాండవుల అనుగ్రహమును గూడ అంగీకరించుము. రాజసూయ యజ్ఞము యొక్క జాగ్రత్తకై భీమునితో దుర్మార్గుడైన ఈ జరాసంధుని చంపించుము.

**ఇత్యుద్ధవవచో రాజన్ సర్వతో భద్రమచ్యుతమ్ ।**
**దేవర్షిర్యదువృద్ధాశ్చ కృష్ణశ్చ ప్రత్యపూజయన్ ॥**

ఉద్ధవుని ఈయభిప్రాయము అన్నివిధముల మేలు కలిగించునదే. నారద మహర్షి, యదువంశములోని వయోవృద్ధులు, శ్రీకృష్ణుడు దానిని సమర్థించిరి.

(1) అభిప్రాయము అనగా సలహా ఆలోచనా పూర్వకముగను హితకరముగను ఉండవలెను.

(2) తగిన సలహాను ఎవ్వరైనను ఈయవచ్చును. పెద్దలు దానిని సమర్థించవలెను.

శ్రీకృష్ణ భగవానుడు దూతను ఓదార్చి పంపెను. పిమ్మట ఆయన ఇంద్రప్రస్థ నగరమునకు బయలు దేరెను.

**యస్మిన్నిదం యతశ్చేదం తిష్ఠత్యప్యేతి జాయతే ।**
**మృణ్మయేష్వివ మృజ్జాతి స్త స్మై తే బ్రహ్మణే నమః ॥**

మట్టికుండ మట్టినుండి పుట్టును, మట్టియందుండును, ఆ మట్టియందే లీనమగును. అట్లే ఈ కార్యకారణాత్మకమగు జగత్తు నీనుండియే జన్మించును. నీయందే ఉండును, నీయందే లీనమగును. అట్టి పరబ్రహ్మస్వరూపుడవగు నీకు నమస్కారము.

(1) ఈ బ్రహ్మాండము పరమాత్మయొక్క సగుణసాకార రూపము.

(2) విరాట్ బ్రహ్మకు నమస్కరించుట తన శ్రద్ధను విశ్వహితముతో జోడించుటయే.

శ్రీకృష్ణ భగవానుడు ఇంద్రప్రస్థమునకు వెళ్ళెను. ధర్మరాజు ఇతర పాండవులు ఆయనకు స్వాగతమిచ్చిరి. ఒకనాడు కృష్ణుడు ఇతర సభాసదులు రాజసభలో ఆసీనులైయుండిరి. ధర్మరాజు ఆదరముతో కృష్ణునకు ప్రణమిల్లి రాజసూయ యజ్ఞము చేయు కోరికను వెల్లడించెను.

న బ్రహ్మణః స్వపరభేదమతిస్తవ స్యాత్ ।
సర్వాత్మనః సమదృశః స్వసుఖానుభూతేః ।

**మన కార్యశూరతను మేలుకొలిపే వరం - కష్టం.**

సం సేవతాం సురతరోరివ తే ప్రసాదః
సేవానురూపముదయో న విపర్యయో ఽత్ర ॥

దేవా! నీవు అందరికి ఆత్మవు, సమదర్శివి, ఆత్మానందమును సాక్షాత్కరింప జేయు వాడవు. బ్రహ్మవు. నీలో ఇది నేను, ఇది ఇతరుడు, ఇది నీది, ఇది పరునిది అను భేదము లేదు (స్వపరభేదము లేదు). నిన్ను సేవించువారికి కల్పవృక్షమును సేవించువారికివలె వారిభావనల ననుసరించి ఫలము లభించును. ఆఫలములో హెచ్చు తగ్గులుండుటకు కారణము వారిసేవలో హెచ్చుతగ్గులుండటయే. దీనివలన నీలో విషమత్వ నిర్ణయత్వాది దోషములు ఉండవు.

(1) భగవానుడు పక్షపాతము లేనివాడు. ఆయనలో నాది నీది అను భేదము లేదు.

(2) ఆయన కొన్ని సిద్ధాంతములను నిర్ధారించెను. మానవుడు వానిననుసరించియే తన భావనకు సేవకు తగిన ఫలములను పొందును.

శ్రీకృష్ణ భగవానుడు ధర్మరాజును ప్రశంసించుచు వాని రాజసూయ యజ్ఞమును సమర్థించుచు ఇట్లుపలికెను -

విజిత్య నృపతీన్ సర్వాన్ కృత్వా చ జగతీం వశే ।
సంభృత్య సర్వసంభారానాహరస్వ మహాక్రతుమ్ ॥

మహారాజా! నీవు భూమిపై గల రాజులనందరిని జయించి భూమినంతటిని వశముచేసికొని, యజ్ఞసామగ్రిని చేకూర్చుకొని మహాయజ్ఞమును చేయుము.

(1) భగవానుడు ఉత్తమ నిర్ణయములను సమర్థించును. వానిని పూర్తిచేయును.

(2) రాజసూయయజ్ఞము రాజనైతిక ఐక్యతకు ప్రతీక, దానికై తగిన పూర్వసిద్ధత అవసరము.

నీవు సర్వవిధముల చక్రవర్తిపదవికి తగినవాడవే. అయినను రాజులనందరిని వశములోనికి తీసికొననిదే ఈ ప్రక్రియ సంపన్నము కాజాలదు. ఇందులో నీకు కష్టమైనదేదియు లేదు. కాని జరాసంధుడు దీనికి ప్రధాన ఆటంకము. వానిని సంహరింపనిదే ఈపని కాదు. అతడు చాలమంది రాజులను బంధించియుంచినాడు. అందువలన జరాసంధుని చంపి రాజులకు విముక్తి కలిగింపనిదే నీ ఏర్పాటు సఫలము కాదు.

ధర్మరాజు పలికెను - నీవే వానికి భయపడినచో మేము వానినెట్లు జయింపగలము? కృష్ణుడు ధర్మరాజును ప్రోత్సాహపరచెను. ఆయనకు నీతి మహిమను తెలుపుచు ఇట్లు పలికెను -

ఏతావదేవ పురుషైః కార్యం హృదయతోషణమ్ ।
నయనే విధిదృష్టేన యదుపక్రమతే పరాన్ ।
సునయస్యానపాయస్య సంయోగే పరమః క్రమః ।

వీరపురుషుల కర్తవ్యమేమనగా వారు తమహృదయతుష్టికై నీతిశాస్త్రమున చెప్పబడిన నీతి ననుసరించి శత్రువులను ఎదుర్కొనవలెను. ఉత్తమనీతిని మరియు సలహాను పొందినపిమ్మట ఆరంభము చేసిన పని పూర్తిగ సఫలమగును.

(1) కార్యసిద్ధిలో పురుషార్థమే ప్రధాన కారణము,

(2) తన పూర్తి శక్తితో పనిచేయవలెను.

తే వయం నయమాస్థాయ శత్రుదేహసమీపగాః ।
కథమన్తం న గచ్ఛేమ వృక్షస్యేవ నదీరయాః ।
పరరన్ధ్రే పరాక్రాన్తాః స్వరన్ధ్రావరణే స్థితాః ॥

మేము నీతిని ఆశ్రయించి శత్రువుల శరీరము దగ్గరకు చేరినపుడు నదియొక్క వేగము తీరమున ఉన్న చెట్టును పడగొట్టునట్లు మేము మాశత్రువును ఎందుకు అంతము చేయలేము? మేము మాలోపములను దాచి శత్రువుల లోపములను చూచెదము. సమయము లభించినంతనె వానిపై బలముగ దాడిచేయుదుము.

(1) తెలివిగ తనకార్యమును సాధించుకొనుటయె సర్వోత్తమనీతి.

(2) తమ బలహీనతలను శత్రువునకు తెలియనీయరాదు.

అథవైనం నిహత్యాజౌ శేషేణాపి సమాహతాః ।
ప్రాప్నుయామ తతః స్వర్గం జ్ఞాతిత్రాణ పరాయణాః ॥

లేదా జరాసంధుని సంహరించి వానివైపున ఉన్న మిగిలిన సైనికుల చేతిలో మేముగూడ మరణించినను పరవాలేదు. మాజాతివారిని రక్షించుటలో నిమగ్నమై యుండుటవలన మాకు స్వర్గము లభించును.

(1) తన కర్తవ్యమును పాలించుచు మరణించినను శ్రేయస్కరమే.

(2) స్వజనులను, అశక్తులను రక్షించుటయే క్షత్రియ ధర్మము. దీనికై ఏ ప్రమాదమునైనను ఎదుర్కొనవలసినదే.

ఇట్లు ధర్మరాజునకు బోధించి శ్రీకృష్ణుడు పలికెను- సేనతో దాడి చేసి జరాసంధుని ఓడించుట కష్టము. అందువలన నీవు భీమార్జునులను నాకు అప్పగించుము. మేము ముగ్గురము యుక్తితో జరాసంధుని వధింపగలము.

న శక్యో ఽసౌ రణే జేతుం సర్వైరపి సురాసురైః ।
బాహుయుద్ధేన జేతవ్యః సఇత్యుపలభామహే ॥

యుద్ధంలో దేవతలు కాని అసురులు కాని వానిని జయింపలేరు. అందువలన నాయుద్దేశ్యములో వానిని బాహుయుద్ధం ద్వారానే జయింపవలెను.

(1) ఏ పనినైనా చేయుటకు పూర్వము లాభనష్టముల గూర్చి ఆలోచింపవలెను.

(2) ఎవ్వడును సర్వగుణ సంపన్నుడు కాడు. వాని బలహీనతను గూర్చి తెలిసికొనియే శత్రువును ఓడింపవలెను.

**పొందడం కోల్పోవడం అదృష్టంలో కాక మన పౌరుష అపౌరుషాలలో ఉంది.**

**మయి నీతిర్బలం భీమే రక్షితా చావయోర్జయః ।**
**మాగధం సాధయిష్యామ ఇష్టిం త్రయ ఇవాగ్నయః ॥**

నాలో నీతియున్నది, భీమునిలో బలమున్నది. అర్జునుడు మాఇరువురిని రక్షించును. అందువలన మూడు అగ్నులు యజ్ఞమును సిద్ధింపచేయునట్లు మేము ముగ్గురము కలసి జరాసంధుని పనిని పూర్తి చేయుదుము.

(1) సంఘటన శక్తి అపూర్ణమును పూర్ణము చేయును.
(2) నీతి, బలము, శౌర్యము కలసినచో కార్యసిద్ధియగును.

**యది మే హృదయం వేత్సి యది తే ప్రత్యయో మయి ।**
**భీమసేనార్జునౌ శీఘ్రం న్యాసభూతౌ ప్రయచ్ఛ మే ॥**

రాజా ! నీకు నా హృదయము తెలియును, నీకు నాపై విశ్వాసమున్నది. అందువలన భీమసేనుని, అర్జునుని నాకు న్యాసముగా ఇమ్ము.

(1) తన పురుషార్థము నందు నమ్మకమున్న వారి కార్యము తప్పక సంపన్నమగును.
(2) జరాసంధ వధకు సంబంధించిన బాధ్యతను శ్రీకృష్ణుడు తనపైన నిలుపుకొనెను.

యుధిష్ఠిరుడు (ధర్మరాజు) పలికెను- దేవా ! జరాసంధవధలో నీవు సాఫల్యమును పొందగలవను విశ్వాసం నాకు పూర్తిగా ఉన్నది. నాకు నీ కార్య కౌశలముపై పూర్తి నమ్మకమున్నది. మీరు ముగ్గురు సుఖముగా ప్రయాణము కండు.

ధర్మరాజు ఆదేశమును పొంది ముగ్గురు వీరులు బ్రాహ్మణ రూపములను ధరించి మగధకు వెడలిరి. వారు మగధ రాజధానికి చేరుకొనిరి. రాజధాని ప్రాకారములతో చుట్టబడి యుండెను. వారు ప్రాకార ద్వారము గుండా వెళ్లక చైత్యక పర్వతము పైనుండి రాజధానిలో ప్రవేశించి జరాసంధుని మహలులోనికి వెడలిరి. జరాసంధుడు వారికి స్వాగతమిచ్చెను. భీమార్జునులు మౌనముగా ఉండిరి. "వీరిరువురు మౌనము వహించిరి. అర్ధరాత్రి దాటిన తరువాతనే నీతో సంభాషణ జరుగును'' అని కృష్ణుడు చెప్పెను. జరాసంధుడు ఆ ముగ్గురు బ్రాహ్మణులను యజ్ఞశాలలో నిలిపి తాను రాజభవనమునకు వెళ్లెను.

అర్ధరాత్రి అయిన పిమ్మట జరాసంధుడు బ్రాహ్మణుల దగ్గరకు వెళ్లి ఇట్లు పలికెను- మీ వేషము బ్రాహ్మణ వేషమువలె ఉన్నది. కాని మీ పనులు బ్రాహ్మణుల వలె లేవు. మీరు చైత్యకపర్వత శిఖరమును విరుగగొట్టి రాజధానిలో ప్రవేశించిరి. అయినను మీరు నిర్భయముగా కనపడుతున్నారు. ఈ తప్పు మీరెందులకు చేసితిరి? నాకు మిమ్మలను గురించి సందేహముగా ఉన్నది. అందువలన మీరు మీ వాస్తవ విషయమును చెప్పుడు.

కృష్ణుడు పలికెను- "శత్రువు ఇంటిలోనికి ఇట్లే ప్రవేశింపవలెను.'' "నాకు మీతో ఏ విధమైన శత్రుత్వం లేదే'' అని జరాసంధుడు చెప్పెను.

అప్పుడు కృష్ణుడిట్లు అనెను- నీవు క్షత్రియ జాతి అంతటిమీద శత్రుత్వమును వహించితివి. మేము క్షత్రియ జాతికి ముఖ్యుడైన మహాపురుషుని ఆజ్ఞమేరకు నిన్ను శిక్షించుటకు వచ్చితిమి. నీవు ఎందరో రాజులను బంధించియుంచితివి. వారిని బలి ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నావు.

**అస్మాంస్తదేనో గచ్ఛేద్ధి కృతం బార్హ ద్రథ త్వయా ।**
**వయంహి శక్తా ధర్మస్య రక్షణే ధర్మచారిణః ॥**
**మనుష్యాణాం సమాలమ్భో న చ దృష్టః కదాచన ।**
**స కథం మాను షైర్దేవం యష్టుమిచ్ఛసి శంకరమ్ ॥**

బృహద్రథకుమారా ! నీవు చేసిన పాపము మా అందరి పైన పడినది. ఎందుకనగా మేము ధర్మరక్షణమున సమర్థులము, ధర్మమును రక్షించు వారము. ఏదేవత పూజకైన మనుష్యులను వధించుట ఎక్కడ కనబడలేదు. నీవు శుభంకరుడగు పరమేశ్వరుని మానవహింసతో ఎట్లు పూజింపదలచుచున్నావు?

(1) అన్యాయమును చేయునట్లు అన్యాయమును సహించుట మహాపాపము.
(2) ఎవనికైన కష్టమును కలిగించుటవలన దేవతలు అసంతుష్టులగుదురు.

నీవు వాస్తవమును సరిగనే చెప్పితివి. మేము బ్రాహ్మణులముకాము, క్షత్రియులము. ఈ సోదరులిరువురు భీమార్జునులు, నేను నీకు శత్రువునగు కృష్ణుడను. మేము యుధిష్ఠిర మహారాజుయొక్క ఆజ్ఞచే నిన్ను నీవు చేసినపాపములకు దండించుటకు ఇక్కడకు వచ్చితిమి. నీవు దండననుండి తప్పించుకొనదలచినచో బంధింపబడిన రాజులనందరిని వదలుము.

**త్వామాహ్వయమహే రాజన్ స్థిరో యుధ్యస్వ మాగధ ।**
**ముంచ్వా నృపతీన్ సర్వాన్ గచ్ఛ వా త్వం యమక్షయమ్ ॥**

మగధరాజా! మేము యుద్ధమునకై నిన్ను ఆహ్వానించుచున్నాము. నీవు నిలబడి యుద్ధము చేయుము. నీవు రాజులనందరిని వదులుము లేదా యమలోకమునకైన వెళ్ళుము.

(1) అత్యాచారమును ఇట్లు సాహసముతో ఎదుర్కొనవలెను.
(2) బాగుపడుటకు అపరాధికైన సమయము నొసంగవలెను.

కృష్ణుడిట్లు సవాలుచేయగా జరాసంధుడు తన పుత్రుడగు సహదేవునికి రాజసింహాసనము నప్పగించి యుద్ధసన్నద్ధుడయ్యెను. 'నీవు మాముగ్గురిలో ఎవనితో యుద్ధము చేయదలంచుచున్నావు' అని కృష్ణుడు పలికెను. అతడు భీమునితో యుద్ధము చేయుటకు అంగీకరించెను. యుద్ధము ఆరంభమయ్యెను. ఆగకుండగ వరుసగ సాగుచునేయుండెను. జరాసంధుడు కొంచెము శ్రమచెందుచుండెను. అప్పుడు భీముడు వానిని నేలపై బడగొట్టి మోకాళ్ళతో వాని వెన్నెముకను విరచి, కృష్ణుని నిర్దేశానుసారము వానిపని పూర్తిచేసెను.

**కష్టాలకు ఏడవడం కాక - వాటిని తొలగించే ఉపాయాలను వెదకడం విజ్ఞత.**

**ఏకం పాదం పదాఽఽ క్రమ్య దోర్భ్యా మన్యం ప్రగృహ్య సః ।**
**గుదతః పాటయామాస శాఖామివ మహాగజః ॥**

తరువాత వానినొకకాలిని తన పాదముతో నొక్కిపట్టి రెండవపాదమును తన చేతులతో పట్టుకొనెను. పిమ్మట మదపుటేనుగు చెట్టుకొమ్మను చీల్చునట్లు భీముడు వానిపాదములను గుదమునుండి చీల్చివేసెను.

జరాసంధుడు చంపబడిన పిమ్మట జయజయధ్వానములు చెలరేగెను. కృష్ణార్జునులు ప్రేమతో భీముని కలిసికొనిరి. అటుతరువాత జరాసంధునిచే బంధింపబడిన రాజులందరు విముక్తులైరి.

కారాగారమునుండి ముక్తులై రాజులందరు కృష్ణుని స్తుతించిరి. కృష్ణుడు వారికి - గర్వము పతనమునకు కారణము కనుక మీరెప్పుడును మీసంపదను మీవైభవమును చూచి గర్వపడరాదు' అని ఉపదేశించెను.

**హైహయో నహుషో వేనో రావణో నరకోఽపరే ।**
**శ్రీమదాద్ భ్రంశితాః స్థానాద్ దేవదైత్య నరేశ్వరాః ॥**

హైహయుడు, సహుషుడు, వేనుడు, రావణుడు, నరకాసురుడు, మున్నగువారు, దేవతలు, దైత్యులు, మహారాజులు వైభవమదము వలన బలగర్వము వలన తమస్థానమునుండి, పదవి నుండి చ్యుతులైరి.

(1) వైభవమును అధికారమును సమాజముయొక్క లేదా భగవానునియొక్క న్యాసముగా తలంచి దానిని సదుపయోగము చేయవలెను. తాను దానికి స్వామిని అని తలంపకపోవుట వలన అహంకారము కలుగదు.

**ఉదాసీనశ్చ దేహాదావాత్మారామా ధృతవ్రతాః ।**
**మయ్యావేశ్య స నః సమ్యక్ మామన్తే బ్రహ్మయాస్యథ ॥**

దేహము మీద, దేహమునకు సంబంధించిన వారి మీద ఎట్టి ఆసక్తిని చూపక ఉదాసీనముగా ఉండవలెను. మీలో మీరు అనగా అత్మయందు రమింపుడు, ఆశ్రమమునకు యోగ్యములైన వ్రతములను పాలించుచుండుడు. మీ మనస్సును చక్కగా నాయందే లగ్నముచేసినచో చివరకు మీరు నాస్వరూపమును పొందెదరు.

(1) ఆసక్తిరహితుడవై కర్తవ్యమును నెరవేర్చుచు ప్రపంచములో ఉండవలెను.

(2) ఆశ్రమవ్యవస్థ వ్యక్తివికాసమునకు, సమాజోత్కర్షకు ఉపయోగమైనది. వానికనుకూలముగ మనకర్తవ్యములను పూర్తిచేయవలెను.

ఇట్లు రాజులందరికీ బోధించి కృష్ణుడు వారిని సాగనంపెను. రాజులందరు భగవానుని గుణములను గానము చేయుచు తమతమరాజధానులకు వెళ్ళిపోయిరి. సమాచారమునంతటిని విని ధర్మరాజు కృష్ణుని గొప్పగా ప్రశంసించెను.

L L L

## దేశంకోసం సామూహిక బలిదానం

ఫ్రాన్స్, ఇటలీల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇటలీలో ఎక్కువ లోతు, విశాలం తక్కువ ఉన్న చిన్న నది ఉండేది. గ్రామ ప్రజలు దానిని దాటటానికి రెండు ఖర్జూరం చెట్టు కర్రలను వంతెనగా ఉపయోగించుకొన్నారు. ఫ్రాన్స్‌సేన ఈ వంతెనను దాటి ఇటలీలో ప్రవేశించాలని ప్రణాళిక వేసికొన్నట్లు గ్రామస్తులకు తెలియటంతో వారు వంతెనను విరగకొట్టాలని నిశ్చయించుకొన్నారు. గొడ్డళ్ళు తెచ్చి, వంతెనను విరుగకొట్టే ప్రయత్నంలో ఉండగా, ఈ విషయం ఫ్రాన్స్ సైన్యానికి తెలిసి వారి ప్రయత్నాన్ని నిలపాలని వారిపై గుళ్ళ వర్షం కురిపించసాగేరు. గ్రామస్థులు, బహద్దూరులు ఓటమికి లొంగరు. తుపాకీ గుళ్ళకు బలియై ఆ నదిలో పడిపోయే వరకూ వారు తమ పనిని ఆపలేదు.

ఈ విధంగా యువకులతో సహా మొత్తం గ్రామస్థులంతా చనిపోయారు. ఒక వృద్ధుడు మాత్రము మిగలగా, అతడు అతి కష్టంమీద వెళ్ళి కర్రవంతెన చాలా వరకు విరిగిపోయినట్లు గమనించి, కొద్దిగా పట్టున్న భాగం మీదకు శక్తినంతను కూడదీసికొని ఒక్క గెంతున బలంగా దూకాడు. దానితో కర్రవంతెన పూర్తిగా విరిగి, వంతెనతో సహా వృద్ధుడు కూడా నదిలో పడిపోయాడు. ఈ విధంగా గ్రామ జనాభా మొత్తం మరణించినా వారు లక్ష్యాన్ని మాత్రం నెరవేర్చి ఫ్రాన్స్ సైన్యం గ్రామంలో ప్రవేశించకుండా చేసి వారిని ఓడించారు. ఇది సామూహిక గౌరవాన్ని పెంచే మహోన్నత కార్యక్రమం.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మాటల గారడీకన్న ఉన్నది ఉన్నట్లు చెప్పడం ఉత్తమం.**

## గురుదేవుల అమృతవాణి

# శక్తిపాతం, కుండలినీ జాగరణ

వసంత పంచమి ఉత్సాహభరితమైన పండుగ. ప్రేరణ నిచ్చే శుభదినం. ప్రకాశా న్నందించే శుభదినం. వసంత ఋతువు ఉత్సాహాన్ని తీసుకువస్తుంది. ఉల్లాసాన్ని తీసుకువస్తుంది. సమర్థగురు రామదాసు జీవితకాలంలో ఈ రోజులలోనే ఒక ఆలోచన వచ్చింది. జీవితాన్ని ఎందుకు సమర్థవంతంగా ఉపయోగించుకోకూడదు? మన జీవితాన్ని ఎందుకు సార్థకం చేసుకోలేకపోతున్నాం? ఒక వంక ఆయన వివాహానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమర్థగురు రామదాసుకు భార్య, భార్యకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలు, వాళ్ల పెళ్లిళ్లు, కాన్పులు - ఇదంతా ఒక సంకెలగా తోచింది. రెండవవైపు ఆయనకు ఆత్మనుండి సంకేతం అందింది. పరమాత్మ నుండి సంకేతం అందింది, "నీ జీవితం ఇంత విలువలేనిది కాదు. అది అమూల్యమైనది. చాలా ప్రియమైనది. రా. నీకు ఇంకొక దారికి తలుపు తెరువబడుతుంది. మహత్తువైపుకు తీసుకుపోయే దారి అది''- అని. సమర్థ గురుదేవులు ఆలోచనలో పడ్డారు. ఉల్లాసం వచ్చింది. ఉత్సాహం వచ్చింది. అది ఆపటానికి శక్యంకానంత శక్తివంతమైన వెల్లువ. కిరీటం విసిరి పారవేశాడు. కంకణాన్ని విరగగొట్టి పారేశాడు. ఆ పిల్లవాడు పారిపోయాడు. పెళ్లికొడుకు ఏమైపోయాడు? సమర్థగురు రామదాసుగా మారిపోయాడు. ఎవరు? ఒక మామూలు పిల్లవాడు! పరుగులు పెడుతూ పారిపోయి సమర్థగురు రామదాసుగా ఎదిగిపోయాడు.

ఇక్కడ నాలో ఉల్లాసం లోపలి నుండి వెల్లువలా పొంగి పొరలుతున్నప్పుడు దానిని ఎవరూ ఆపలేరు. వసంత ఋతువులో ఉల్లాసం తరలి వస్తుంది.బుద్ధ భగవానుని కథ గూడా అదే. ఒక వంక భార్య నిద్రపోతున్నది. ఒకవంక కుమారుడు నిద్రపోతున్నాడు. విశ్వమంతటా ప్రతిధ్వనిస్తున్న ఒక పిలుపు ఆయనకు వినబడింది. నీవు తెలివిగలవాడవు, నీవు ఆలోచనా శక్తి గలవాడవు, నీవు ధైర్యం, సాహసం గలవాడవు. నీవు ఇద్దరికోసం మాత్రమే బ్రతుకుతున్నావా? భార్యకోసం, పిల్లవానికోసం బ్రతుకుతున్నావా? ఆ పని ఎవరైనా చేయగలరుగదా! అన్న అంతర్వాణిని విన్న మరుక్షణం ఆయన చర చరా కదిలిపోయారు. బుద్ధ భగవానుడుగా మారిపోయారు.

శంకరాచార్య స్వామిలో పెల్లుబికిన ఉల్లాసం గూడా ఈ ఋతువుకు సంబంధించిందే. శంకరుల తల్లి మా వాడు గొప్పవాడవుతాడని అంటుండేది. పెద్ద చదువులు చదివి అధికారి అవుతాడనీ, పెళ్లయి కోడలు పిల్ల వస్తుందనీ, వాళ్ల పిల్లలను ఆడిస్తాననీ ముచ్చటపడేది. ఆమె పదే పదే అంటుండేది- "నేను చెప్పిన మాటలు వినకపోతే నరకానికి పోతా''వని. శంకరుల వారు- "సరే అమ్మమాట వినకపోతే నరకానికి పోతాను. నరకానికి మహానరకానికి పోయినా సరే, మంచి పనులు చేస్తాను''. ఆత్మ, పరమాత్మల మాట వినక ఎక్కడకు పోగలను? ఆలోచనలో పడ్డారు? ఎవరు? ఆదిశంకరులు.

అమ్మమాట లెక్కచేయరాదని శంకరులు నిశ్చయించారు. ఒకరోజున ఆయన నదిలో స్నానానికి పోయి, మునిగిపోతూ కేకలు పెట్టారు. అమ్మా నేనేం చేయను, నాకు మరణం ఆసన్నమయింది, శివుడు కనిపించి నేను సన్యాసం తీసుకుంటే నన్ను రక్షిస్తానన్నాడని. పాపం, ఆ తల్లి కడుపుతీపితో కేకలు పెట్టింది. నాయనా! నీవు బ్రతికి ఉంటే చాలు నిన్ను ఆ శంకరునికే అప్పగిస్తానని. వెంటనే శంకరులు నది ఒడ్డుకు ఈదుకు వచ్చారు. అమ్మా! ఇప్పుడు నేను శంకర భగవానుని సొత్తుని అన్నారు.

ఇటువంటి సంఘటనలు వసంత పర్వదినాన ఎన్నో జరిగాయి. అందులో ఒకటి నాకు సంబంధించింది. 55 సంవత్సరాల క్రిందట, వసంత పర్వ శుభదినాన, నా గురుదేవులు నా ఇంటికి వచ్చారు. నా సౌభాగ్యం నా ముంగిట వాలింది. వసంత పంచమి రోజున అందరికీ సౌభాగ్యం వస్తుంది. అందరికీ ఉల్లాసం వస్తుంది. ఒక తరంగం వస్తుంది. నావద్దకు గూడా ఒక కెరటం వచ్చింది. ఆ శుభదినాన, నా గురుదేవుల రూపంలో, నా మాస్టర్ రూపంలో వచ్చింది. నా గురుదేవులు ప్రకాశరూపంతో వచ్చారు. మహా పురుషులెవరు వచ్చినా, ఏదో ఒకటి తీసుకువస్తారు. ఒక మహాశక్తి వచ్చినపుడు, ఏదో ఒకటి తీసుకువస్తుంది. ఉత్తచేతులతో రారు వారెవరూ. నా గురువు కూడా, నా బాస్ కూడా, నా మాస్టర్ కూడా వసంత పంచమి రోజున సౌభాగ్యాన్ని తీసుకువచ్చారు. దాన్ని మనం కలసి పంచుకుందాం. అదే సౌభాగ్యం మీ అందరికీ కలిగితే మీరంతా ధన్యులే. అటువంటి ఉల్లాసపు వెల్లువ వచ్చినపుడు ఏం జరుగుతుంది? ఆపటం కష్టమవుతుంది. మంట పైకి లేచేటప్పుడు అతి వేగంగా లేస్తుంది. ఏ మాత్రం అవధి ఉండదు. సమయం వచ్చినపుడు గాలివాన హఠాత్తుగా వస్తుంది. నా జీవితంలో

**ప్రదర్శనకోసం మత సిద్ధాంతాలను ఆచరిస్తే దేవుడు నీకు ఏమీ ఇవ్వడు.**

అటువంటి తుఫాను వచ్చింది. నా గురుదేవులు వచ్చారు. రాగానే ఆత్మ సాక్షాత్కారం చేయించారు. పూర్వ జన్మలను చూపించారు. వెళుతూ, రెండు వస్తువుల నిచ్చి వెడుతున్నా నన్నారు. ఆ రెండు వస్తువులను మనం శక్తిపాతమనీ, కుండలినీ జాగరణ అనీ అంటాం. రెండూ కొన్ని సెకన్లలో జరిగిపోయాయి. నా కనుల ముందు కొన్ని ఇతర వస్తువులు దర్శనమిచ్చాయి. నాకు ప్రపంచమంతా మరోవిధంగా కనపడసాగింది.

శక్తిపాతం ఏవిధంగా చేశారు? శక్తిపాతం వల్ల ఏం జరుగుతుంది? శక్తిపాతమంటే మామూలుగా అనుకునే మాటలు గురువు వద్దనుండి కరెంటు ప్రవహిస్తుందనీ, అది శిష్యునిలో ప్రవేశిస్తుందనీ, అప్పుడు శిష్యుడు ఆపాదమస్తకం కంపించిపోతాడనీ! వాస్తవానికి అది శక్తిపాతం కానేకాదు. శారీరక శక్తిపాతం వల్ల ప్రయోజనం కలుగనే కలుగదు. శక్తిపాతమంటే చేతనా శక్తిపాతం. చేతనా శక్తిని ఉత్పన్నం చేసేది. చేతనా శక్తి భావనల రూపంలో, సంవేదనల రూపంలో కనిపిస్తుంది. శరీరంలో కుదుపు కూడా ఉండదు. దానికి చేతనతో, సాహసంతో మాత్రమే సంబంధం ఉంటుంది. చేతనలోని ఆ శక్తికి సాహసమని పేరు. అప్పుడు సిద్ధాంతాలను, ఆదర్శాలను పట్టుకు వేలాడటానికి జీవితంలో పనిపడుతుంది. దానికి చేపకు ఉన్నటువంటి సాహసం కావాలి. చేప ప్రవాహానికి ఎదురీదుతూ ముందుకుపోతుంది. అది చేతనాశక్తి. అది సాహసం. ఆదర్శాలను జీవితంలో అలవరచుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఎన్నో బలహీనతలు అడ్డుపడతాయి. లోభం, మోహం, వాతావరణం, మైత్రి, మిత్రులు అటువంటివి లక్షోపలక్షలు. ఇటువంటి బలహీనతలకు ఎదురొడ్డి చేప వలె ధైర్యంగా ముందుకు సాగేవాడు ఆధ్యాత్మిక దృష్టిలో బలవంతుడు.నన్ను మా గురుదేవులు ఇటువంటి శక్తిమంతునిగా తయారుచేశారు. ఇరవై సంవత్సరాల వయస్సులోనే ఇల్లు వదిలి, వెళ్లి కాంగ్రెసులో చేరిపోయాను. కొన్ని రోజులు కాంగ్రెసు కార్యాలు చక్కపెడుతూ, తరువాత జైలుకు వెళ్లాను. దీనినే ధైర్యమనీ, సాహసమనీ అంటారు. సిద్ధాంతాలకోసం, ఆదర్శాలకోసం మనిషిలో ఒక ఉన్మాదం పెల్లుబుకుతుంది. సామర్థ్యం వెలికి వస్తుంది. అతడు ఆదర్శవాది కాగలుగుతాడు. దీని పేరే శక్తిపాతం.

శక్తిపాతం ఏ విధంగా జరుగుతుందనటానికి మరో ఉదాహరణ. మీరాబాయి ఇంట్లో కూర్చుని ఏడుస్తున్నది. ఇంట్లో వాళ్లంతా నీవు మన కుల గౌరవా న్ననుసరించి ఇంట్లోనుంచి బయటకు పోరాదని ఆంక్షలు విధించారు. మీరా గోస్వామి తులసీదాస్‌కు ఒక లేఖ ద్వారా తన బాధను వెల్లడించింది. తులసీదాస్ జవాబు వ్రాశారు. "పరిస్థితులు ఎప్పుడూ అలాగే ఉంటాయి. మనఃస్థితిని మనం మార్చుకోగలిగితే పరిస్థితులు మారిపోతాయి. నీవు నీ మనఃస్థితిని మార్చుకో. అప్పుడు పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయి'' అని వ్రాస్తూ దాంతోబాటు ఒక కవితను గూడా వ్రాశారు.

"జాకే ప్రియనరామ వైదేహీ, తజియా తాహి కోటిబైరీ సమ యద్యపి పరమ సనేహీ'' అని. అది కవిత కాదు. శక్తిపాతం. శక్తిపాతాన్ని ఉదహరించటానికి ఆ రెండు పంక్తులూ నాకు ఎంతో ఉపకరిస్తాయి. అవి చదవగానే నాలో ఉత్సాహం, సాహసం పెల్లుబికి వస్తాయి. నాలో అపరిమితమైన శక్తి వస్తుంది. సిద్ధాంతాలను పాటించటంలో నాకు ఎదురైన విరోధులలో శంకరాచార్యులు, మహామండలేశ్వరులు, నా సన్నిహితులైన బంధుమిత్రులూ ఉన్నారు. బంగారు సంకెళ్లను ఛేదించాను. జీవితాంతమూ నాకోసం, మీ కోసం సమాజంకోసం, సమస్త విశ్వంకోసం, మహిళల అధికారంకోసం ఒంటరిగానే ముందుకు చొచ్చుకుపోయాను. అవినీతితో పోరాడటం కోసం, యుగనిర్మాణ విచార క్రాంతిని ప్రారంభం చేశాను. ఈ దృష్టికోణంలో నేను రాజపుత్రుడిని. నాలో అంతటా పరశురాముని పద్ధతిలో శౌర్య సాహసాలు నిండి ఉన్నాయి. నేను మహామానవుడను. నా గురుదేవులు నాకిచ్చిన శక్తిపాతం నాకు ధైర్య సాహసాల రూపంలో ఇచ్చినది.

కుండలిని అంటే ఏమిటి? కుండలిని అంటే నేను కరుణ అంటాను. వివేకశీలత అంటాను. కరుణ అంటే ఇతరుల దుఃఖాన్నీ, బాధనీ చూచి భరించలేకపోవటం. వివేకమంటే పరిష్కారం కొరకు ఉన్నత మార్గా న్నాచరించటం. జపాన్ గాంధీగా పిలువబడే కాబాగా తన జీవితకాలమంతా రోగులకు, వెనుకబడినవారికి, దరిద్రులకు, దీనులకు సేవచేశాడు. 24 గంటలూ ఆ సేవలోనే గడిపేవాడు. అదంతా జరిగింది కరుణవల్లనే. దీనినే నేను కుండలినీ జాగరణ అంటాను. దాని వల్ల మానవుని అంతరంగంలో కల్లోలం కలుగుతుంది. గగుర్పాటు కలుగుతుంది. ఒక వ్యథ కలుగుతుంది. భగవంతుడు ఒక వ్యక్తిలో ప్రవేశించినపుడు ఇట్టి కరుణ పెల్లుబుకుతుంది. వ్యథ ఉద్భవిస్తుంది. భగవంతుడు మట్టిబొమ్మ కాదు. ఆయన ఒక చేతన. చేతనకు స్వరూపం ఉండదు. బ్రహ్మము చేతన. చేతన కేవలం సంవేదన. సంవేదన ఏ విధంగా కలుగుతుంది? వివేకశీలత రూపంలో,కరుణ రూపంలో కలుగుతుంది. ఆదర్శ మానవుని అంతఃకరణ ఒక అయస్కాంతం

**నీవు మానవసేవ చేయని రోజు దుర్దినం.**

వంటిది. అది ఇతరులవద్ద నుండి సానుభూతిని, ప్రజల నుండి సమర్థనను, భగవంతుని నుండి సహాయాన్ని - ఈ మూడు వస్తువులనూ ఆకర్షించుకోగలుగుతుంది. కాగాబా వద్ద ఈ సూదంటురాయి ఉన్నది. ఆయన దీనులకు సేవ చేయాలని సంకల్పించగానే, ఈ మూడు వస్తువులూ ఆయనకు లభించాయి. అంతరంగంలో కరుణ జాగృతం కాగానే, మనిషి మహర్షి కాగలడు. భారతదేశంలో ఋషుల ఇతిహాసాలన్నీ ఇటువంటివే.

ఎవరికైనా, ఎప్పుడైతే కుండలిని జాగృతమవుతుందో, అప్పుడు సిద్ధులు వాటంతటవే వస్తాయి. చమత్కారాలు జరుగుతాయి. వాటిని అతడు చక్కగా వినియోగించి ఇతరులకు మేలు చేయగలడు. నా గురుదేవులు వచ్చారు. నా కుండలినిని జాగృతం చేస్తూవచ్చారు. నాకు లభించిన వివేకశీలతకు, కరుణకు బదులు తీర్చుకోవటానికి దానినంతటినీ ఖర్చుచేశాను.బదులుగా నాకు లభించినవి అపరిమితమైన సంతోషం, శాంతి, ప్రసన్నత. నా వద్దకు ఎవరైనా దుఃఖితులు, పీడితులు, కళ్లనీళ్లతో వస్తే ప్రాపంచిక దృష్టిలో వారికి తగినంత సహాయం చేయటం వల్ల నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. శారీరక దౌర్బల్యం మొదలుకొని మానసిక దౌర్బల్యం వరకూ కలిగిన దుఃఖితులు, మానసిక దృష్టిలో బలహీనతలు ఉండి పతితులైనవారు ఒకప్పుడు ధనికులై ఇప్పుడు నిర్ధనులైనవారు నా వద్దకు వచ్చి, సంతోషంతో తిరిగిపోతుంటే నాకు కలిగే ఆనందం వర్ణనాతీతం. ఇదంతా కుండలినీ చమత్కారమే.

ఈ రోజుల్లో నా మనస్సులో ఒకే ఒక వ్యథ మెదలుతున్నది. నావద్దకు వచ్చిన వారికి నాకు లభించిన సౌభాగ్యంలో ఒక అంశ దొరికినా, పేరు ప్రతిష్ఠలు కలిగి వారు అజరామరులు కాగలరు. చరిత్ర పుటలలో వారి పేర్లు లిఖింపబడతాయి. ప్రస్తుతం వారి జీవితాన్ని చుట్టుముడుతున్న సమస్యలు, అశాంతి మటుమాయం కాగలవు. తమ సమస్యలను పరిష్కరించుకోవటమేగాక వేలాది మంది ఇతరుల సమస్యలను గూడా పరిష్కరించగలుగుతారు. మీరు గురువుగారివద్దకు వచ్చి కష్టాలు తీర్చమని అడగటం కాదు చేయవలసింది. గురువే మీవద్దకు వచ్చి నాకు సహాయం చేయమని అడిగే స్థితికి మీరు ఎదగాలి. వివేకానందుని వద్దకు రామకృష్ణ పరమహంస వెళ్లి నా ఇక్కట్లు తీర్చమని అడిగాడు. నా దగ్గరకు నా గురుదేవులు వచ్చి నా కష్టాలను తీర్చమని అడిగారు. ఆయన ఇలా అన్నారు - "ప్రపంచ స్వరూపం మారిపోవాలని నేను వాంఛిస్తున్నాను. చట్టం మారిపోవాలి. చట్రం మారిపోవాలి. ప్రపంచం కాయకల్పాన్ని పొందాలి." "అది మీరొక్కరే చేయలేరా?" "నేను చేయలేను". మైక్ చేసే పని నాలుక చేయలేదు. రెండూ కలిస్తే వాణి ఎంత దూరమైనా వినిపిస్తుంది. నా గురుదేవులు వాక్కు అయితే నేను మైకుని. ఆయన విచారధారను విశ్వమంతటా వినిపించేలా వినిపిస్తాను. మీరు గూడా నాకువలెనే తయారు కావాలని నేను కోరుకుంటున్నాను. నా సమర్థతవలన నేను ఎన్నుకోబడ్డాను. మీరుగూడా యోగ్యతను సంపాదించుకోండి. అప్పుడు భగవానుని రెండు చేతులలోనూ ఉన్న శక్తిపాతం, కుండలిని మీకు గూడా లభిస్తాయి. అందుకు షరతు ఒక్కటే. మీరు యోగ్యతను, పాత్రతను సంపాదించుకొనండి. యోగ్యత లేకపోతే కష్టం. కుండలినీ జాగరణకు పాత్రత, శ్రద్ధ కలిగి ఉండాలనేది మొదటి షరతు.

ఈ రోజు ఉన్నతాదర్శాలతో నిండిన నా జీవిత చరిత్రను (గురుదేవుల జీవిత చరిత్ర తెలుగులో ఆత్మకథ పేరుతో దొరుకుతుంది) చదువుతూ ఉండండి. నేను ప్రతి అడుగూ, వసంత పంచమినాడే వేశాను. ప్రతి వసంత పంచమికి నా అంతరంగంలో ఒక తరంగం ఉద్భవిస్తుంది. ఒక వేదన ఉద్భవిస్తుంది. ఆ ఉత్సాహం, పొంగు, నా స్వార్థకోసం కాదు. సమాజం కోసం, లోకకళ్యాణం కోసం, ధర్మం కోసం, సంస్కృతి కోసం, సేవ కోసం. ఈ వసంతపర్వ శుభదినాన నాలో మూడు తరంగాలు పొంగివచ్చాయి. మొదటిది, విశ్వమంతటా ఆస్తికతతో గూడిన వాతావరణం నిండి ఉండాలని. ఆస్తికతతో గూడిన వాతావరణం విస్తరించాలి. ఈశ్వరుని గుర్తింపుతో పాటు అనేక సమస్యలు కలసి ఉంటాయి, ఈశ్వరుడు ఒక అంకుశం. ఆ అంకుశాన్ని మనం స్వీకరించాలి. కర్మఫల సిద్ధాంతాన్ని స్వీకరించాలి. ఒక సర్వోన్నత శక్తి, నైతికశక్తి ప్రపంచమంతటా పనిచేస్తున్నదన్న అనుభవం కలగాలి. దానితో అడుగు కలిపి నడిస్తే మనకు మంచి కలుగుతుంది. అదే ఆస్తికతా సిద్ధాంతం. దాన్ని వ్యాప్తి చేయడానికి మనం గాయత్రీ మందిరాలను నిర్మిస్తున్నాం. గాయత్రీ మాత అంటే అర్థం వివేకశీలత, కరుణ, పవిత్రత, శ్రద్ధ. ఈ సద్గుణాలనన్నిటినీ వ్యాప్తి చేయటానికే ఇంటింటా, మీ ఇళ్లలో, బంధువుల ఇళ్లలో గాయత్రీమాత చిత్రపటాన్ని పెట్టుకోమని నేను కోరేది. ఇంటింటా, కుటుంబమంతటిలో ఆస్తికత వాతావరణం నిండాలి.

గాయత్రీ, యజ్ఞపరంపర సజీవంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. సంచార పుస్తకాలయాలతో మొదలుకుని, జ్ఞానరథాల వరకూ నడపటానికి రోజూ రెండు గంటల సమయాన్ని వినియోగించండి. ఈ రెండు గంటలూ భగవంతుని భజన చేసినట్లు. భజన అంటే అర్థం భగవంతుని ఆలోచన వ్యాప్తిచేయటం.

**మన వ్యవహరణయే మన నిర్మల హృదయానికి సాక్షి.**

మీరు గూడా కొంత సమయాన్ని గాయత్రీ పూజకు కేటాయించండి. నావద్దనుండి నా గురుదేవులు సమయదానం కోరినట్లుగానే, మీ వద్దనుండి నేను సమయదానాన్ని కోరుతున్నాను. మీ సమయంలో కొంత భాగాన్ని ఆస్తికతను వ్యాప్తిచేయటానికి ఉపయోగించండి. కొంత త్యాగం చేసినపుడు మాత్రమే ప్రతిఫలం వస్తుంది.

ఈ మధ్యనే బ్రహ్మవర్చస్‌ను గురించి ప్రకటన చేయబడింది. బ్రహ్మవర్చస్ అనేది ఒక సిద్ధాంతం.మనుష్యుని అంతరంగంలో నిక్షిప్తమై ఉన్న అనంతమైన శక్తిని నిద్రలేపాలి. అట్టి జాగరణకు తపస్సు కావాలి. తపస్సు చేయటం వల్లనే నేను నాలోని నిద్రాణ శక్తులను జాగృతం చేశాను. తపస్సు చేయటం అంటే ఆహార విహారాదుల నుండి బ్రహ్మచర్యం వరకూ గల బాహ్య సాధనతో పాటు, అంతరాత్మను, చేతనను తపింపచేయాలి. తపస్సుతో శక్తులు కలుగుతాయి. మనుష్యునిలో దైవత్వం ఉదయిస్తుంది. అందుకు గాను సామాన్య జీవనంలో ఆస్తికతను కలిగి ఉండి, బాహ్య జీవనంలో తపశ్చర్యను అవలంబించాలి. ఆస్తికత అంటే అర్థం సత్ప్రవర్తన. తపశ్చర్య అంటో లోకహితం కొరకు, సిద్ధాంతముల కొరకు కష్టాలను సహించటం. తపస్సు ఎలా చేయాలనేది బ్రహ్మవర్చస్సులో నేర్పబడుతుంది. అది ఒక ప్రతీక, ఒక సింబల్. ఒక స్థానం.మనుష్యుని అంతరంగంలో దైవత్వం ఉదయించటం, ధరిత్రిపై స్వర్గం అవతరించటం అనేవి నా ప్రస్థానంలో రెండు మెట్లు. నా కుండలినీ, శక్తిపాతం ఈ రెండు ప్రయోజనాల కొరకే. తపస్సులో నిమగ్నం కావటం, ప్రజోపయోగం కొరకు జీవించటం అంటే మనుష్యునిలో దైవత్వం ఉదయించటమే.

ధరిత్రిపై స్వర్గావతరణ ఏమిటంటే - మంచి వాతావరణాన్నే స్వర్గం అంటారు. స్వర్గం వైకుంఠంలోనే లేదు. భూమి మీద గూడా ఉండవచ్చు. ఎక్కడ మంచి మనుష్యులు, ఉన్నతులు, నీతిమంతులు నిండి ఉంటారో ఆ ప్రదేశమే స్వర్గం. ధరిత్రిపై స్వర్గాన్ని నిర్మించేటందుకు ముందు ఒక ప్రాంతాన్ని ఒక గ్రామాన్ని ఎంచుకుని, దానిని త్యాగంచేసే, దేశ సేవ చేసే, సిద్ధాంతాలను విశ్వసించి ఆచరించే, నవ్వుతూ, నవ్విస్తూ, శాంతితో ప్రేమతో అన్యోన్యంగా కలసి మెలసి జీవించే సముదాయంతో నింపాలని నా కోరిక. అందుకు నమూనాగా నేను గాయత్రీ నగర్ (శాంతికుంజ్)ను రూపొందించాను. నేను వాల్మీకి మహర్షిని. వాల్మీకి మహర్షి లవకుశులను తీర్చిదిద్దినట్లు, నేను బాల బాలికలను తీర్చిదిద్దుతాను. మహిళల నందరను సీతామహాసాధ్వివలె తపస్వినులుగా, గర్వించే తల్లులుగా తీర్చిదిద్దుతాను. గాయత్రీ నగర్, బ్రహ్మవర్చస్ రెండూ వసంత పంచమి రోజునే స్థాపించబడ్డాయి. ఆస్తికతకొరకు, జ్ఞానయజ్ఞం కొరకు, విచారక్రాంతి కొరకు ఇది నమూనా.

తపశ్చర్య సిద్ధాంతాన్ని సజీవం చేయటానికి, జ్ఞాన, విజ్ఞానాల కొరకు బ్రహ్మవర్చస్. ఆస్తికతను సజీవం చేయటానికి, ధరిత్రిపై స్వర్గావతరణకు, త్యాగం, బలిదానం, సేవచేసేవారికోసం గాయత్రీనగర్. ఇక్కడకు వచ్చే వారంతా నావద్ద నుండి ప్రేమను, సంస్కారాన్ని, ప్రేరణను, ప్రకాశాన్ని, ఆదర్శాలను పొందగలరు. నైమిశారణ్యంలో సూత, శౌనకుల సంవాదం జరుగుతుంటే బ్రాహ్మణులు వింటుంటారు. జ్ఞానాధ్యయనం జరుగుతుంది. లోకోపకారం జరుగుతుంది. అటువంటి వాతావరణాన్ని ఇక్కడ వ్యాపింపజేయాలని మా కోరిక. అంతా స్నేహ సద్భావనలతో నిండి, ప్రేమను గూర్చి, సమాజ సేవ గురించి ఇతరులను ఉద్ధరించడం గురించి మాట్లాడండి. ఈ నగరం భావిజీవితానికీ, భూతల స్వర్గానికీ నమూనాగా ఉండాలని నా కోరిక. శాంతి పరమార్థాలు ఎక్కడ ఉంటే అదే స్వర్గం. మీ ఉద్దేశాలు ఉన్నతంగా ఉంటే, మీ జీవితంలో లోటు ఉండదు. పరాభవం కలుగదు. కొరత ఉండదు. ఇది నాకు నా గురుదేవులు ఇచ్చిన వాగ్దానం. దానిని మీకు నేను అందిస్తున్నాను.

నా ఇంకో కోరిక మిగిలిపోయింది. వసంతపర్వదినాన, మీ అందర్నీ పిలిచి, నా అంతరంగంలో దాగి ఉన్న వ్యధను, కరుణను, జీవితాన్ని పవిత్రం చేయటానికి నేను పడే సంవేదనను, దేవత్వాన్ని వెలికితీసి, మీకు చూపాలి. మీకు ఈ వస్తువులు ఇష్టమైతే చూడండి. చేతనైతే కొనుక్కొని తీసుకుపొండి. నా గురువునుండి నేను అనుగ్రహాన్ని కొనుక్కున్నాను. మీరు గూడా నావద్ద నుండి అనుగ్రహాన్ని కొనుగోలుచేయండి. శాంతిని కొనండి. మహత్తును కొనండి. విశ్వంలో శ్రేష్ఠమైన ప్రతిదాన్నీ కొనండి. వాటినన్నిటినీ కొనుక్కుంటే మీరు ధన్యులవుతారు. కొనుక్కోవటానికి ఎక్కడికీ పోనవసరంలేదు. నా గురువుగారు నాకు ఇచ్చినట్లు, శక్తిపాతాన్ని, కుండలినిని మీరూ నావద్దనుండి పొందగలరు. దాని ఖరీదు మాత్రం పాత్రత, శ్రద్ధ,సచ్ఛీలం, సత్ప్రర్తన, అంశదానం, సమయదానం, విచారక్రాంతికి దోహదం చేయడం, అఖండజ్యోతి, గాయత్రీ పరివార్ వంటి పత్రికలను, యుగసాహిత్యాన్ని చదవడం, చదివించడం, ప్రచారం చేయటం వంటివి.

K K K

**ఆశతో తెరచి ప్రయోజనంతో మూసేదే మంచి పుస్తకం.**

**నావారితో నామాట**

# ఇది యుగచేతనా విస్తరణ సంవత్సరం

మథురలోని గాయత్రీ తపోభూమి నుండి వీడ్కోలు తీసుకునే తరుణం. దేశమంతటిలో యజ్ఞాల పరంపర. 1926 నుండి 1969 వరకు జరిగి మహత్తర కృషి అంతటికీ ఒక కొత్తదిశ ఇచ్చే తరుణం. హృదయంలో పరిజనులనుండి దూరమవుతున్నాననే వేదన. ఇలాంటి పరిస్థితులలో పరమపూజ్య గురుదేవులు 1969 ఆగస్టు అఖండజ్యోతి విచారక్రాంతి ప్రత్యేక సంచికలో వ్రాసిన వాక్యాలు నేటికీ అందరూ మననం చేసుకోదగినవి. వారిలా వ్రాశారు -

"ప్రపంచంలో ఉన్నతోన్నత వ్యక్తులూ, ఉత్తమోత్తమ వ్యక్తులూ ముగ్గురు - (1) సంత్‌లు (2) సంస్కర్తలు (3) అమరవీరులు. జాగృత ఆత్మలు ఆయా సమయాలలో పరమేశ్వరుని వెలుగుబాటను అనుసరిస్తూ పురోగమిస్తారు. తమ కార్యశూరత, సహృదయతలు ఆధారంగా మహామానవులకు లభించే పై మూడు గౌరవాలకూ తమ పాత్రతను నిరూపించుకుంటారు. ఈరోజులలో సూక్ష్మ జగత్తులో ఇదే జరుగుతోంది. బ్రహ్మ ముహూర్తంలో సాధకులూ, తాపసులూ మేలు కుంటారు. ఆ పుణ్యవేళలో సాధనలో మునిగిపోతారు. మరోప్రక్క విషయ సుఖాలలో మునిగి ఉన్న జనం మరింత గాఢ నిద్రపోతారు. ఇవి బ్రహ్మ ముహూర్తపు రోజులు. అసురత్వం నిండిన, తపస్సుతో ఆవరించబడిన రాత్రి ముగుస్తోంది. జ్యోతిర్మయమైన ప్రభాతం ఉదయిస్తోంది. ఇది సంధికాలం. ఇది ఉషోదయ వేళ. పవిత్ర ఆత్మలు మేలుకోవాలనీ, పునీతమైన తన ధర్మ కర్తవ్యంలో నిమగ్నులు కావాలనీ ఆలయాలనుండి శంఖనాదం వినిపిస్తోంది. గాయత్రీ పరివార్ ప్రారంభించిన యుగనిర్మాణ యోజన ఒక శంఖనాదం. సంస్కారం పొందిన వ్యక్తులను మేలుకొలపడానికీ, ప్రభాతకాలపు కర్తవ్యాలను నిర్వహించడానికీ ప్రేరణ ఇస్తోంది ఆ శంఖనాదం. (3వ పుట).

పై వాక్యాలలోని ఒక్కొక్క శబ్దం యుగపురుషుని గర్జన. నవయుగంలో జరగబోయే పరిణామాలనూ, 21వ శతాబ్దంలో ఆవిర్భవించే కృతయుగ సమాజాన్నీ, భారత్ విశ్వగురువు స్థానాన్ని అందుకునే మహదవకాశాన్ని భవిష్యత్తును దర్శించి వర్ణిస్తూన్న మాటలు అవి. 1969 నుండి 2004 వరకు 35 సంవత్సరాలలో సాగిన తుఫానువంటి మహోద్యమం, వివిధ స్థలాలలో యుగచేతన విస్తరించడం అందరికీ తెలిసిన పరిణామాలే. యుగ వసంత వేళ ఇది. ఒక యుగం గతిస్తోంది. మరో యుగం ఉదయిస్తోంది. గతిస్తూన్నది హేమంతపు బిగుసుకుపోయే స్థితి, దాస్యపు అంధకారం, వెనుకబడినతనం నిండిన దుస్థితి. ఉదయిస్తూన్నది వసంతపు నవోల్లాసపు గిలిగింత, ఉత్సాహపు వెల్లువ ఇచ్చే పులకింత, నిర్మాణాత్మక భావ ధారతో నిండిన సమయం. 21వ శతాబ్దపు బ్రహ్మ ముహూర్తం ఇది. మనమంతా ఈ సమయపు కీలక ప్రాధాన్యాన్ని గుర్తించాలి. మేలుకోవాలి. మన సాధనాత్మక పురుషార్థాన్ని తీవ్రతరం చేయాలి. 2004 జనవరి 26న వసంతం ప్రారంభమయింది. ఈ హోలికా పర్వం మార్చి 5-6 తేదీలవరకు 40 రోజులపాటు సాగుతుంది. యుగ వసంతంలో వచ్చిన ఈ సంవత్సరం 'యుగచేతనా విస్తరణ సంవత్సరం'. ఇది 2005 ఫిబ్రవరి 13 వరకు నడుస్తుంది. ఇది ప్రత్యేకమైన బాధ్యతలు తీసుకుని వచ్చింది. మనమంతా ఆ బాధ్యతలను మహోత్సాహంతో నిర్వహించవలసి ఉంది.

పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు - "యుగ కర్తవ్యాల పిలుపు అందుకుని పరమార్థ పథకాలకోసం వినియోగపడిన శక్తి మామూలుగా కనిపించే వ్యక్తి మహామానవుడు అవుతాడు." మహామానవులు ఆకాశంనుండి ఊడిపడరు. యుగప్రవర్తకులు ప్రత్యేక సమయాలలో జన్మిస్తారు. నిజమే. అయితే, పునాదిరాయిగా మారవలసినవారు, పరివర్తకు ప్రాతిపదికగా మారవలసినవారు సాధనా సమరంలో విజయం సాధించి మామూలు మనుషులనుండి వెలికివచ్చి తపిస్తూ మహామానవులుగా రూపొందుతారు. యశస్సును సంపాదిస్తారు. యుగఋషి ఇచ్చిన పిలుపు యుగనిర్మాణం, ధరిత్రి భవిష్యత్తును మార్చడానికి వచ్చిన యుగప్రవర్తకులు ఆయన. స్వామి వివేకానంద, మహర్షి అరవిందులు తయారు చేసిన సారవంతమైన భూమిలో కృతయుగపు విత్తనాలు చల్లడానికి వచ్చిన దివ్య కృషీవలుడు ఆయన.

ఇప్పుడు పంట కోతకు వచ్చింది. మహామానవుల పంట ఇది. చేను నిండిన పంట ఇది. పాల ఉత్పత్తి పెరిగి గతంలో శ్వేత విప్లవం వచ్చింది. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగి హరిత విప్లవం వచ్చింది. ఇప్పుడు భావ విప్లవం వస్తోంది. జీవం జవం నిండిన మహామానవులకు ధరిత్రి అంతటికీ పంపే విప్లవం ఇది. విశ్వమంతటినీ సాధనామయంగా, సంస్కృతిమయంగా రూపొందించే విప్లవం ఇది. ఈ స్థితిలో ఎవరైనా భ్రమలో పడడం, కర్తవ్యం ఏమిటో తెలుసుకోక పోవడం నిజంగా సిగ్గుపడవలసిన విషయం. కొత్త తరం భారత్‌ను విశ్వంలోని మహామానవుడుగా రూపొందించబోతోంది. వసంత కాలపు ఉల్లాసంతో ఈ వాక్యాలను చదువుతూన్న ప్రతి పాఠకునికీ ఇందులో పాత్ర ఉన్నది.

2002, 2003 సంవత్సరాలు సాధనా సంఘటన పటిష్టీకరణ సంవత్సరాలుగా జరిగాయి. 2002 ప్రారంభంలో గాయత్రీ కుంజ్‌లో 'దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ' స్థాపన జరిగింది. అందులో సాధన, ఆరోగ్యం, విద్య, స్వావలంబన విభాగాలు ప్రారంభమైనాయి. గత రెండు సంవత్సరాలలో ఇవి సాధించిన ఫలితాలు మహత్తరమైనవి. సాధనలో ఉన్నత స్థాయిని అందుకుని, సమాజంకోసం సర్వస్వార్పణ చేసే నవతరం కార్యకర్తలు, యువతీ యువకులు ఇక్కడ తయారవుతున్నారు. మత విజ్ఞానం, సమగ్ర ఆరోగ్య యాజమాన్యం, యోగం, మనస్తత్వ శాస్త్రాలలో నిష్ణాతులైన విద్యార్థినీ విద్యార్థులు తమను తాము మన మిషన్‌కు అంకితం చేసుకుంటున్నారు. యుగనిర్మాణ కార్యంలో పూర్తిగా నిమగ్నం కావాలని వారు కోరుకుంటున్నారు. మహత్తర విషయం ఇది. మహాదృష్టం ఇది. పటిష్టీకరణ సంవత్సరంలో దేశాన్ని ఏడు జోన్‌లుగా విభజించి

**ఇతరుల దోషాన్ని చూచి శిక్షించే ముందు నీ దోషాన్ని చూచుకో.**

వికేంద్రీకరించడం జరిగింది. జోనల్, సబ్ జోనల్ కార్యాలయాలు స్థాపించబడ్డాయి. శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. శాంతికుంజ్ కూడ గాయత్రీ తపోభూమితో కలసి కేంద్ర స్థాయిలో ప్రశిక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. క్రమంగా అన్ని జోన్‌లూ క్రియాశీలం అవుతున్నాయి. తమ పరిసరాల బాధ్యతలను నిర్వహించడానికి సమర్థం అవుతున్నాయి.

ఈ యుగచేతనా విస్తరణ సంవత్సరంలో మరొక శుభ సందర్భంకూడా కలిసివచ్చింది. 2004 మన సద్గురువు వైజ్ఞానిక అధ్యాత్మవాదం ప్రతిపాదనకై 1979లో స్థాపించిన బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్‌కు 25వ సంవత్సరం. ఈ రజత జయంతి సంవత్సరాన్ని మనం జరుపుకుంటున్నాం. ఇందులో జాతిలో, విశ్వంలో మేధావులను మేలుకొలిపే మహత్తర బాధ్యతను మనం నిర్వహించబోతున్నాం. 2004 జనవరి 26 నుండి 2005 ఫిబ్రవరి 13 వరకు దేశమంతటిలో బ్రహ్మవర్చస్ గత 25 సంవత్సరాలలో సాధించిన విజయాలను, దాని విస్తృత రూపంగా ఏర్పడిన దేవసంస్కృతి విశ్వవిద్యాలయం పొందిన సాఫల్యాలను అందరికీ తెలియపరచే కార్యక్రమాలు జరుగుతాయి. ఇవి 2005లో కూడ జరుగుతాయి. 2005 సంవత్సరానికి ప్రజాసంస్థాన్‌ల, శక్తిపీఠాల నిర్మాణానికి సంకల్పం జరిగి 25 సంవత్సరాలు అవుతాయి. ఈ సంవత్సరం బ్రహ్మవర్చస్‌ను ప్రత్యేకంగా అలంకరిస్తారు.

2004 – 2005 యుగచేతనా విస్తరణ సంవత్సరంలో దిగువ ప్రముఖ కార్యక్రమాలు జరగాలని నిర్ణయమయింది –

1 కేంద్రంలో శిక్షితులైన సమయదానుల బృందాలను జోనల్ కేంద్రాలలో నియమించడం ఈ దీర్ఘకాలిక సమయదానులకు 6,7,8 తేదీలలో ఒక ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించబడుతోంది. జోనల్ కార్యాలయం, సబ్ జోనల్ కేంద్రం, వాటి శాఖ ఉపశాఖల నిర్మాణంపై ఈ శిబిరంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అన్ని కేంద్రాలలోనూ ప్రచారకులు, ప్రశిక్షకుల స్థాయి కార్యకర్తలకు ముమ్మర శిక్షణ సంవత్సరం పొడవునా జరుగుతుంది.

2 గాయత్రీ ఉపాసనా ప్రశిక్షణ, జీవించే కళ, యోగ వ్యాయామ, యోగ చికిత్సలు, వైజ్ఞానిక అధ్యాత్మవాదం, యజ్ఞోపతీ (యజ్ఞ చికిత్స), ఉద్రిక్తత నివారణ, ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులపై ప్రత్యేక స్లైడ్‌లు తయారు చేయడం. ప్రత్యేక బృందాలు వీటిని దేశమంతటా ప్రదర్శిస్తాయి. పుస్తక మేళాల రూపంలో పరమపూజ్య గురుదేవుల సాహిత్యంతో కూడిన ఒక అభినవ ప్రదర్శనాన్ని వివిధ స్థలాలలో నిర్వహించడం.

3 దేశమంతటా ప్రజ్ఞోపనిషత్ ఆరు ఖండాల స్థాపన. అలాగే క్రాంతిధర్మ సాహిత్యంతోపాటు వైజ్ఞానిక అధ్యాత్మవాద సాహిత్యాన్ని ఇంటింటా స్థాపన చేయడం. రజత జయంతి సందర్భంగా కొత్త సాహిత్య నిర్మాణం. గాయత్రి తపోభూమి, అఖండజ్యోతి సంస్థాన్‌ల సహకారంతో భారీ స్థాయిలో పూజ్యవరుల మౌలిక సాహిత్యాన్ని ప్రచురించడం, ప్రజలలోకి తీసుకువెళ్లడం,

4 ప్రసిద్ధ తీర్థ స్థలాలలో అయిదు రోజుల సాధనా ప్రశిక్షణ శిబిరాలను, యువజన సమ్మేళనాలను నిర్వహించడం. దేశంలో యువజనుల కోసం స్వావలంబన ప్రధానమైన కార్యక్రమాల నిర్వహణ. విదేశాలలో 'యూత్ క్యాంప్'లు నిర్వహించడం. వాటికోసం పాఠ్యక్రమం తయారీ. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఉత్తీర్ణులైన పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులచేత ఈ పని చేయించడం వీరిద్వారా ఆదర్శ వివాహ ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం.

5 యోగ ప్రశిక్షణ కేంద్రంగా సప్త ఉద్యమాలను, దీప యజ్ఞం కేంద్రంగా కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించడం.

6 బ్రహ్మవర్చస్ గత 25 సంవత్సరాలలో సాధించిన విజయాలను వివరించే ఒకటి రెండు పుస్తకాల ప్రచురణ. సాధ్యమైనంతవరకు వాటిని అన్ని భాషలలోనికీ అనువదించి ప్రచురించడం. బ్రహ్మవర్చస్‌లో ఒక ప్రత్యేక ప్రదర్శనం నిర్మాణం. పరిశోధక సభ్యులను చేర్పించే ఉద్యమానికి ప్రారంభం.

7 ఇంగ్లీషు అఖండజ్యోతి పాఠకుల సంఖ్యను పెంచడానికై మహానగరాలలో, విశ్వ విద్యాలయాలలో, విదేశాలలో ఉద్యమాలు, మిషన్ నడిపే వివిధ పత్రికల పాఠకులు ఒక్కొక్కరు కనీసం అయిదుగురు కొత్త పాఠకులను చేర్పించే ఉద్యమం.

8 దేశమంతటిలో వివిధ స్థలాలలో సంఘ శక్తికి ప్రతీక అయిన 'ఎర్ర కాగడా' యొక్క పెద్ద పెద్ద చిత్రాలను (వ్యాఖ్యతోసహా) స్థాపన చేయడం, సత్సంకల్పాలపై, గాయత్రీ మంత్రంపై వివిధ మతాలలో వ్యాఖ్యతో కూడిన కరపత్రాలను వ్యక్తివ్యక్తికీ పంచడం.

9 భారతీయ సంస్కృతిజ్ఞాన పరీక్ష నమూనాలో దేశమంతటా ప్రజ్ఞాపురాణం – ప్రజ్ఞోపనిషత్‌లపై దేశమంతటా పరీక్షలు నిర్వహించడం. ఉత్తీర్ణులకు ప్రత్యేక ప్రమాణపత్రాలు అందజేయడం.

10 ప్రతి జిల్లాలో సబ్ జోనల్ కేంద్రాల ద్వారా నెలలో వారం రోజులు గ్రామ ప్రదక్షిణలు, సైకిల్ తీర్థయాత్రలు నిర్వహించడం. ఈవిధంగా యుగచేతనను గ్రామగ్రామానికీ విస్తరించడం.

ఈ పది చర్యల ఫలితంగా ఈ సంవత్సరంలో యుగపరివర్తనకోసం పెల్లుబికిన నూతన చేతన దేశంలో, ప్రపంచంలో విస్తరించడం నిశ్చయం, మొత్తం జాతి, ప్రపంచం సాంస్కృతిక చేతన రంగంలో, జీవన సాధన రంగంలో అతివేగంగా ప్రగతి పొందడంఖాయం. పరమపూజ్య గురుదేవులు ఇలా విస్పష్టంగా ప్రకటించారు – "ఈ భారతవర్షం మేలుకొన్న రోజున దశదిశలూ కంపించిపోతాయి. భారతదేశంవద్ద అధ్యాత్మ – తత్వజ్ఞానాలు, శౌర్య సాహసాలు, విజ్ఞానం, సంపదల పరంపరగా పెట్టుబడి భారీయెత్తున ప్రోగుపడి ఉంటుంది. ఆ సంపదలు ఆధారంగా భారతదేశం విశ్వంలో ఒక అద్భుత శక్తిగా, అనుపమ శక్తిగా ఆవిర్భవిస్తుంది. సర్వశ్రేష్ఠతతో నిండి ఉన్నది మన చరిత్ర. ఇక భవిష్యత్తు కూడ మహోజ్వలంగా ఉండబోతున్నది. భారతదేశం విశ్వానికి నాయకత్వం, మార్గదర్శనం, సహకారం అందించగలుగుతుంది."

ఈ పిలుపును అందుకుంటున్న వారికి ఇదే మా ప్రత్యేక ఆహ్వానం.

J J J

**ఆత్మవిశ్వాసం దెబ్బతింటే, సామర్థ్యం పనిచేయదు.**

## శాంతికుంజ్ సమాచారం

# విజ్ఞానానికి అంకుశం ఆధ్యాత్మికత

– డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ

ఆధ్యాత్మికత అంటే జ్ఞానం. ఇది మనల్ని బంధవిముక్తులను చేస్తుంది. విజ్ఞానం అంటే విషయ పరిజ్ఞానం. ఈ రెంటికీ వైరుధ్యం లేదు. పైగా ఆధ్యాత్మిక దృక్పథంలోపిస్తే విజ్ఞానం దారితప్పే అవకాశం ఉంది. విజ్ఞానాన్ని ఆధ్యాత్మికత అనే కళ్లెంతో అదుపుచేయాలనీ, అప్పుడే విజ్ఞానంలోని విధ్వంసకతను నియంత్రించగలుగుతామనీ పరమపూజ్య గురుదేవులు బోధించారు.

- అని దేవసంస్కృతి విశ్వవిద్యాలయం కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ వివరించారు. విశ్వవిద్యాలయంలో "విజ్ఞానం, ఆధ్యాత్మికత, సామాజిక విలువలు'' అనే అంశంపై ఇటీవల రెండు రోజులు జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు -

మన దేశంలో ప్రతిభ ఉంది. ముడి సరుకు ఉంది. సహజ వనరులు ఉన్నాయి. ఇవన్నీ పుష్కలంగా ఉన్నప్పటికీ, మనం వీటినుండి పూర్తి ప్రయోజనం పొందలేకపోతున్నాం. ఉత్తరాంచల్‌లో ప్రవహించే చిన్న చిన్న జలపాతాలనుండి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చు. వ్యవసాయానికి ఉపయోగించే నాగలినీ, గృహిణులు వాడే కవ్వాన్నీ విజ్ఞానం సహాయంతో మెరుగుపరచవచ్చు. ఇందుకు కావలసిన ప్రతిభ, కళా నైపుణ్యం ఆధ్యాత్మికత నుండి లభిస్తాయి. ఇలాంటి పనులకోసం నాగపూరులో వైజ్ఞానికుల సహాయంతో 'ఆధ్యాత్మిక విజ్ఞాన సభ'' అనే సంస్థను స్థాపించారు. దేశమంతటిలో ఇలాంటి సంస్థలను ప్రారంభించేందుకు కృషి జరుగుతోంది.

వైజ్ఞానిక అధ్యాత్మవాదాన్ని దేశంలోని మేధావులకు వివరించడానికై 2004లో ప్రతి జిల్లాలో ప్రజ్ఞా పరిషత్‌ల స్థాపన జరుగుతుంది. బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజతోత్సవం సందర్భంగా వివిధ స్థలాలలో మేధావుల సమావేశాలు జరుగుతాయి.

విజ్ఞానానికి అనుపానం జ్ఞానం. జ్ఞానానికి అనుపానం భావ సంవేదన, హృదయ స్పందన. భావ సంవేదనలతో కూడిన విద్య జాతి నిర్మాణానికి దోహదం చేస్తుంది. దేశాన్ని జగద్గురువుగా చేస్తుంది. 2020 నాటికి భారతావని అగ్రరాజ్యం కాగలదనే ఆశాభావాన్ని మన రాష్ట్రపతి వ్యక్తం చేశారు. సూక్ష్మ జగత్తులో పని చేస్తున్న ఋషుల తపోబలం ఇందుకు ప్రేరణ, ఆధారం.

### ఈ యుగపు ధన్వంతరి పరమపూజ్య గురుదేవులు

పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ ఆరితేరిన వైద్యులు, ఈ యుగపు ధన్వంతరులు - అని డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ శాంతికుంజ్‌లో జరిగిన ధన్వంతరి జయంతి ఉత్సవంలో అన్నారు. ఋషి యుగళం కృషివల్ల కోట్లాది పరిజనులకు చక్కని ఆరోగ్యం చేకూరిందని వివరించారు.

2005 నాటికి మూలికావైద్యం, ప్రకృతి వైద్యం, యోగాలకు సంబంధించిన ఔషధాలనూ, సూత్రాలనూ దేశమంతటికీ అందించేందుకు దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ఒక పథకం రూపొందిస్తోందని ఆయన తెలిపారు.

డాక్టరు అనురాధ ద్వివేదీ ఉత్సవంలో ప్రసంగిస్తూ, ఆయుర్వేదం కేవలం ఒక వైద్యవిధానం కాదనీ, మానవ జీవితాన్ని మలచే దివ్య జ్ఞానమనీ అన్నారు.

### యువతరానికి ఆదర్శం

డాక్టరుగా పి.జి.కోర్సును అభ్యసించడానికి బ్రిటన్ వెళ్లిను డాక్టరు చిన్మయ పండ్యా, తమ సతీమణి శఫాలీ పండ్యాతోపాటు అక్కడ గాయత్రీ పరివార్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శ్రద్ధేయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ కుమారులైన డాక్టర్ చిన్మయ పండ్యా ఇటీవల బ్రిటన్‌లోని లెస్టర్‌లో ఉన్న గాయత్రీ చేతనా కేంద్రంలోని మిషన్ కార్యకలాపాలలో క్రియాశీలంగా పాల్గొంటున్నారు. ఇటీవల దసరా పండుగ సందర్భంగా శ్రీమతి జసుబెన్ శర్మ గృహంలో గాయత్రీ యజ్ఞం జరిపారు. ఆ సందర్భంగా దేవసంస్కృతి విశ్వవిద్యాలయం విశిష్ట కృషిని, భావి ప్రణాళికలను గుండెలకు హత్తుకునే విధంగా వర్ణించారు.

H H H

**అంతరిక్షంలోకి ఎగిరిన మనిషి మానవత్వంలోకి ఎదగలేకపోతున్నాడు.**

# వార్తలు

# నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠంలో వేదమాత గాయత్రి పునః ప్రతిష్ఠ

పరమపూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత శ్రీరామశర్మ ఆచార్య, వందనీయ మాతాజీ భగవతీదేవిశర్మ సంరక్షణలో శాంతికుంజ్ హరిద్వార్ ఆశీస్సులతో నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠంలో నూతనంగా నిర్మించిన మందిరంలో వేదమాత గాయత్రి పునఃప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువుగా 26-1-04 వసంతపంచమి నాడు నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో భాగంగా 22-11-04 సాయంత్రం నుండి 72 గంటల పాటు అఖండ జపం జరిగింది.

24 సాయంకాలం హైదరాబాదునుండి వచ్చిన బృందం చేసిన గురువందనంతో తొలినాటి యజ్ఞకార్యక్రమం ఆరంభించబడింది. హైదరాబాదు యుగశక్తి గాయత్రీ కేంద్రం నుండి ప్రతినిధులుగా విచ్చేసిన శ్రీ విఠల్, శ్రీ బి.హనుమంతరెడ్డి బృందంతో కలసి యజ్ఞకార్యక్రమాన్ని నిర్వహించారు. నారాకోడూరు సర్పంచ్ శ్రీమతి శారద, జ్యోతిబాబు దంపతులు, మండల కేంద్రం చేబ్రోలుకు చెందిన వ్యాపారవేత్త శ్రీపరిమి సత్యనారాయణ దంపతులు దేవపూజనంలో పాల్గొన్నారు. 300 మంది యజ్ఞంలో పాల్గొని ఆహుతు లర్పించారు. 800 మంది మధ్యాహ్నం భోజన ప్రసాదం స్వీకరించారు. గురుదేవుల సాహిత్యం బ్రహ్మభోజనంగా సగం ధరకే అమ్మటం ప్రారంభించారు.

నాటి మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీ బి.హనుమంతరెడ్డి, రిటైర్డు విద్యాశాఖాధికారి, ఆధ్వర్యంలో **'విద్యావిస్తరణ సదస్సు'** నిర్వహించబడింది. తొలుత గాయత్రీ శక్తిపీఠం తరపున ట్రస్టీ దేవీప్రసాద్ స్వాగతం పలికి అతిథులను పరిచయం చేశారు. నారాకోడూరు జెడ్.పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ ముసాళ్ళ శంకరరావు, హిందూ కాలేజి పిజి సెంటర్ లెక్చరర్ శ్రీమతి టి.విజయ కృష్ణ ప్రసంగించారు.

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు సదస్సులో బహుమతి ప్రదానం చేయబడింది. గుంటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యావేత్త శ్రీగోగినేని కనకయ్య తమ సందేశాన్ని అందించారు. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ - గుంటూరు, చేతన - చోడవరం వ్యవస్థాపకులు, నిర్వాహకురాలు డా॥ నన్నపనేని మంగాదేవి విజేతలకు బహుమతులందించారు. శ్రీమురళీకృష్ణ వందన సమర్పణ చేశారు.

25-01-04 ఉదయం జరిగిన గాయత్రీ మహాయజ్ఞంలో గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ పాతూరి నాగభూషణం, తులసి గ్రూప్ చైర్మన్ శ్రీ రామచంద్ర ప్రభు దంపతులు దేవపూజనంలో పాల్గొన్నారు. మూడు విడతలుగా సందర్శకులు ఆహుతులు అర్పించారు. శ్రీ పాతూరి నాగభూషణం తమ చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన 'గోశాల'ను ఆరంభించారు.

నాటి మధ్యాహ్నం 4 గం॥కు 'మహిళా జాగరణ సదస్సు' నిర్వహించబడింది. 2004 సంవత్సరాన్ని మహిళాజాగరణ సంవత్సరంగా ప్రకటించి గాయత్రీ శక్తిపీఠం ఆదిశగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. అందులో 'ఆత్మబోధ-కర్తవ్య బోధ' అనే ప్రతిజ్ఞతో కూడిన సంతకాల కార్యక్రమం ఒకటి. ఈ సందర్భంలో మహిళలకు ఉద్యమస్ఫూర్తిగా దిశానిర్దేశం జరగాలనే తలంపుతో ఏర్పాటు చేయబడినదే ఈ సదస్సు. శ్రీమతి ఎస్.ప్రసూనాదేవి స్వాగతం పలుకగా శ్రీమతి టి. విజయకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డా॥ ప్రసన్న యశస్వి ప్రసంగించారు. ఆ తరువాత గుంటూరు తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణం నుండి వచ్చిన అధికారిణి శ్రీమతి కె.కృష్ణకుమారి 'మహిళల స్వావలంబన'పై ప్రసంగించారు.

ఈ సందర్భంగా, గుంటూరులో 75 సం॥ల క్రిందట ప్రముఖ సంఘసేవకులు, స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ఉన్నవ లక్ష్మీబాయమ్మ, లక్ష్మీనారాయణ దంపతులచే స్థాపించబడిన 'శ్రీ శారదా నికేతనము' సంస్థ తరపున ప్రిన్సిపాల్ శ్రీమతి వైష్ణవీ దుర్గ జ్ఞాపికను, సన్మానాన్ని అందుకున్నారు.

ప్రఖ్యాత హోమియో గ్రంథ రచయిత డా॥ నిమ్మగడ్డ రామలింగేశ్వరరావు రచించిన 'ఎయిడ్స్ అవగాహన - హోమియో చికిత్స' అనే చిన్న పుస్తకాన్ని డా॥ ప్రసన్న యశశ్వి విడుదల చేశారు. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన పెంచి దానినివారణకు హోమియో వైద్యవిధానంలో గల అనేక అవకాశాలను క్లుప్తంగా విశ్లేషించిన ఈ పుస్తకం మొదటిప్రతి

**మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః - మూర్ఖులు ఇతరులు చెప్పిన దానినే నమ్ముతారు**

శక్తిపీఠంలో ఎంతోకాలంగా నెలకు రెండు ఆదివారాలు ఉచిత హోమియో వైద్యసేవను అందిస్తున్న బాపట్లకు చెందిన డా॥ విద్యాసాగర్‌కు అందించబడింది. డా॥రామలింగేశ్వరరావును గాయత్రీ శక్తిపీఠం తరుపున డా॥ తుమ్మూరి శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందించారు.

ఈ సందర్భంగా డిగ్రీ, పి.జీ. విద్యార్థినులకు జిల్లా స్థాయిలో వ్యాసరచనపోటీ 'నా దృష్టిలో ఆదర్శమహిళ' అనే అంశంపై నిర్వహించబడింది. ఇందులో ఉత్తీర్ణులయిన విజేతలకు ఈ సమ్మేళనంలో బహుమతి ప్రదానం చేయబడింది.

అనంతరం దంపతుల సామూహిక ప్రతిజ్ఞల కార్యక్రమంలో హైదరాబాదు శాంతికుంజ్ ప్రతినిధిగా విచ్చేసిన శ్రీ రాకేష్ జైస్వాల్, శ్రీమతి ఉషల చేత శ్రీమతి టి.విజయకృష్ణ, శ్రీరామిరెడ్డి వివాహ ప్రతిజ్ఞలను చేయించారు.

నాటి సాయంత్రం దీపయజ్ఞం నిర్వహించబడింది. దీపయజ్ఞానికి హాజరయ్యేవారు ప్రమిదలు, వత్తులు, నెయ్యి వారే తెచ్చి అమర్చుకోవాలని గాయత్రీ శక్తిపీఠం ప్రకటించింది. ఈ ప్రక్రియ ఫలించి, ఘనంగా తాత్కాలిక యజ్ఞశాలలో దీపాలంకరణ జరిగింది.

డా॥ తుమ్మూరి నిర్వహణలో గుంటూరు ఆర్.డి.ఓ శ్రీకొసనా నాగబాబు దంపతులు దేవపూజనంలో పాల్గొన్నారు. శాసన సభ్యురాలు, మాజీ మంత్రిణి, గాయత్రీ భక్తురాలు డా॥శనక్కాయల అరుణ ముఖ్య అతిధిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి 800 మంది భోజన ప్రసాదం స్వీకరించారు.

మరునాడు ఉదయం ధ్యానానంతరం డా॥ తుమ్మూరి వసంతపంచమి పర్వదిన విశిష్టతను, పరమపూజ్య గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదిన ప్రాముఖ్యాన్ని వివరించారు. శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధుల మంత్రోచ్చారణతో శ్రీమతి తుమ్మూరి దాసమ్మ పునఃప్రతిష్ఠను నిర్వహించారు. సరిగా గం॥ 9-27ని॥కు మాతాజీ గానం చేసిన హారతి వినిపిస్తుండగా ఆలయద్వారాలు తెరువబడ్డాయి. సర్వాలంకార భూషిత అయిన గాయత్రీమాత మనోహరంగా దర్శనమిచ్చింది. జయఘోషతో గాయత్రీ శక్తిపీఠం మార్మోగింది. గుంటూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ యంపరాల వెంకటేశ్వరరావు, శాసన సభ్యులు డా॥ మాకినేని పెదరత్తయ్య గాయత్రీ మాతను దర్శించుకున్నారు. 24 కుండముల యజ్ఞంలో ఏడు విడతలుగా ఆహుతులు సమర్పించుకుని భోజన ప్రసాదాన్ని భక్తులు అందుకున్నారు. 5-6 వేల మంది హాజరయ్యారు.

## భీమిలి శక్తిపీఠంలో ధ్యానయోగ సాధనా శిబిరం

వసంత పంచమి సందర్భంగా భీమిలిలోని శ్రీదుర్గాగాయత్రి శక్తిపీఠంలో జనవరి 22 నుండి 26 వరకు డాక్టర్ ఎమ్.శ్రీరామకృష్ణ ధ్యానయోగ సాధనా శిబిరం నిర్వహించారు. శిబిరంలో రోజూ వ్యాయామం, ఆసనాలు, ప్రాణాయామం, స్వాధ్యాయం, ప్రవచనం జరిగాయి. 26న డా॥ శ్రీరామకృష్ణ పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. 400 మంది గురుదీక్షలు స్వీకరించారు. వివిధ సంస్కారాలు ఇవ్వబడ్డాయి.

ప్రతినెలా 24 లక్షల గాయత్రీ మంత్రజపం చేసి, శక్తి పీఠంలో పూర్ణాహుతి జరపాలని సాధకులు సంకల్పం చేశారు.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఒంగోలు, కర్నూలు, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాలనుండి వచ్చిన సాధకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీమతి జి.భారతి, డా॥చంద్రశేఖరం, శ్రీలక్ష్మీ గణపతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శ్రీయుతులు అవతారం రాజు, గణేశ్, రామకృష్ణ, కె.ఆర్.శర్మ, మహేశ్వరి, శ్రీమతి శ్రీలక్ష్మి సహకరించారు.

## చోడవరంలో 24 కుండముల యజ్ఞం

చినమేరంగి జయశ్రీ సంతోషి గాయత్రీ శక్తిపీఠం ఆధ్వర్యంలో విశాఖజిల్లా చోడవరంలో శ్రీ సత్యసాయిబాబా 78వ జన్మదిన సందర్భంగా 2003 నవంబరు 22న 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. నాటి సాయంత్రం 2400 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. 23న 500మందికి నారాయణ సేవ జరిగింది. 500 మందికి రగ్గులు దానం చేశారు. గాయత్రీ మంత్రదీక్ష పొందారు.

కార్యక్రమంలో 5000 మంది పాల్గొన్నారు. కార్యక్రమానికి ముంది శ్రీ పి.వి.ఎస్.సత్యనారాయణ మూర్తి సారథ్యంలో సత్యసాయి ఫిలిమ్స్ అధినేత శ్రీ పి.సీతారామకుమార్ (బాబ్జి)తో సహా 78మంది దంపతులతో, 108 కలశాలతో శోభాయాత్ర జరిగింది. శ్రీ సుదర్శన బ్రహ్మ అగ్నిహోత్రి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## విజయవాడ పుస్తక మహోత్సవంలో గాయత్రీ పరివార్ స్టాల్

విజయవాడలో జనవరి 1 నుండి 11 వరకు జరిగిన 15వ పుస్తక మహోత్సవంలో గాయత్రీ పరివార్ పుస్తకాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. యుగ సాహిత్యం, క్యాసెట్లు, సిడిలు, ప్రజాపేయ,

**జంతూనాం నరజన్మ దుర్లభమ్ - ప్రాణికోటిలో మానవజన్మ దుర్లభం**

జపమాలలు, హవన సామాగ్రి, యజ్ఞ కుండీలు, క్యాలెండర్లు, ఆయుర్వేద ఔషధాల, గోమూత్ర ఔషధాలు, యజ్ఞోపవీతాలు, వ్యసన విముక్తి ఔషధాలు స్టాల్‌లో పెట్టారు. స్టాల్ ద్వారా గాయత్రీ పరివార్ గురించి భారీయెత్తున ప్రచారం జరిగింది.

విజయవాడ సబ్‌జోనల్ కార్యాలయంలో 2003 డిసెంబరు నెలలో పౌర్ణమినాడు 3 కుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది.

డిసెంబరు 4న గీతాజయంతి రోజున కార్యాలయంలో యజ్ఞం జరిగింది.

డిసెంబరు 25న డా॥ వెంకటేశ్వర రావు గృహంలో 5 కుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది.

డిసెంబరు 27న విజయవాడ సమీపంలోని నిజమానూరులో జరిగిన గాయత్రీ యజ్ఞంలో 200 పాల్గొన్నారు.

డిసెంబరు 31న విజయవాడ పాతబస్తీలోని కొత్తగుల్లలో జరిగిన దీపయజ్ఞంలో 100 మంది పాల్గొన్నారు.

## తెనాలిలో గాయత్రీ యజ్ఞం

తెనాలి నాజర్‌పేటలోని శ్రీనారిశెట్టి వెంకటేశ్వర్లు గృహంలో 2003 నవంబరు 51 శ్రీమతి అనసూయమ్మ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఆసందర్భంగా 40 మంది గురు దీక్ష తీసుకున్నారు.

## గుంటూరులో గాయత్రీ యజ్ఞాలు

గుంటూరు నెహ్రూనగరంలో శ్రీవుయ్యూరు వెంకటరెడ్డి గృహంలో సాయి మురళిరెడ్డి జన్మదిన సందర్భంగా 2003 డిసెంబరు 28 సాయంత్రం దీపయజ్ఞం, 29 ఉదయం గాయత్రీ హోమం జరిగాయి. పుంసవన సంస్కారం జరిగింది.

డిసెంబరు 19న నెహ్రూనగర్‌లో జరిగిన దీపయజ్ఞంలో 60మంది పాల్గొన్నారు.

డిసెంబరు 20న శ్రీ సత్యమాధవ్ గృహంలో గాయత్రీ యజ్ఞం జరిగింది.

2004 జనవరి 1న గుంటూరులోని శ్రీనేరెళ్ల ఉదయలక్ష్మి వెంకటకృష్ణారావు గృహంలో జరిగిన గాయత్రీ యజ్ఞంలో 25మంది పాల్గొన్నారు.

జనవరి 3న గుంటూరులోని చి.వెంకటేశ్వర్లు గృహంలో జరిగిన గాయత్రీ యజ్ఞంలో 40 మంది పాల్గొన్నారు.

జనవరి 4న గుంటూరులోని ఆర్.అగ్రహారం శ్రీసాయిబాబా ఆలయ 55వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన గాయత్రీ యజ్ఞంలో 100మంది పాల్గొన్నారు.

పై యజ్ఞాలను శ్రీమతి అనసూయమ్మ నిర్వహించారు. శ్రీయుతులు నేరెళ్ల ఉదయలక్ష్మి, భారతి లక్ష్మి సహకరించారు.

## చీరాలలో భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష విజేతలకు పురస్కారాలు

నవంబరు 30 సాయంత్రం చీరాలలో జరిగిన సభలో శాంతికుంజ్ ప్రతినిధి శ్రీరాకేష్ జైస్వాల్, శ్రీమతి ఉషా జైస్వాల్‌లు భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 2003 జూన్‌లో జరిగిన 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జమా ఖర్చులను సభకు సమర్పించడం జరిగింది. హైదరాబాదు వరిష్ఠ కార్యకర్త శ్రీవిఠల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీయుతులు కె.వి.చలపతి రావు, రవీంద్ర, సాంబశివరావు, పి.శ్రీమన్నారాయణ మూర్తి, ఎస్.మహేష్, డి.బాపయ్య, నూనె శ్రీను, పి.శ్రీను, ముప్పల సత్యనారాయణ, నూనె సాంబశివరావు, సుధాకర్ దంపతులు, శ్రీమతులు రమాదేవి, కుమారి సుజాత, తులసీ కుమారి, సువర్ణ సహకరం అందించారు.

వసంత పంచమి సందర్భంగా జనవరి 26న చీరాలలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీయుతులు డి.వి.ఆర్.మూర్తి, ఎస్.ఎస్. ప్రసాద్ పంచకుండీ మహాయజ్ఞం నిర్వహించారు.

## చింతలపూడిలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం

పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడిలో జనవరి 11న డాక్టర్ తుమ్మూరి ఆధ్వర్యంలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞాన్ని వైభవంగా జరిగింది. దైవస్థానం అధికారి శ్రీ కె.రామారావు, ఎస్.ఎస్.వైధానులు, శ్రీయుతులు జి.లింగారెడ్డి, నాగేశ్వరరావు, కుమార్, అంజిబాబు సహకరించారు. శ్రీ గంగాధర్, శ్రీ రమేష్‌జీ శ్రీమల్లేశ్‌జీ ముఖ్య అతిధులుగా విచ్చేశారు. 300 మంది సాధకులు యజ్ఞంలో పాల్గొన్నారు.

## హైదరాబాదులో వసంత పంచమి ఉత్సవం

వసంత పంచమి సందర్భంగా హైదరాబాదులోని యుగశక్తి గాయత్రి కేంద్రంలో జనవరి 25న ఉదయంనుండి సాయంత్రం వరకు అఖండ గాయత్రీ జపం జరిగింది. 26 ఉదయం 5 కుండముల గాయత్రీ యజ్ఞం, సాయంత్రం దీపయజ్ఞం జరిగాయి.

H H H

**ప్రశాంతమైన మనస్సు నిజమైన మూలధనం**